


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ 22 గురువారం మే 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 247
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur




## మావో అగ్రనేత హతం

- మావోయిస్టు అగ్రనేత బసవరాజు అలియాస్ నంబాల కేశవరావు హతం
- 2018లో గణపతి తర్వాత పార్టీ సుప్రీం కమాండర్‌గా బాధ్యతలు
- శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట స్వగ్రామం
- వరంగల్ ఆర్ఈసీలో ఎం.టెక్, అక్కడే విప్లవ భావజాలం వైపు ఆకర్షణ
- 1983లో అజ్ఞాతంలోకి, అప్పటినుంచి గ్రామంతో సంబంధాలు కట్

2




హైదరాబాద్-నవభూమిబ్యూరో
మావోయిస్టు పార్టీకి చెందిన అత్యంత కీలకమైన అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన భీకరమైన ఎదురుకాల్పుల్లో మరణించారు. ఈ విషయాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్వయంగా ధ్రువీకరించారు. మావోయిస్టు ఉద్యమానికి ఇది పెద్ద ఎదురుదెబ్బగా భద్రతా వర్గాలు భావిస్తున్నాయి.
ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా మాధ్ అటవీ ప్రాంతంలో బుధవారం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ కాల్పుల్లో మొత్తం 27 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారికంగా ప్రకటించారు. మరణించిన వారిలో నంబాల కేశవరావు కూడా ఉన్నట్లు గుర్తించారు. ఇటీవల లొంగిపోయిన కొందరు మావోలు నంబాల కేశవరావును గుర్తించినట్టు సమాచారం. ఆయన తలపై రూ.1.5 కోట్ల భారీ రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు.

**నంబాల కేశవరావు నేపథ్యం**

నంబాల కేశవరావు స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలం జియన్నపేట గ్రామం. ఆయన 1995లో జన్మించినట్లు సమాచారం. ఆయన తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడిగా పనిచేసేవారు. కేశవరావుకు ఒక సోదరుడు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. ప్రాథమిక విద్యను తన సొంత ఊరిలోనే పూర్తి చేసిన కేశవరావు, ఉన్నత పాఠశాల విద్యను టెక్కలి మండలం తలగాంలోని తన తాతగారి గ్రామంలో అభ్యసించారు. అనంతరం టెక్కలి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో చేరారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ, డిగ్రీ విద్యను

## ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

- 28 మంది మావోయిస్టుల హతం
- నారాయణపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్
- మావో అగ్రనేత నంబాల కేశవరావు మృతి

2



## ఎన్‌కౌంటర్‌లో చనిపోయింది కేశవరావే

కేంద్ర మంత్రి అమిత్ షా ప్రకటన 2

## పాక్‌తో జ్యోతికి లింకులు

- అంగీకరించిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా
- ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌కు సమాచారం చేరవేత
- పాక్ ఇంటలిజెన్స్‌తో సంబంధాలున్నట్లు అంగీరించిన జ్యోతి
- పాక్ హైకమిషనర్ ఉద్యోగి డానిష్‌తో నిత్యంతో టచ్‌లో జ్యోతి

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో
ఆపరేషన్ సింధూర్ సమయంలో కూడా జ్యోతి పాక్‌కు సమాచారం చేరవేసినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. గూఢచర్యం ఆరోపణలతో అరెస్టయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా పాక్ ఇంటెలిజెన్స్ అధికారులతో తనకు సంబంధాలున్నట్లు అంగీకరించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఒక ఆంగ్ల మీడియా సంస్థ ఈ విషయాన్ని వెల్లడించింది. పాక్ హైకమిషన్‌లో పనిచేసే డానిష్‌తో తాను నిత్యం టచ్‌లో ఉండేదాన్నని జ్యోతి విచారణలో పేర్కొంది. 2023లో వీసా

## వరుస నష్టాలకు బ్రేక్

- 400 పాయింట్లకు పైగా లాభపడిన సెన్సెక్స్
- సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో ముగిసిన మార్కెట్
- ఆటో, బ్యాంక్, ఎఫ్ఎమ్‌సీజీ రంగాలకు లాభం

2



ముంబై-నవభూమిబ్యూరో
వరుసగా మూడు రోజులుగా నష్టపోతున్న స్టాక్ మార్కెట్ బుధవారం లాభాల బాటలో సాగింది. ఫార్మా, రియాల్టీ షేర్లు లాభాల బాటలో సాగడం దేశీయ సూచీలకు కలిసివచ్చింది. అలాగే ఆటో, బ్యాంక్, ఎఫ్ఎమ్‌సీజీ రంగాలు కూడా లాభపడ్డాయి. అయితే విదేశీ మదుపర్ల అమ్మకాలు తగ్గకపోవడం కాస్త ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఓ దశలో భారీగా లాభపడిన సూచీలు చివరకు ఓ మోస్తారు లాభాలతో రోజును ముగించాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో ముగిశాయి. మంగళవారం ముగింపు (81, 186)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 150 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింతగా లాభాల్లోకి దూసుకెళ్లింది. ఒక దశలో 800 పాయింట్లకు పైగా లాభపడి 82, 021 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. అయితే మధ్యాహ్నం తర్వాత అమ్మకాలు మొదలయ్యాయి. దీంతో సెన్సెక్స్ కిందకు దిగి వచ్చింది. చివరకు 410 పాయింట్ల లాభంతో 81, 596 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. 129 పాయింట్ల లాభంతో 24, 813 వద్ద రోజును ముగించింది. సెన్సెక్స్‌లో భారత్ ఎలక్ట్రానిక్స్, సీమన్స్, సోలార్ ఇండస్ట్రీస్,

## తెలంగాణలో భారీ వర్షాలు

- హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు
- వరుసగా 5రోజుల పాటు వర్షాలున్నాయన్న వాతావరణ శాఖ
- ధాన్యం దెబ్బతినకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలి
- తక్షణం కాంటాలు వేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

2



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షం పడుతోంది. వర్షం దంచికొడుతుం డటంతో తెలంగాణ ప్రభుత్వం అలర్ట్ అయింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి. బుధవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా వర్షానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి సీఎం తెలుసుకున్నారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు ముఖ్యమంత్రి. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. హైదరాబాద్ సిటీలో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు సీఎం రేవంత్‌రెడ్డి. జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్ విభాగాలు

## సునీతారావుకు షోకాజ్ నోటీసు

- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌పై వ్యాఖ్యలు, గాంధీభవన్‌లో నిరసన
- టీ.కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిని తప్పుబట్టిన కాంగ్రెస్ అధిష్టానం
- క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు సునీతా రావుకు నోటీసులు
- వారంరోజుల్లో వివరణ ఇవ్వాలంటూ అధిష్టానం ఆదేశం



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతా రావుకు పార్టీ అధిష్టానం షోకాజ్ నోటీసులిచ్చింది. టీపీసీసీ చీఫ్

## రాహుల్, సోనియాలకు బిగుస్తున్న 'ఈడీ' ఉచ్చు

- సోనియా,రాహుల్ అక్రమంగా రూ.142 కోట్లు లబ్ధి పొందినట్లు ఈడీ ఆరోపణ

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో
నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సంచలన ఆరోపణలు

## వక్ఫ్ అనేది ఇస్లామిక్ భావనే

- వక్ఫ్ ఇస్లాంలో కీలక భాగం కాదన్న కేంద్రం
- ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల మీద
- సుప్రీంకోర్టులో కొనసాగుతున్న విచారణ

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో
వక్ఫ్ సవరణ చట్టం-2025పై విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వక్ఫ్ అనేది ఇస్లామిక్ భావనే గానీ ఇది ఇస్లాంలో కీలక భాగం కాదని తెలిపింది. ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల మీద మంగళవారంతో పాటు కూడా విచారణ జరిగింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సంచలన వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్ అనేది ఇస్లామిక్ భావనే గానీ ఇస్లాంలో కీలక భాగం కాదన్నారు. ఇది ప్రాథమిక హక్కు కాదన్నారు తుషార్ మెహతా. ఆయన ఇంకా ఏం అన్నారో ఇప్పుడు చూద్దాం..

**పక్కదారి పట్టిస్తే ఊరుకోం!**

దేశంలోని 140 కోట్ల మంది ప్రజలను, వాళ్ల ఆస్తుల్ని సంరక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం మీద ఉందన్నారు తుషార్ మెహతా.



# రేపట్నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం..



**హైదరాబాద్-నవభూమి:** ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను పరీక్షలకు అనుమతిస్తారు. మార్చిలో నిర్వహించిన వార్షిక పరీక్షల్లోను ఐదు నిమిషాల సడలింపునిచ్చిన విషయం తెలిసిందే. తాజాగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లోను ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను పరీక్షకు అనుమతిస్తామని ఇంటర్‌బోర్డు కార్యదర్శి క్రిష్ణ ఆదిత్య తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్ విద్యార్థులకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు సెకండియర్ విద్యార్థులకు పరీక్షలను నిర్వహిస్తారు. ఉదయం 9.05 గంటలు, మధ్యాహ్నం 2.35 గంటల తర్వాత వచ్చిన వారిని పరీక్షకు అస్సలు అనుమతించరు.
అయితే గురువారం ప్రారంభమైన పరీక్షలు ఈ నెల 29తో ముగుస్తాయి. ఈ సారి 4.2లక్షల విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, రాష్ట్రవ్యాప్తంగా 892 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేసినట్లు బోర్డు కార్యదర్శి క్రిష్ణ ఆదిత్య వెల్లడించారు.

## నవ వార్త



## తెలంగాణలో వారందరికీ శుభవార్త.. ఇక నుంచి వారికి కూడా రూ. లక్ష ఆర్థిక సాయం



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం దివ్యాంగులకు గుడ్‌న్యూస్ చెప్పింది. మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో.. ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకున్నా వారికి రూ.లక్ష వివాహ ప్రోత్సాహం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం తాజాగా జీవో కూడా జారీ చేసింది. గతంలో వివాహం చేసుకున్న జంటలో ఒక్కరు దివ్యాంగులైతేనే ఈ వివాహ ప్రోత్సాహం లభించేది. తాజా నిర్ణయంతో ఇద్దరు దివ్యాంగులు పెళ్లి చేసుకున్నా వారికి నగదు ప్రోత్సాహం అందించనున్నారు.తెలంగాణ మహిళా శిశు వయోవృద్ధులు దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈ సమస్యను గుర్తించి.. దానిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి.. ఇద్దరు దివ్యాంగులు పెళ్లి చేసుకున్నప్పటికీ.. వారికి రూ. లక్ష ఆర్థిక సహాయం పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. దీంతో ఆ ప్రతిపాదనకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ ఆదేశాలు జారీ చేశారు.
ఈ పథకం అర్హతలు..వధూవరులు ఇద్దరూ దివ్యాంగులై ఉండాలి.
వధూవరులు ఇద్దరికీ ప్రభుత్వం జారీ చేసిన దివ్యాంగుల ధృవీకరణ పత్రం ఉండాలి.
వధువుకు కనీసం 18 సంవత్సరాలు, వరుడికి కనీసం 21 సంవత్సరాలు నిండి ఉండాలి.
వధూవరులు ఇద్దరూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారే కావాలి.
ఇక తాజా నిర్ణయం ప్రకారం ఇకపై ఇద్దరు దివ్యాంగులు ఒకరినొకరు వివాహం చేసుకున్నా వారికి కూడా ప్రభుత్వం నుంచి రూ.లక్ష ఆర్థిక సహాయం అందినుంది. ఇప్పటి వరకూ ఒకరు దివ్యాంగుడు లేదా దివ్యాంగురాలు కాగా.. మరొకరు సాధారణ వ్యక్తి అయినప్పుడు మాత్రమే ఈ పథకం వర్తించేది. అయితే ఇద్దరూ దివ్యాంగులు పెళ్లి చేసుకున్నపుడు ఈ పథకం వర్తించకపోవడంతో చాలామంది తమ అసంతృప్తిని వ్యక్తం చేసేవారు. ఇప్పుడు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపుతూ ప్రభుత్వం వారికి కూడా ఈ పథకాన్ని వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.
అనాథలకు ఆరోగ్యశ్రీ
ఆరోగ్య శ్రీ పథకం వర్తింపు విషయంలోనూ తెలంగాణ సర్కార్ మరో శుభవార్త అందించింది. హైదరాబాద్‌లో తల్లిదండ్రులు, సంరక్షకులు, బంధువులు లేని అనాథ పిల్లలకు కూడా ఇక నుంచి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం వర్తించేలా ఆదేశారు జారీ చేసింది. రాష్ట్రంలోనే తొలిసారిగా హైదరాబాద్ జిల్లాలోని 2200 మంది అనాథ చిన్నారులకు అధికారులు ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఈ పథకం ద్వారా అనాథ బాలలకు ఆరోగ్య సంరక్షణ అందుబాటులోకి వస్తుంది.

## తెలంగాణలో ఐదురోజులు భారీ వర్షాలు.. ఐఎండీ వార్నింగ్

హైదరాబాద్-నవభూమి: ద్రోణి ప్రభావంతో తెలంగాణ రాగల



ఐదురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తర కర్నాటక-గోవా తీరాల వెంబడి తూర్పు మధ్య అరేబియా సముద్రంపైనున్న ఉపరితల ఆవర్తం నుంచి కోస్తాంధ్ర వరకు ద్రోణి సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందని.. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంతాలు, పరిసరాలను ఆనుకొని ఉన్న దక్షిణ తెలంగాణపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల విస్తరించి ఉందని వాతావరణశాఖ పేర్కొంది.ఈ క్రమంలో బుధవారం నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వానలు పడే అవకాశాలున్నాయని చెప్పింది.గురువారం కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వానలుపడుతాయని తెలిపింది. కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పింది. అలాగే, శుక్ర, శని, ఆదివారాల్లోనూ హైదరాబాద్ సహా ఉత్తర, దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వానలు పడుతాయని వాతావరణశాఖ వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

## కోదాడలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్

**సూర్యాపేట-నవభూమి:** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కోదాడలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. హుజూర్ నగర్ (మం) మేళ్లచెరువులో ల్యాండ్ కావాల్సిన హెలికాప్టర్ వాతావరణ శాఖ సూచన మేరకు అత్యవసరగా కోదాడలో ల్యాండింగ్ అయింది. కమ్ముకున్న మబ్బులు, గాలివాన నేపథ్యంలో వాతావరణ శాఖ అధికారుల సూచన మేరకు అప్రమత్తమైన పైలట్ అత్యవసరంగా ల్యాండ్ చేశారు. కాగా, మంత్రి కోదాడ నుంచి హుజూర్ నగర్‌కు రోడ్డు మార్గంలో వెళ్లిపోయారు.

# అక్కడ అక్రమ నిర్మాణాలకు చెక్..



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ మహానగరంలో ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో ఏర్పాటైన 'హైడ్రా' సంస్థ.. వరుస కూల్చివేతలతో తన ఉనికిని చాటుకుంటోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైనప్పటి నుండి.. హైడ్రాకు వేలాది ఫిర్యాదులు వస్తున్నాయని కమిషనర్ రంగనాథ్ స్వయంగా వెల్లడించారు. అక్రమార్కుల చెరలో ఉన్న తమ భూములను విడిపించాలని ఎంతో మంది ప్రజలు హైడ్రాను ఆశ్రయిస్తున్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, భూ ఆక్రమణ నిజమని నిర్ధారించుకున్న తర్వాతే హైడ్రా బృందాలు రంగంలోకి దిగుతున్నాయి. ఈ పారదర్శక విధానం ప్రజల్లో విశ్వాసాన్ని నింపుతోంది.తాజాగా.. మేడ్చల్ జిల్లాలోని మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. సర్వే నంబర్ 26ఏలోని సీపీఆర్ఐ పవర్ సంస్థ, సేజ్ స్కూల్ ప్రాంగణంలోని ఆర్ఏఆర్ కాలనీకి సంబంధించిన రహదారిని కబ్జా చేసి నిర్మించిన నిర్మాణాలపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు.. సీఐ సైదులు నేతృత్వంలో జేసీబీలతో రహదారి ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. పీర్జాదిగూడలో ఇలాంటి అక్రమ నిర్మాణాలు ఇంకా చాలా ఉన్నాయని, వాటిపై కూడా హైడ్రా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.
అంతకుముందు.. మే 19న మియాపూర్, హైదర్ నగర్ సమీపంలోని సర్వే నంబర్ 145/3లో అక్రమ నిర్మాణాలను హైడ్రా తొలగించింది. ఇక్కడ 25 ఏళ్ల క్రితం 9 ఎకరాల 30 గుంటల విస్తీర్ణంలో 'డైమండ్ హిల్స్' పేరిట ఒక అసోసియేషన్ ఏర్పాటు చేయబడింది. ఈ లేఅవుట్‌లో మొత్తం 79 ప్లాట్లు ఉండగా.. కొందరు వ్యక్తులు వాటిని ఆక్రమించారు. తొమ్మిది నెలల క్రితం హైకోర్టు ఈ స్థలాన్ని హెచ్ఎండిఏ లేఅవుట్‌గా ధృవీకరించి.. ఆక్రమణదారులను ఖాళీ చేయాలని ఆదేశించింది. అయినప్పటికీ వారు స్థలాన్ని విడిచిపెట్టకపోవడంతో.. బాధితులు హైడ్రాను ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల ప్రకారం హైడ్రా ఉదయం నుండి కూల్చివేతలను ప్రారంభించింది. అక్రమ నిర్మాణాలు అని తెలియక వాటిని కొనుగోలు చేసిన కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలా ఉండగా.. మణికొండలోని తిరుమల హిల్స్ కాలనీ పార్కులో ఉన్న అక్రమ నిర్మాణాలను కూడా హైడ్రా నేలమట్టం చేసింది. హైడ్రా అధికారుల ఆదేశాలతో అనుమతి లేని కట్టడాలను మణికొండ మున్సిపాలిటీ అధికారులు కూల్చివేశారు. తిరుమల హిల్స్ కాలనీకి చెందిన స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని నిర్ధారణ కావడంతో.. హైడ్రా చీఫ్ రంగనాథ్ కూల్చివేతకు నిర్ణయించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నార్సింగి పోలీసుల భద్రత మధ్య జేసీబీలతో ఆక్రమణలను తొలగించారు. అయితే.. ఈ స్థలం కాలనీ పరిధిలోకి వస్తుందని, తమకు హెచ్ఎండిఏ అనుమతి కూడా ఉందని.. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఎలా కూలుస్తారని కాలనీ వాసులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీనిపై మణికొండ టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్ సింగ్ స్పందిస్తూ.. ఈ స్థలం తిరుమల హిల్స్ పార్కుకు చెందినదని, అందుకే అక్రమ నిర్మాణాలను కూల్చివేశామని తెలిపారు.

# తెలంగాణలో భూముల మార్కెట్ విలువ పెంపు



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం వేగంగా వృద్ధి చెందుతోంది. భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అయితే మారు మూల పల్లెల్లోనూ ఎకరం లక్షల్లో పలుకుతుండగా.. ప్రభుత్వ రికార్డుల్లోని వాటి విలువలు తక్కువగా ఉంటుంది. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. భూముల మార్కెట్ విలువ, రిజిస్ట్రేషన్ వాల్యూ మధ్య వ్యత్యాసాన్ని తగ్గించి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. భూముల మార్కెట్ విలువలను పెంచేందుకు వేగంగా అడుగులు వేస్తోంది.ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో జరిగిన వనరుల సమీకరణ సమావేశంలో భూముల విలువ పెంపుపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు సూచించారు. దీనితో రాష్ట్ర స్థాయిలో మార్కెట్ విలువల కేంద్ర మదింపు సలహా కమిటీ సమావేశమై ఈ అంశంపై చర్చించింది. గతంలోనే ఒక ప్రైవేట్ ఏజెన్సీతో భూముల విలువ పెంపుపై అధ్యయనం చేయించిన ప్రభుత్వం, ఆ నివేదిక ఆధారంగా ఆదాయాన్ని పెంచే మార్గాలను పరిశీలించాలని రిజిస్ట్రేషన్ శాఖకు సూచించింది. పలు దఫాలు సమావేశమైన అధికారులు తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదించారు. రకరకాల కారణాలతో వాయిదా పడుతూ వస్తున్న ఈ విలువ పెంపుపై త్వరలోనే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. తాజాగా నివేదిక ఇవ్వాలని కోరడంతో పెంపు ఖాయమనే చర్చ జరుగుతోంది.రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ చైర్మన్‌గా, జాయింట్ ఐజీ కన్వీనర్‌గా వ్యవహరించే %జవాాజ%లో సీసీఎల్ఏ కార్యదర్శి, ఇతర శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ భూముల మార్కెట్ విలువలను సమీక్షించి, అవసరమైన సిఫార్సులతో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తుంది. మంగళవారం రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో సీవీఏసీ సమావేశమై మార్కెట్ విలువలపై చర్చించింది. త్వరలో మరోసారి సమావేశమై పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుంది. భూముల విలువలను ఎంత పెంచాలనేది ప్రభుత్వమే నిర్ణయించుకోవాలని, అయితే ఈ పెంపు శాస్త్రీయంగా ఉండాలని థర్డ్ పార్టీ ఏజెన్సీ తన నివేదికలో పేర్కొంది.అధికారులు తయారు చేసిన నివేదిక శాస్త్రీయంగా ఉందా, భూముల వాస్తవ ధరలకు, పుస్తక విలువలకు మధ్య ఉన్న వ్యత్యాసం ఎంత, దానిని సవరించాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, శాస్త్రీయంగా పెంచడం వల్ల కలిగే ప్రయోజనాలు వంటి అంశాలపై ఏజెన్సీ తన అభిప్రాయాన్ని తెలియజేసింది. ఈ నిర్ణయం ప్రభుత్వానికి అదనపు ఆదాయాన్ని సమకూర్చడమే కాకుండా.. భూముల మార్కెట్ విలువలను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తీసుకురావడంలో సహాయపడతాయని అధికారులు భావిస్తున్నారు.

# ఎన్‌కౌంటర్‌లో చనిపోయింది కేశవరావే

**న్యూఢిల్లీ-నవభూమి:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు మరణించారు. ఈ కీలక పరిణామంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. బుధవారం ఉదయం జరిగిన ఈ ఆపరేషన్‌లో మొత్తం 27 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు, వారిలో బసవరాజు కూడా ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారని ఆయన తెలిపారు. బసవరాజు తలపై రూ.1.5 కోట్ల భారీ రివార్డు ఉందని అధికారులు వెల్లడించారు.
ఎన్ కౌంటర్ మృతుల్లో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు ఉన్నాడని ఉదయం నుంచి ఇప్పటివరకు అనే కథనాలు వచ్చినప్పటికీ, అమిత్ షా చేసిన తాజా ప్రకటనతో ఆయన మృతి విషయం నిర్ధారణ అయింది.

**నక్సలిజం నిర్మూలనలో కీలక విజయం: అమిత్ షా**

ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందిస్తూ, "నక్సలిజం నిర్మూలన దిశగా సాగుతున్న పోరాటంలో ఇదొక మైలురాయి లాంటి విజయం. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో జరిగిన ఆపరేషన్‌లో 27 మంది మావోయిస్టులు హతమయ్యారు. వీరిలో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి, నక్సల్ ఉద్యమానికి వెన్నెముకగా భావించే నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు కూడా ఉన్నారు" అని పేర్కొన్నారు.
గత 3 దశాబ్దాలుగా నక్సలిజానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో, పార్టీ ప్రధాన కార్యదర్శి స్థాయి నేత మరణించడం ఇదే మొదటిసారని అమిత్ షా తెలిపారు. భద్రతా దళాల సాహసోపేత చర్యలను ఆయన అభినందించారు. "ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ పూర్తయిన తర్వాత ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కలిపి 54 మంది నక్సలైట్లు అరెస్టు కాగా, 84 మంది లొంగిపోయారు. 2026 మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు మోదీ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉంది" అని అమిత్ షా తన ఎక్స్ పోస్టులో వివరించారు.

# సునీతారావుకు షోకాజ్ నోటీసు

**(1వపేజీ తరువాయి)** మహేష్ గౌడ్‌పై చేసిన వ్యాఖ్యలు, గాంధీ భవన్‌లో నిరసన చేయడాన్ని కాంగ్రెస్ అధిష్టానం తప్పుబట్టింది. క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు సునీతా రావుకు జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నోటీసు జారీ చేశారు. సునీతా రావుకు ఏమైనా ఇబ్బంది ఉంటే పార్టీలో చర్చించాలి కానీ బహిరంగంగా మాట్లాడడం తప్పని.. దీనిపై 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని జాతీయ మహిళా కాంగ్రెస్ లేఖలో పేర్కొంది. వివరణ ఇవ్వకపోతే కాంగ్రెస్ నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని నోటీసులో అధిష్టానం స్పష్టం చేసింది. కాగా.. కొద్ది రోజుల క్రితం గాంధీభవన్‌లో సునీతా రావు నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ముఖ్యంగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌పై పలు వ్యాఖ్యలు చేశారు. టీపీసీసీ చీఫ్ ఛాంబర్ ఎదుట సునీతారావు ధర్నాకు దిగారు. పది మంది మహిళా నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. కాంగ్రెస్ మహిళా నేతలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని.. పోస్టుల విషయంలో మహిళా నాయకులను పార్టీ పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం, కార్పొరేషన్ పదవుల్లోనూ మహిళా నేతలకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని విమర్శించారు. మహేష్ గౌడ్ బంధువులకే పదవులు కట్టబెడుతున్నారంటూ ఆరోపణలు గుప్పించారు. కార్పొరేషన్లు, పార్టీ కమిటీల్లో మహిళా కాంగ్రెస్ నేతలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ సునీతారావు గాంధీభవన్‌లో ఆందోళనకు దిగారు.ఈ క్రమంలో అధికార పార్టీలో ఉంటూ పార్టీ ఆఫీసులో నిరసన చేపట్టడాన్ని అధిష్టానం తీవ్రంగా తప్పుబట్టింది. అలాగే టీపీసీసీ చీఫ్‌పై ఆరోపణలు చేయడాన్ని మహిళా కాంగ్రెస్ జాతీయ నాయకత్వం తప్పుబట్టింది. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా సునీతారావుకు జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నోటీసులు జారీ చేశారు.

# బెంగళూరులో రికార్డు స్థాయిలో కురిసిన భారీ వర్షం

**బెంగళూరు-నవభూమి:** భారతదేశ సిలికాన్ వ్యాలీగా పేరుగాంచిన బెంగళూరు నగరాన్ని భారీ వర్షాలు ముంచెత్తాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈ నేపథ్యంలో, పలు ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులకు ఇంటి నుంచి పనిచేసే (వర్క్ ఫ్రమ్ హోమ్) వెసులుబాటు కల్పించాలని బెంగళూరు సెంట్రల్ బీజేపీ ఎంపీ పీసీ మోహన్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కొన్ని సంస్థలు ఈ దిశగా చర్యలు తీసుకున్నాయి.
బెంగళూరులో కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం (మే 18) ఉదయం 8:30 నుంచి సోమవారం (మే 19) ఉదయం 8:30 గంటల మధ్య 24 గంటల వ్యవధిలో నగరంలో 105.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

**(1వపేజీ తరువాయి)** చెందినట్టు సమాచారం

**ఇంకా కొనసాగుతున్న ఎదురుకాల్పులు**

ఛత్తీస్ గఢ్ అడవులు మరోసారి తుపాకుల గర్జనతో దద్దరిల్లాయి. నారాయణపూర్ జిల్లాలో జరిగిన ఎన్ కౌంటర్ లో ఏకంగా 28 మంది మావోయిస్టులు హతమయ్యారు. మృతుల్లో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఉన్నట్టు సమాచారం. మరికొందరు మావోలు గాయపడినట్టు సమాచారం.
మాఢ్ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో భద్రతాబలగాలు ఈ ఆపరేషన్ చేపట్టాయి. బీజాపూర్, నారాయణపూర్, దంతెవాడ డీఆర్జీ బలగాలు ఆపరేషన్ లో పాల్గొన్నాయి. ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతున్నాయి.

## రాహుల్, సోనియాలకు బిగుస్తున్న 'ఈడీ' ఉచ్చు

**(1వపేజీ తరువాయి)** చేసింది. ఈ నేరంలో వారు రూ.142 కోట్లు అక్రమంగా లబ్ధి పొందారని ఈడీ ఆరోపించింది. నేరపూరిత ఆర్జనతో మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని, ఆ తర్వాత కూడా వారు అదే పంథాను కొనసాగించారని పేర్కొంది. బుధవారం ఢిల్లీ ప్రత్యేక కోర్టులో జరిగిన విచారణలో భాగంగా ఈడీ ఈ వాదనను వినిపించింది. %హాశ్రీంశీ =ఝు౦% - వైసీపీ వస్తే ఆమెకే హోంమంత్రి పదవి.. సోషల్ మీడియాలో వీడియో వైరల్! నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీ లాండరింగ్ ఆరోపణలతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఈడీ అధికారులు గతంలో పలుమార్లు విచారించిన విషయం తెలిసిందే. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచిపోయినప్పటికీ, ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. -రూ.661 కోట్ల ఆస్తుల స్వాధీనానికి చర్యలు: ఈ కేసులో భాగంగా 2023, నవంబరులో ఈడీ అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. ప్రస్తుతం ఆ ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా నోటీసులు జారీ చేసింది. ఆయా ఆస్తుల్లో నివసిస్తున్నవారు ఖాళీ చేయాలని, అద్దెకు ఉంటున్నవారు ఇకపై తమకే ఆ మొత్తాన్ని చెల్లించాలని ఈడీ స్పష్టం చేసింది. అక్రమ చెలామణి నిరోధక చట్టంలోని సెక్షన్ 8 నిబంధన 5(1) ప్రకారం జప్తు చేసిన ఆస్తులను స్వాధీనం చేసుకొనే ప్రక్రియ చేస్తున్నామని తెలిపింది. ఆస్తులు ఉన్న ప్రాంతాల్లో (ఢిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించింది. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ, అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై తాజాగా విచారణ జరిగింది. ఈ కేసులో ఈడీ ఆరోపణలు కాంగ్రెస్ అగ్రనాయకత్వాన్ని మరింత ఇరకాటంలోకి నెట్టాయి.

## వక్ఫ్ అనేది ఇస్లామిక్ భావనే

**(1వపేజీ తరువాయి)**ప్రజల ఆస్తులను అక్రమంగా పక్కదారి పట్టించే ప్రయత్నాలను సర్కారు చూస్తూ ఊరుకోదన్నారు. వక్ఫ్ చట్టంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని సొలిసిటర్ జనరల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు ఉన్నది సేవ కోసమేనని ఆయన స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డులో ఇద్దరు ముస్లిమేతరులు ఉంటే వచ్చే నష్టం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇందులో మతపరమైన అంశాల జోక్యమేమీ లేదన్నారు. వక్ఫ్ చట్టం సవరణలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏకంగా 96 లక్షల మంది ముస్లింలను కలిసిందన్నారు తుషార్ మెహతా. చర్చోపచర్చల తర్వాత అందరి సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకొని కేంద్రం చట్టాన్ని సవరించిందన్నారు.

## పాక్‌తో జ్యోతికి లింకులు

**(1వపేజీ తరువాయి)**కోసం పాక్ హైకమిషన్‌కు వెళ్లిన సమయంలో తొలిసారి డానిష్ పరిచయం అయ్యాడని ఆమె వెల్లడించింది. - బ్లాకౌట్ వివరాలు కూడా పాక్‌కు.. ఆపరేషన్ సింధూర్ సమయంలో కూడా జ్యోతి పాక్‌కు సమాచారం చేరవేసినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా ఆ సమయంలో పాక్ సరిహద్దు రాష్ట్రాలను వైమానిక, క్షిపణి దాడుల నుంచి రక్షించేందుకు ప్రభుత్వం బ్లాకౌట్లు నిర్వహించింది. ఈ సమాచారం కూడా ఆమె డానిష్‌కు చేరవేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దర్యాప్తు బృందం ఆమె నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకొన్నాయి. దీంతోపాటు.. ఆమెకున్న రెండు బ్యాంకు ఖాతాలను కూడా విశ్లేషిస్తున్నారు. నేటితో జ్యోతి పోలీస్ కస్టడీ ముగియనుంది. ఆమెను హిస్సార్ కోర్టులో హాజరుపర్చనున్నారు. డైరీలో పాక్‌పై ప్రేమ.. తాజాగా జ్యోతి మల్హోత్రా డైరీ, ఫొటోలు వైరల్‌గా మారాయి. దానిలో ఆమె పాక్‌పై విపరీతమైన అభిమానం చూపించినట్లు అర్థమవుతోంది. అక్కడి ప్రజల నుంచి విపరీతమైన ప్రేమ లభించినట్లు పేర్కొంది. ఆ దేశం క్రేజీగా, కలర్‌ఫుల్‌గా ఉన్నట్లు అభివర్ణించింది. - గూఢచర్యంలోకి దించిన 'హ్యాపీనెస్' పాక్ హైకమిషన్ ఉద్యోగి డానిష్ వీసా విభాగంలో పని చేసేవాడు. పంజాబ్‌లోని మలేర్‌కోట్లా ప్రాంతానికి చెందిన గజాల అనే యువతిని కూడా హనీట్రాప్‌లోకి లాగి.. గూఢచర్యానికి వాడుకొన్నట్లు తెలుస్తోంది. ఆమె తన కుటుంబంలోని వారికి వీసాల కోసం ఫిబ్రవరి 2వ తేదీన పాక్ హైకమిషన్‌కు వెళ్లింది. ఆ మర్నాడు వారి వీసాలు ఎప్పుడు వస్తాయో తెలుసుకొనేందుకు గజాలా ఆంటీ నస్రీన్ బానో హైకమిషన్‌కు వెళ్లింది. నాడు గజాలా వీసా మినహా అందరివి ఓకే అయినట్లు వెల్లడించారు. అదేనెల 27వ తేదీన హైకమిషన్‌లో వీసా ఆఫీసర్ అంటూ డానిష్ నుంచి గజాలకు మెసేజ్ వచ్చింది. నాటినుంచి ఇద్దరి పరిచయం పెరిగింది. మరో ఫోన్ నెంబర్ నుంచి టెలిగ్రామ్ యాప్ వాడాలని ఆమెకు సూచించాడు. చివరికి ఏప్రిల్‌లో డానిష్ సాయంతో ఆమె పాక్ వీసా పొందింది. ఆ తర్వాత అతడికి పెళ్లైనట్లు ఆమె గుర్తించింది. మరోవైపు డానిష్ ఆమెను మెల్లగా గూఢచర్యానికి వాడుకోవడం మొదలుపెట్టాడు. సైనిక స్థావరాల సమాచారాలు అడిగేవాడు. ఆ తర్వాత నగదు లావాదేవీలు కూడా నడిపాడు. డానిష్ నెంబర్ గజాలా ఫోన్‌లో 'హ్యాపీనెస్' అనే పేరుతో సేవ్ చేసుకొన్నట్లు గుర్తించారు. పాక్ హైకమిషన్ కార్యాలయానికి వీసా కోసం వచ్చే వారిని ట్రాప్ చేసి వారిని డానిష్ గూఢచర్యానికి వాడుకొనేవాడు. యూట్యూబర్ జ్యోతి కూడా వీసా కోసం వెళ్లగా ఆమెను.. అతడు ట్రాప్ చేశాడు.

## వరుస నష్టాలకు బ్రేక్

**(1వపేజీ తరువాయి)**పీబీ ఫిన్‌టెక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. డిక్సన్ టెక్నాలజీస్, ఆదిత్య బిర్లా ఫేషన్స్, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఇండస్ ఇండ్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 436 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. బ్యాంక్ నిఫ్టీ 197 పాయింట్లు ఎగబాకింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.64గా ఉంది.



## ట్రావెల్ బ్యాగ్‌లో యువతి మృతదేహం..

**బెంగళూరు - నవభూమి:** రైల్వే వంతెన సమీపంలో ట్రావెల్ బ్యాగ్‌లో యువతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దర్యాప్తు చేస్తున్నారు. యువతిని ఎక్కడో హత్య చేసి మృతదేహాన్ని సూట్‌కేస్‌లో కుక్కి కదులుతున్న రైలు నుంచి బయటకు విసిరేసి ఉంటారని అనుమానిస్తున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. బుధవారం ఉదయం హోసూర్ ప్రధాన రహదారిలోని పాత చందాపుర రైల్వే బ్రిడ్జి సమీపంలో, రైలు పట్టాల దగ్గర నీలం రంగులో ఉన్న ట్రావెల్ సూట్‌కేస్ పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. అందులో యువతి మృతదేహం ఉండటంతో షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు.కాగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రావెల్ బ్యాగ్‌లోని యువతి మృతదేహాన్ని పరిశీలించారు. హతురాలి వయసు 18 ఏళ్లు ఉండవచ్చని పోలీసులు అంచనా వేశారు. ఆమెను ఎక్కడో హత్య చేసి సూట్‌కేసులో మృతదేహాన్ని కుక్కి కదులుతున్న రైలు నుంచి విసిరేసి ఉంటారని అనుమానిస్తున్నారు. దీంతో రైల్వే పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు పోలీస్ అధికారి తెలిపారు. తమ ప్రాంతం పరిధిలో మృతదేహం లభించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. యువతి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించినట్లు వివరించారు.



## పలువురిని చంపి మొసళ్లకు ఆహారంగా వేసిన సీరియల్ కిల్లర్..




**న్యూఢిల్లీ-నవభూమి:** పలువురిని చంపి మొసళ్లకు ఆహారంగా వేసిన సీరియల్ కిల్లర్ పెరోల్‌పై బయటకు వచ్చి 'అదృశ్యమ య్యాడు. 'డాక్టర్ డెత్' గా పేరొందిన అతడి కోసం రెండేళ్లుగా పోలీసులు వెతుకుతున్నారు. నకిలీ గుర్తింపుతో ఒక ఆశ్రమంలో పూజారిగా ఉన్న అతడ్ని చివరకు అరెస్ట్ చేశారు. 67 ఏళ్ల దేవేందర్ శర్మ ఆయుర్వేద వైద్యుడు. అయితే 'డాక్టర్ డెత్' గా పేరుగాంచిన ఆయన పలు హత్యలకు పాల్పడ్డాడు. 27 హత్య, కిడ్నాప్, దోపిడీ కేసులతో కూడిన సుదీర్ఘ నేర చరిత్ర అతడికి ఉన్నదని ఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (క్రైమ్ బ్రాంచ్) ఆదిత్య గౌతమ్ తెలిపారు.కాగా, సీరియల్ కిల్లర్ దేవేందర్ శర్మ 1994లో గ్యాస్ డీలర్‌షిప్ వ్యాపారంలో నష్టపోవడంతో నేరాల బాటపట్టాడు. నకిలీ గ్యాస్ ఏజెన్సీని నిర్వహించడంతోపాటు అక్రమ అవయవ వ్యాపారంలోకి ప్రవేశించాడు. 1998- 2004 మధ్య అక్రమ కిడ్నీ రాకెట్‌ను నిర్వహించాడు. పలు రాష్ట్రాల వైద్యులు, మధ్యవర్తుల సహాయంతో 125కు పైగా అక్రమ కిడ్నీ మార్పిడికి పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడని ఆ పోలీస్ అధికారి చెప్పారు.మరోవైపు 2002-2004 మధ్య దేవేందర్ శర్మ తన అనుచరులతో కలిసి పలువురు టాక్సీ, లారీ డ్రైవర్లను దారుణంగా హత్య చేశాడు. నకిలీ ప్రయాణికులతో వారిని ట్రాప్ చేసి చంపేవాడు. ఉత్తరప్రదేశ్ కాస్‌గంజ్‌లోని మొసళ్లున్న హజారా కాలువలో మృతదేహాలను పడేసి వాటికి ఆహారంగా వేసేవాడు. వారి వాహనాలను బ్లాక్ మార్కెట్‌లో అమ్మేవాడని పోలీస్ అధికారి ఆదిత్య గౌతమ్ వివరించారు.కాగా, కిడ్నీ రాకెట్, వరుస హత్యలకు సంబంధించి దేవేందర్ శర్మను 2004లో పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీ, రాజస్థాన్, హర్యానాలో నమోదైన ఏడు వేర్వేరు కేసుల్లో అతడికి జీవిత ఖైదు శిక్ష పడింది. గుర్గావ్ కోర్టు అతడికి మరణశిక్షను కూడా విధించిందని పోలీస్ అధికారి తెలిపారు. 2002-2004 మధ్య పలువురు టాక్సీ, లారీ డ్రైవర్లను దారుణంగా హత్య చేసిన కేసులో తీహార్ జైలులో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడని చెప్పారు. 2023 ఆగస్ట్‌లో పెరోల్ పొందిన అతడు మాయమయ్యాడని చెప్పారు. రాజస్థాన్ దౌసాలోని ఆశ్రమంలో నకిలీ గుర్తింపుతో పూజారిగా నటిస్తున్న దేవేందర్ శర్మను సోమవారం అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి ఆదిత్య గౌతమ్ వెల్లడించారు.మరోవైపు పెరోల్‌పై ఉన్నప్పుడు దేవేందర్ శర్మ పరారీ కావడం ఇదే మొదటిసారి కాదు. 2020లో 20 రోజుల పెరోల్ తర్వాత తిరిగి జైలుకు వెళ్లలేదు. ఏడు నెలల తర్వాత ఢిల్లీలో పోలీసులకు చిక్కాడు. 2023 జూన్‌లో సరితా విహార్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో అతడికి మళ్ళీ రెండు నెలల పెరోల్ మంజూరైంది. అనంతరం 2023 ఆగస్ట్ 3 నుంచి ఈ ఏడాది మే 19 వరకు ఆ సీరియల్ కిల్లర్ పరారీలో ఉన్నాడని పోలీస్ అధికారి ఆదిత్య గౌతమ్ విరించారు.

## 5 ఏళ్ల తర్వాత స్టార్ట్.. 720 మందితో కైలాస మానస సరోవర యాత్ర



**న్యూఢిల్లీ-నవభూమి:** అయిదేళ్ల బ్రేక్ తర్వాత ఈ ఏడాది కైలాస మానస సరోవర యాత్ర జరగనున్నది. ఈసారి 720 మంది భక్తులు ఆ యాత్రకు వెళ్లనున్నారు. వీరితోపాటు 30 మంది లయిజన్ ఆఫీసర్లు ఉంటారని విదేశాంగ శాఖ వెల్లడించింది. లక్కీ డ్రా ద్వారా యాత్రికులను ఎంపిక చేశారు. కంప్యూటర్ జనరేటెడ్ పద్ధతిలో ర్యాండమ్‌గా వ్యక్తులను ఎంపిక చేశారు.గత అయిదేళ్ల నుంచి మానస సరోవర యాత్రను నిలిపివేసిన విషయం తెలిసిందే. 2020 నుంచి ఆ యాత్ర జరగడం లేదు. కోవిడ్ వల్ల నిలిపివేశారు. చైనీస్ ప్రభుత్వం వైపు నుంచి యాత్ర ఏర్పాట్ల గురించి సమాచారం రాకపోవడంతో మానస సరోవర యాత్రను ఆపేశారు. జూన్ మూడవ వారం నుంచి యాత్ర ప్రారంభంకానున్నది. ఆగస్టు 25వ తేదీన ముగుస్తుంది.రెండు మార్గాల్లో మానస సరోవర యాత్ర నిర్వహించనున్నారు. ఉత్తరాఖండ్, సిక్కిం రూట్లలో ఇది జరగనున్నది. అన్ని రూట్లు కలిపి మొత్తం 720 మంది యాత్రికులకు మాత్రమే ఈ సారి అవకాశం కల్పించారు. కైలాస పర్వతంతో పాటు మానస సరోవరం .. టిబెట్‌లో ఉన్నాయి. ఉత్తరాఖండ్ మార్గంలో 5 బ్యాచ్‌లను పంపుతారు. ఒక్కొక్క బ్యాచ్‌లో 48 మంది ఉంటారు. ఇక సిక్కింలోని నాథులా పాస్ మీదుగా కూడా 48 మందితో కూడిన 10 బ్యాచ్‌లను పంపనున్నారు.ఈసారి 5384 మంది యాత్ర కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంట్లో 3898 మంది పురుషులు, 1486 మంది మహిళలు ఉన్నారు. 65 ఏళ్లు దాటిన వారు 404 మంది ఉన్నట్లు తెలుస్తోంది. హిందువులతో పాటు బౌద్ధులు, జైనులకు కూడా ఈ యాత్ర పవిత్రమైందని విదేశాంగ శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు. లిపులేక్ పాస్, నాథులా పాస్ మార్గంలో రోడ్లను కూడా నిర్మించారని, దీని వల్ల వృద్ధ యాత్రికులకు మేలు జరుగుతుందన్నారు.

## ప్రభుత్వ బస్సుపై రాష్ట్రం పేరు కనిపించకుండా స్టిక్కర్..

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రభుత్వ బస్సుపై రాష్ట్రం పేరు కనిపించకుండా స్టిక్కర్ అంటించి మూసివేశారు. దీనిపై మీడియా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ కార్యక్రమానికి హాజరుకాకుండా మధ్యలోనే వెనక్కి తిరిగి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఈ సంఘటనపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. జాతుల ఘర్షణలతో అల్లాడిన మణిపూర్‌లో ఈ సంఘటన జరిగింది. ఉఖ్రుల్ జిల్లాలో రాష్ట్ర స్థాయి శిరుయ్ లిల్లీ ఫెస్టివల్ మే 20న ప్రారంభమైంది. ఇందులో పాల్గొనేందుకు ఇంఫాల్‌కు చెందిన జర్నలిస్టులు ప్రభుత్వ బస్సులో అక్కడకు బయలుదేరారు. మణిపూర్ రాష్ట్ర రవాణా సంస్థ బస్సును సమాచార, ప్రజా సంబంధాల శాఖ ఏర్పాటు చేసింది.కాగా, ఇంఫాల్ లోయలోని మైతీలు తమ గిరిజనుల గ్రామాల గుండా వెళ్లడాన్ని కుకీ తెగలు వ్యతిరేకిస్తున్నారు. మణిపూర్ నుంచి ప్రత్యేక పరిపాలనను వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే కుకీ తెగలు ఎక్కువగా ఉన్న కొన్ని గ్రామాల మీదుగా ఆ బస్సు వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో దాడి జరుగవచ్చని భద్రతా సిబ్బంది భావించారు. మార్గమధ్యలో ఆ బస్సు అద్దంపై ఉన్న మణిపూర్ పేరుపై స్టిక్కర్ అంటించి కనిపించకుండా చేశారు.మరోవైపు మీడియా ప్రతినిధులు దీనిపై నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రం పేరు ఎందుకు కనిపించకూడదని వారు ప్రశ్నించారు. మధ్యలోనే వెనక్కి తిరిగి వెళ్లారు. ఈ సంఘటనకు నిరసనగా పెన్‌డౌన్ చేశారు. మణిపూర్‌లోని రెండు మీడియా సంస్థలు గవర్నర్ అజయ్ కుమార్ భల్లాకు సంయుక్తంగా లేఖ రాశారు.

## ఐఎస్ఐ ఏజెంట్‌గా మారిన 52 ఏళ్ల భారత రాయబారి.. ఏంటీ మాధురీ గుప్తా కేసు?



**న్యూఢిల్లీ-నవభూమి:**పాకిస్థాన్‌కు భారత సైనిక రహస్యాలు చేరవేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా అరెస్ట్ కలకలం రేపుతోంది. అయితే, 15 ఏళ్ల కిందట యావత్తు దేశం ఉలిక్కిపాటుకు గురైన అచ్చం ఇలాంటి సంఘటనే చోటుచేసుకుంది. స్వయంగా భారత రాయబారి పాక్ ఏజెంట్‌గా మారిపోయి దేశద్రోహానికి పాల్పడ్డారు. విదేశాంగ శాఖలో పనిచేస్తున్న గ్రేడ్-బి అధికారి మాధురి గుప్తా.. పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్ హనీట్రాప్‌లో పడి రహస్య సమాచారం చేరవేశారనే ఆరోపణలతో అరెస్టయ్యారు. భారత గూఢచార వ్యవస్థలో సంచలనం సృష్టించిన అతి తీవ్రమైన దేశద్రోహ ఘటన ఇది. దేశ భద్రతను లోపలి నుంచి కలవరపరిచిన ఉదాహరణగా చరిత్రలో నిలిచిపోయింది.

26/11 ముంబయి ఉగ్రదాడుల అనంతరం దేశ భద్రతపై భయాందోళనలు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్‌లో ఉన్న గ్రేడ్-బి అధికారి గూఢచర్యం గురించి బయటకు రావడంతో అప్పటి ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ రాజీవ్ మాథూర్ అప్రమత్తమయ్యారు. ఈ సమాచారం ప్రకారం.. హైకమిషన్‌లో ప్రెస్ అండ్ ఇన్ఫర్మేషన్ విభాగం రెండో కార్యదర్శిగా మాధురి గుప్తా పనిచేస్తున్న సమయంలో పాకిస్థాన్‌కు సున్నితమైన సమాచారాన్ని చేరవేసినట్టు గుర్తించారు. ఉర్దూలో పాండిత్యం, సూఫీ కవిత్వం మీద ఆసక్తి వంటివి ఆమెను సాధారణ వ్యక్తిగా కనిపించేలా చేశాయి. కానీ అధికారిక రహస్యాలను లీక్ చేసి దేశభద్రతకు ముప్పు తలపెట్టారు.

**నిఘా..యాక్షన్**

ఐబీ చీఫ్ రాజీవ్ మాథూర్, RAWచీఫ్ కేసీ వర్మ, హోంసెక్రటరీ జీకే పిళ్లైకి సమాచారం అందించి, గుప్తాపై రెండువారాల పాటు నిఘా ఉంచమన్నారు. ఆ సమయంలో ఆమెకు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చారు. దానిని ఆమె పాక్‌కు చేరవేసినట్టు బయటపడటంతో అనుమానం నిజమైంది. తర్వాత ఆమెను భూటాన్‌లో జరిగే సార్క్ సమ్మిట్‌కు మీడియా సహకారం అందించాలనే వంకతో ఢిల్లీకి పిలిపించారు. దీంతో ఏప్రిల్ 21, 2010న ఆమె ఢిల్లీకి రాగా.. మర్నాడు ఢిల్లీ పోలీసులకు విదేశాంగ అధికారులు అప్పగించారు.

**అరెస్ట్- హనీట్రాప్**

అధికార రహస్యాల చట్టం కింద 2010 ఏప్రిల్ 22నమాధురి గుప్తాను అరెస్టు చేశారు. ఆమె భారత గూఢచారి అధికారుల సమాచారం బహిర్గతం చేయడం, హైకమిషన్ సిబ్బంది బయో-డేటాలు లీక్ చేయడం వంటి ఆరోపణలతో కేసు నమోదయ్యింది. భారత దౌత్య అధికారిణి మాధురి గుప్తా హనీట్రాప్‌కు బలయ్యిందని విచారణలో తేల్చారు. జంశేద్ అలియాస్ జిమ్ అనే 30 యువకుడితో ఆమెకు పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎష్ఐ వలపువల విసిరింది. అప్పటికి ఆమె వయసు 52 ఏళ్లు. కానీ, ఆమె కంటే వయసులో సగం చిన్నవాడైన జిన్.. మాధురిని ప్రేమగా మోసగించి, రహస్యాలను సేకరించినట్టు నిర్ధారణ అయ్యింది. ఈ మొత్తం వ్యవహారం అప్పటి పాకిస్థాన్ మంత్రి రెహమాన్ మలిక్‌కి సన్నిహితుడు, ఉన్నతాధికారి అయిన ముదస్సర్ రజా రానా నడిపించినట్టు సమాచారం. మొదట ఆమెను ఒక మహిళా జర్నలిస్ట్ ద్వారా సంప్రదించి, మౌలానా మసూద్ అజహర్ రచించిన ఓ పుస్తకాన్ని ఇచ్చిఆమెకు నమ్మకం కలిగించారు. ఇస్లామాబాద్ నివాసంలో కంప్యూటర్, బ్లాక్‌బెర్రీ ఫోన్ ద్వారా ఈ వ్యక్తులతో గుప్తా తరుచూ సంప్రదింపులు సాగించినట్టు ఆధారాలు లభించాయి.

**ఇ-మెయిల్ ఆధారాలు**

పాక్ ఏజెంట్లు ఆమె కోసం రూపొందించిన %శ్రీఖం-¯తీఖశీఏప్రమెఖిఅశ్రీ.ఎశీఎ, ఖతీఖశీఏప్రమెఖిఅశ్రీ.ఎశీఎ% అనే ఇమెయిల్ ఐడీలలో ఆమె సుమారు 73 మెయిల్స్ పంపినట్టు చార్జ్‌షీట్‌లో ఉంది. అంతేగాక, ఇస్లాం స్వీకరించి జంశేద్‌ని వివాహం చేసుకోవాలని, ఇద్దరూ ఇస్తాంబుల్ వెళ్లాలని ఆమె ఆలోచనలుగా బహిర్గతమయ్యాయి. అయితే, 2012లో మాధురి గుప్తాపై అధికారికంగా కేసు నమోదు చేశారు. తిహార్ జైలులో 21 నెలలు గడిపిన తర్వాత బెయిలు వచ్చింది. 2018లో కోర్టు ఆమెను దోషిగా నిర్ధారించింది. అయితే, చివరకు 2021 అక్టోబర్‌లో రాజస్థాన్‌లోని భివాండిలో ఆమె చనిపోయారు. ఆ సమయానికి ఆమె అప్పీల్ ఢిల్లీ హైకోర్టులో పెండింగ్లో ఉంది. అయితే, ఈ కేసు తర్వాత విదేశీ మిషన్లలో ఇంటర్నల్ సెక్యూరిటీ ప్రోటోకాల్‌లను కఠినతరం చేశారు.

## ఇండియాలో జేఎన్ 1 వేరియంట్ విజృంభణ



**న్యూఢిల్లీ-నవభూమి:**ఒకప్పుడు ఎంతో మంది ప్రాణాలు తీసి, ఎన్నో కుటుంబాలను రోడ్డుకీడ్చి, మరెంతో మంది జీవితాలను నాశనం చేసిన కరోనా మహమ్మారి మళ్లీ వచ్చింది. ఇటీవల కాలంలో పలు దేశాల్లో కేసుల సంఖ్య పెరుగుతూ వస్తుండగా.. భారత్‌లోనూ కొంత మంది దీని బారిన పడుతున్నారు. గతంతో పోలిస్తే ఈ కేసుల సంఖ్య కాస్త తక్కువగానే ఉన్నప్పటికీ.. ముంబయి, చెన్నై, పుణే, అహ్మదాబాద్ నగరాల్లో ఈ కేసుల్లో సంఖ్య విపరీతంగా పెరిగిపోతుండగా.. అంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలోనే ఆరోగ్య అధికారులు ఆయా రాష్ట్రాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. మరి దేశంలో ఎక్కడెక్కడ కేసులు నమోదు అవుతున్నాయి, అందులో ఏ ప్రాంతంలో ఎక్కువ ఉన్నాయో మనం ఇప్పుడు తెలుసుకుందాం.

కొత్తగా నమోదు అవుతున్న కేసుల వ్యాప్తికి జేఎన్ 1 వేరియంట్ కారణమని వైద్యులు గుర్తించారు. ఈ వేరియంట్‌ను వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్.. "వేరియంట్ ఆఫ్ ఇంటరెస్ట్"గా ప్రకటించింది. అయతే 2023 డిసెంబర్ నెలలో ¾JN¾1 స్ట్రెయిన్‌కి సంబంధించిన కొత్త ఉపవేరియంట్లు %ాఖీ%.7 మరియు 1.5 ప్రధానంగా గుర్తించారు. ప్రస్తుతం ఇవే అందరినీ ఇబ్బంది పెడుతున్నాయి.

**ముంబైలో కోరలు చాచిన కోరనా..!**

మహారాష్ట్రలోని ముంబై నగరంలో 95 కొత్త కొవిడ్-19 కేసులు నమోదు అయ్యాయి. జనవరి నుంచి రాష్ట్రంలో మొత్తం 106 కేసులు నమోదు కాగా.. ఈ నెలలోనే గణనీయమైన పెరుగుదల కనిపించిందని మహారాష్ట్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ప్రస్తుతం కోరోనా బారిన పడి ఆస్పత్రిలో 16 మంది చికిత్స పొందుతున్నారు. అలాగే ఇన్ఫ్లుయెంజా, అక్యూట్ రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ ఉన్న రోగులు అందరికీ కరోనా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు.

**పుణే పరిస్థితి ఏంటంటే..?**

పుణేలో యాక్టివ్ కేసులు ఏమీ లేవు. కానీ ఆరోగ్య శాఖ ముందు జాగ్రత్తగా అక్కడి నాయుడు ఆస్పత్రిలో 50 పడకలను కరోనా బాధితుల కోసం సిద్ధం చేసింది. మే నెలలో ఒకే ఒక్క వ్యక్తికి కరోనా సోకిందని.. మంజరికి చెందిన 87 ఏళ్ల వ్యక్తి కొన్నాళ్లు చికిత్స కూడా పొందాడని పుణే మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య అధిపతి డాక్టర్ నీనా బోరాడే పేర్కొన్నారు. అయితే ఇప్పుడు అతడు పూర్తిగా కోలుకున్నాడని చెప్పారు.

**తమిళనాడులో పెరుగుతున్న కేసులు..!**

తమిళనాడులోన పుదుచ్చేరిలో 12 కొత్త కేసులు నమోదు అయ్యాయి. దీంతో అనేక ఆస్పత్రులు అప్రమత్తం అయ్యాయి. ఇన్ఫెక్షన్ల కారణంగా అవయవ మార్పిడి, గుండె శస్త్రచికిత్స సహా అనేకమైన కీలక సర్జరీలను ఆలస్యం చేశారు. వైరల్ కేసుల్లో కరోనా కేసులు పెరుగుతున్నట్లు గుర్తించామని అంటువ్యాధుల నిపుణుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం స్వామినాథన్ తెలిపారు. అయితే కొవిడ్ కేసుల గురించి పెద్దగా భయపడాల్సిన అవసరం ఏమీ లేదని.. కాకపోతే ఎక్కువగా జనాలు ఉన్న చోటుకు వెళ్లకూడదని సూచించారు. కరోనా ఎప్పుడూ పూర్తిగా పోలేదని.. కాకపోతే కాలాన్ని బట్టి ఎక్కువ, తక్కువ అవుతూ మన చుట్టే తిరుగుతోందన్నారు.

**కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో కొత్త కేసులు..!**

కర్ణాటకలో 16 కొత్త కొవిడ్-19 కేసులు నిర్ధారించినట్లు రాష్ట్ర ఆరోగ్య మంత్రి దినేష్ గుండూరావు తెలిపారు. అలాగే గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఒకే రోజు 7 కొత్త కేసులు నమోదు అయ్యాయి. గత ఏడాది కాలంలో సగటున నెలకు ఒక కేసు మాత్రమే నమోదు కాగా.. ఈ నెలలోనే కేసులు పెరిగినట్లు చెప్పారు. ఏడుగురు కూడా ఇంట్లోనే ఐసోలేషన్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**వైరస్ ఇప్పటికీ అంటువ్యాధిగానే..!**

2023 మేలో కరోనా పూర్తిగా అంతం అయినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించినప్పటికీ.. కొవిడ్-19 ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చెందుతూనే ఉంది. భారత దేశంలో చాలా కేసులు నమోదు అవుతున్నప్పటికీ.. మరణాలు ఏమీ లేదని, భయపడాల్సిన అవసరం కూడా లేదని వైద్యులు చెబుతున్నారు. వృద్ధులు, గర్భిణీలు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. తరచుగూ చేతులు కడుక్కుని, మాస్కులు ధరిస్తూ.. సానిటైజేషన్ వాడాలని వివరిస్తున్నారు.

## రన్యారావు కేసు.. కర్ణాటక హోంమంత్రికి ఈడీ షాక్



**న్యూఢిల్లీ-నవభూమి:**బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టైన కన్నడ నటి రన్యారావు కేసు కర్ణాటక రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. తాజాగా ఈ కేసులో ఆ రాష్ట్ర హోం మంత్రి జి.పరమేశ్వర )కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు షాకిచ్చారు. మంత్రి చైర్మన్‌గా వ్యవహరిస్తున్న తుమకూరులోని శ్రీ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో సోదాలు చేపట్టారు.రన్యారావు కేసులో మనీలాండరింగ్‌పై దర్యాప్తు చేస్తున్న ఈడీ అధికారులకు కొన్ని కీలక ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. రాన్యా రావుకు, మెడికల్ కాలేజీకి మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు ఈడీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. దీంతో, అధికారులు బుధవారం ఉదయం కళాశాలలో తనిఖీలు చేపట్టారు. కాలేజీకి సంబంధించిన పలు రికార్డులు, ఆర్థిక లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలుస్తోంది. ఈడీ సోదాలు చేపట్టిన సమయంలో మంత్రి పరమేశ్వర కాలేజీలో లేరని తెలిసింది. తన అనుచరులతో వేరే ప్రాంతంలో సమావేశమైనట్లు సంబంధిత వర్గాల సమాచారం.రన్యారావుకు బెయిల్‌కన్నడ నటి అయిన రన్యారావును మార్చి 3న బంగారం స్మగ్లింగ్ కేసులో డీఆర్ఐ అధికారులు అరెస్టు చేశారు. విమానాశ్రయంలో ఆమెను అదుపులోకి తీసుకొని.. రూ.12.56 కోట్ల విలువైన 14.2 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో తరుణ్ రాజ్, సాహిల్ సకారియా జైన్‌లను కూడా అ ధికారులు అరెస్టు చేశారు. ప్రస్తుతం ముగ్గురు బెంగళూరులోని పరప్పన అగ్రహార కేంద్ర జైలులో ఉన్నారు.ఈ క్రమంలో నిన్న రన్యారావుకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆమెతో పాటు తరుణ్ రాజ్ కొండూరు కు కూడా బెంగళూరు కోర్టు మంగళవారం డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసింది.వారిద్దరు చట్టబద్ధమైన బెయిల్‌కు అర్హులేనని, ఇద్దరు వ్యక్తుల నుంచి వ్యక్తిగత పూచికత్తు, ఒక్కొక్కరు రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్‌ను సమర్పించిన తర్వాత వారిని బెయిల్‌పై విడుదల చేయాలని ఆర్థిక నేరాల ప్రత్యేక న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. అధికారులు పిలిచిన సమయంలో తప్పనిసరిగా విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించొద్దని.. దర్యాప్తు అధికారులకు సహకరించాలని, కోర్టు నుంచి ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని.. భవిష్యత్‌లో ఇదే తరహాలో నేరాల్లో పాల్గొనొద్దని ఆదేశించింది.

## జాతీయ విద్యావిధానం.. మోదీ ప్రభుత్వంపై కోర్టుకెక్కిన తమిళనాడు ప్రభుత్వం

**న్యూఢిల్లీ-నవభూమి:**జాతీయ విద్యావిధానం అమలు విషయంలో కేంద్రం, తమిళనాడు ప్రభుత్వం మధ్య గత కొంతకాలంగా ఓ యుద్ధమే జరుగుతోంది. కేంద్రం ప్రతిపాదించిన త్రిభాషా సూత్రాన్ని స్టాలిన్ ప్రభుత్వం ముందు నుంచీ వ్యతిరేకిస్తూ వస్తోంది. ఈ సూత్రం ప్రకారం, విద్యార్థులు ఇంగ్లిష్ మరియు ప్రాంతీయ భాషతో పాటు మూడో భాషను కూడా నేర్చుకోవాల్సి ఉంటుంది.అయితే, జాతీయ విద్యావిధానం ముసుగులో కేంద్రం తమపై హిందీ భాషను బలవంతంగా రుద్దుతోందని తమిళనాడు ప్రభుత్వం మండిపడుతోంది. ఈ అంశంలో స్టాలిన్ ప్రభుత్వం తాజాగా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ను ఆశ్రయించింది. జాతీయ విద్యా విధానం అమలు చేయడం లేదన్న కారణంతో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తమ రాష్ట్రానికి రావాల్సిన రూ.2,151 కోట్ల నిధులను నిలిపివేసిందని కోర్టుకు తెలిపింది. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది.పాఠశాల విద్య కోసం ఉద్దేశించిన సమగ్ర శిక్ష పథకం అవసరాలకు అనుగుణంగా తమిళనాడు ఉందని గతేడాది ఫిబ్రవరి 16న జరిగిన ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డు సమావేశంలో కేంద్రం సంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని తమిళనాడు ప్రభుత్వం తన పిటిషన్‌లో ప్రస్తావించింది. ఆ తర్వాత ఈ పథకం కింద ఖర్చు కోసం రూ.3,585.99 కోట్ల నిధుల కేటాయింపు జరిగిందని పేర్కొంది. ఇందులో 60:40 నిష్పత్తి ప్రకారం, కేంద్రం వాటా రూ.2,151 కోట్లు అని తెలిపింది.

## పబ్లిసిటీ స్టంట్లు అవసరమా..: ప్రొఫెసర్‌పై సుప్రీం ఫైర్



పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం అందరికీ తెలిసిందే. అయితే తాజాగా ఈ ఆపరేషన్‌కు వ్యతిరేకంగా అశోకా యూనివర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ అలీఖాన్ ముహ్మూదాబాద్ సోషల్ మీడియా వేదికగా అభ్యంతరకర పోస్టు పెట్టారు. కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు ఆపరేషన్ సిందూర్‌లో ఏం జరిగిందో చెప్పకుండా.. ప్రజలకు ఏం కావాలో అది మాత్రమే చెప్పారని ఆరోపించారు. దీనిపై దేశ వ్యాప్తంగా విమర్శలు వ్యక్తం కాగా.. ఓ బీజేపీ నాయకుడు చేసిన ఫిర్యాదుతో పోలీసులు ఇతడిని అరెస్ట్ చేశారు. అయితే తాజాగా ఈయన్ను సుప్రీం కోర్టుకు తీసుకెళ్లగా.. ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. రాక్షసులు వచ్చి దేశంపై దాడి చేస్తుంటే ఇలా పబ్లిసిటీ స్టంట్లు చేయడం అవసరమా అంటూ వ్యాఖ్యానించింది.హర్యానాలోని సోనీపట్ జిల్లా ఆశోకా యూనివర్సిటీలో అలీఖాన్ ముహ్మూదాబాద్ రాజనీతి శాస్త్ర విభాగాధిపతిగా పని చేస్తున్నారు. అయితే ఈయన ఇటీవలే సోషల్ మీడియా వేదికగా ఓ అభ్యంతరక పోస్టు పెట్టారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్‌పై బ్రీఫింగ్ ఇచ్చిన ఇద్దరు మహిళా అధికారులు కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లను అలీఖాన్ తప్పు పట్టారు. వీరిద్దరూ జరిగింది జరిగినట్లుగా మీడియాకు వివరించలేదని.. దేశ ప్రజలు ఏం కోరుకుంటున్నారో అది మాత్రమే చెప్పారంటూ వెల్లడించారు. ప్రభుత్వం తరఫున మాట్లాడుతున్న వారు క్షేత్ర స్థాయిలో జరిగిన నిజాలను మాత్రమే చెప్పాలని.. కానీ ఈ ఇద్దరు అధికారులు అలా చేయలేక పోయారన్నారు. ఇలా నిజాలను నిక్కచ్చిగా చెప్పలేకపోవడం కూడా వంచనే అని వెల్లడించారు.దీనిపై ఓ బీజేపీ నాయకుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా రంగంలోకి దిగిన పోలీసులు ప్రొఫెసర్ అలీఖాన్ ముహ్మూదాబాద్‌ను అరెస్ట్ చేశారు. ఆపై స్థానిక కోర్టులో విచారణ కూడా సాగగా.. తనకు బెయిల్ మంజూరు చేసిన విచారణ నిలిపి వేయాలంటూ ఇటీవలే అలీఖాన్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తాజాగా దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కొటేశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా అలీఖాన్ తరఫు న్యాయవాది కపిల్ సిబిల్ వాదనలు వినిపించారు. తన క్లయింట్ ఆ పోస్టులో నేరపూరిత ఉద్దేశంతో చేసిన వ్యాఖ్యలు ఏమున్నాయన్నారు. ఆయన వాదనపై స్పందిస్తూ జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడారు.అసలు ఏం జరుగుతుందో మీరు తెలుసుకోండని.. భావ వ్యక్తీకరమ చేసే హక్కు ఉంటుందన్నారు. కానీ ఆ విషయం గురించి మాట్లాడే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అందరూ హక్కుల గురించి మాట్లాడుతున్నారు. కానీ బాధ్యతల గురించి ప్రస్తావించడం లేదన్నారు. భావ వ్యక్తీకరణ చేసే హక్కు కచ్చితంగా ఉంటుందని కానీ వీటన్నింటి గురించి సమయం ఇదేనా అంటూ ప్రశ్నించారు. కొందరు రాక్షసులు వచ్చి భారత్‌పై దాడి చేశారు. ఇప్పుడు మనమంతా ఐక్యంగా ఉండాలని.. ఇలాంటి సమయంలో పబ్లిసిటీ పొందేందుకు ప్రయత్నాలు ఎందుకన్నారు.

## దేశ రహస్యాలను పాకిస్థాన్‌కు చేరవేసిన యూట్యూబర్

**న్యూఢిల్లీ-నవభూమి:**గూఢచర్యానికి పాల్పడ్డారనే ఆరోపణలతో అరెస్టైన హర్యానా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో కళ్లుబైర్లుకమ్మే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రస్తుతం ఎన్ఐఏ అదుపులో ఉన్న ఆమె.. విచారణలో కీలక సమాచారం వెల్లడించినట్టు తెలుస్తోంది. వీటిలో, పాకిస్థానీ గూఢచారి అధికారి, జ్యోతి మల్హోత్రా మధ్య సాగిన సంభాషణల వివరాలు బయటపడినట్టు సమాచారం. ఈ సంభాషణలు మల్హోత్రాకు పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నట్లు మరింత బలమైన ఆధారాలను సూచిస్తున్నాయి. 'ట్రావెల్ విత్ జో' అనే పేరుతో యూట్యూబ్ ఛానల్ నడుపుతూ పాకిస్థాన్ గూఢచార సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ లో పనిచేసే అలీ హసన్ అనే వ్యక్తితో నిరంతరంగా ఆమె టచ్‌లో ఉన్నట్టు సమాచారం. ఇద్దరూ తరచుగా మాట్లాడుకునేవారంటూ అధికారులు చెబుతున్నారు.యూట్యూబర్ మల్హోత్రా.. హసన్ మధ్య వాట్సాప్ సంభాషణలు పోలీసులకు లభించాయి. ఒక సంభాషణలో మల్హోత్రా, 'పాకిస్థాన్‌లో నన్ను పెళ్లి చేసుకో" అని చెప్పినట్టు తెలిసింది. ఇది ఆమెకు పాక్ పట్ల భావోద్వేగ సంబంధం ఉందనడానికి సూచనగా భావిస్తున్నారు. అదేవిధంగా వాట్సాప్ చాట్‌లలో భారతదేశంలో గూఢచర్య కార్యకలాపాలకు సంబంధించిన సంకేత భాషలో సంభాషణలు కూడా ఉన్నట్టు తెలుస్తోంది.దర్యాప్తులో భాగంగా మల్హోత్రాకు చెందిన నాలుగు బ్యాంక్ ఖాతాల సమాచారం లభించిందని పోలీసులు తెలిపారు. వాటిలో ఒక ఖాతాలో దుబాయ్ నుంచి లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. ఆమెకు ఎక్కడి నుంచి నగదు వచ్చిందో గుర్తించేందుకు అన్ని ఖాతాలను దర్యాప్తు ఏజెన్సీలు పరిశీలిస్తున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షకు పైగా ఫాలోవర్స్ ఉన్న మల్హోత్రా.. పాకిస్థాన్‌లో రెండు మార్లు పర్యటించారు. ఆ సమయంలో ఆమె ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌లో పనిచేసే రహీమ్ అనే అధికారిని కలిశారు. ఆయనే తరువాత ఆమెను ఐఎస్ఐఏ ఏజెంట్లకు పరిచయం చేశారని సమాచారం.భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత కూడా ఆమె పాకిస్థానీ హ్యాండ్లర్లతో సంబంధాలు కొనసాగించినట్టు, భారత సైనికుల కదలికల వారు అడిగిన సమాచారం ఆమె అందించినట్టు ఆరోపణలు ఉన్నాయి. తొలుత ఆమె తండ్రి,.. వీడియోలు తీయడానికి పాకిస్థాన్‌కు వెళ్లిందని చెప్పినప్పటికీ తర్వాత మాట మార్చారు. జ్యోతి మల్హోత్రా ఢిల్లీకి వెళ్తున్నట్టు తనకు చెప్పిందని, పాక్ వెళ్లినట్టు తెలియదని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దాయాదికి గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలపై పది మందికిపైగా దర్యాప్తు సంస్థలు అరెస్ట్ చేశాయి. వీరిలో ఒక విద్యార్థి, ఒక సెక్యూరిటీ గార్డ్, ఒక వ్యాపారి ఉన్నారు. వీరంతా హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందినవారే. ఉగ్రదాడికి కొద్ది నెలల ముందే జ్యోతి మల్హోత్రా పహల్గామ్‌కు వెళ్లి వీడియోలు తీసినట్టు గుర్తించారు. అంతేకాదు, దాడి సమయంలో ఆమె పాకిస్థాన్‌లోనే ఉన్నట్టు తెలిసింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
గురువారం
22 ၊ మే ၊ 2025

## యూకో బ్యాంక్ మాజీ సీఎండీ అక్రమంగా 6000 కోట్లు దారిమళ్లించారు: ఈడీ

**న్యూఢిల్లీ-నవభూమి:** కోల్‌కతా జోనల్ ఆఫీసుకు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మే 16వ తేదీన యూకో బ్యాంక్ మాజీ సీఎండీ సుబోధ్ కుమార్ గోయల్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే అతను అక్రమ రీతిలో బ్యాంకుకు చెందిన సుమారు 6210.72 కోట్ల డబ్బును దారి మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో విచారణ చేపట్టిన ఈడీ అనేక విషయాలను వెల్లడించింది. కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ సంస్థకు భారీగా క్రెడిట్ సౌకర్యాలు కల్పించినట్లు ఈడీ తన ప్రకటనలో పేర్కొన్నది. ఆ అక్రమ రుణాల మొత్తం ఆరు వేల కోట్లు ఉంటుందని ఈడీ అంచనా వేసింది.అరెస్టు చేసిన సుబోధ్ కుమార్ గోయల్‌ను మనీల్యాండరింగ్ కోర్టు ముందు మే 17వ తేదీన హాజరుపరిచారు. మే 21వ తేదీన వరకు ఆయన్ను ఈడీ కస్టడీకి అప్పగించారు. ఢిల్లీలోని తన నివాసం నుంచి గోయల్‌ను అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ నెలలోనే గోయల్‌తో సంబంధం ఉన్న ప్రాపర్టీలపై ఈడీ దాడులు చేసింది. సీఎస్పీఎల్ సంస్థకు క్రెడిట్ ఫెసిలిటీ ఇచ్చిన అంశంపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.బ్యాంకు రుణాలను అక్రమ రీతిలో దారిమళ్లించిన గోయల్‌కు నగదు, స్థిరాస్తులు, లగ్జరీ వస్తువులు, హోటల్ బుకింగ్‌లు ఫేవర్‌గా వచ్చినట్లు తెలుస్తోంది. షెల్ కంపెనీలు, డమ్మీ వ్యక్తులు ద్వారా ఆ లావాదేవీలు జరిగాయి. షెల్ కంపెనీల ద్వారా కొనుగోలు చేసిన ప్రాపర్టీ వివరాలను కూడా గుర్తించినట్లు ఈడీ తన స్టేట్మెంట్‌లో పేర్కొన్నది. లబ్ది పొందిన ప్రాపర్టీలను సుబోధ్ కుమార్ కంట్రోల్ చేస్తున్నట్లు తేలింది. సీఎస్పీఎల్‌తో ఆ ప్రాపర్టీలకు లింకు ఉన్నట్లు గుర్తించారు.





## రాష్ట్రపతి, గవర్నర్ చక్రవర్తులా?

అసెంబ్లీ బిల్లుల విషయమై సుప్రీంకోర్టు ఆదేశాల అనంతరం రాష్ట్రపతి, గవర్నర్ల అధికారాల గురించిన చర్చలు చాలా జరుగుతున్నా ప్రజాభిప్రాయం ఎట్లా ఉన్నదనే ప్రస్తావన మాత్రం ఎక్కడా రావటం లేదు. ఈ అంశంపై రాజ్యాంగం, చట్టాలు, గత వివాదాలు, తీర్పులలో విషయాలు చాలానే ఉన్నాయి. అవి అన్నీ ప్రస్తుతం చర్చకు వస్తున్నాయి. అంతవరకు మంచిదే. అదే సమయంలో కొన్ని వివాదాలకు అసాధారణ స్వభావం ఉంటుంది. అటువంటి సందర్భాలలో, ప్రజాభిప్రాయం ఏ విధంగా ఉందనేది గమనించడం కూడా అవసరం. తమిళనాడు గవర్నర్ తీరును పురస్కరించుకొని తలెత్తిన సమస్య అటువంటిది. రాష్ట్రపతి, తదితరుల రాజ్యాంగ అధికారాలు ఏవైనా, అంతిమంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో వీరెవరూ మధ్యయుగాల నాటి చక్రవర్తులు కారు. అందరి అధికారాలకు మూలం ప్రజాభిప్రాయంలో ఉంటుంది.ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే ప్రజాస్వామిక వ్యవస్థలు ఏర్పడటం, రాజ్యాంగాలు, చట్టాలు రూపొందటం నిజమే. అటువంటప్పుడు, యథాతథంగా ఆలోచించినట్లయితే ప్రతి అంశంపై ప్రజాభిప్రాయం ఏ విధంగా ఉందనేది ఆలోచించనక్కరలేదు.

కొన్ని దేశాలలో వలె ప్రతి ముఖ్యమైన అంశంపై రెఫరెండం అవసరం లేదు. కానీ అదెప్పుడు? ఎన్నికైన అధికారపక్షం గాని, ప్రతిపక్షాలు గాని అటువంటి అభిప్రాయాలకు, అవి ప్రతిఫలించే రాజ్యాంగానికి, చట్టాలకు అనుగుణంగా, అక్షరబద్ధంగా, స్ఫూర్తిబద్ధంగా కూడా వ్యవహరించినప్పుడు, పాలించినప్పుడు. అప్పుడే అది ప్రజాస్వామ్యబద్ధ పాలన అవుతుంది. ప్రజలకు ఆమోదకరం అవుతుంది. అందుకు భిన్నంగా వ్యవహరించే అధికారాలు, హక్కులూ రాజకీయ పార్టీలకు, ప్రభుత్వాలకు ఏ విధంగానైతే ఉండవో గవర్నర్లకు, రాష్ట్రపతులకు కూడా ఉండవు. ఎవరూ దైవాంశ సంభూతులు, గతకాలపు చక్రవర్తులు కారు. అందువల్ల, గవర్నర్లను, రాష్ట్రపతినే సుప్రీంకోర్టు ఆదేశిస్తుందా? అనే ప్రశ్న ఎంత మాత్రం అవగాహన లేని, విలువ లేని దురహంకార పూరితమైన వైఖరి మాత్రమే.ఇది చూసినప్పుడు అమెరికాలో జరుగుతున్నది గుర్తుకు వస్తున్నది. భారతదేశాన్ని ప్రపంచంలోకెల్లా అతిపెద్ద ప్రజాస్వామిక వ్యవస్థ అంటారు. నిజమా కాదా అన్నది అట్లుంచి, ప్రపంచ ప్రజాస్వామ్యానికే మాతృక అని ప్రధాని మోదీ సగర్వం గా చాటిచెప్తుంటారు. అమెరికాను గొప్ప ప్రజాస్వామ్య మంటారు. ప్రస్తుతం ఈ రెండు ఘనమైన ప్రజాస్వామ్యాల్లో జరుగుతున్నది ఒకే విధంగా ఉండటం విశేషం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అక్రమ వలసదారులని చెప్పేవారి నుంచి మొదలుకొని, స్వయంగా తమ పౌరులు అయి నవారిపై, పరిపాలనా వ్యవస్థపై తీసుకుంటున్న పలు చర్యలపై కోర్టులు స్టే విధిస్తున్నాయి. కొన్నింటిని కొట్టివేస్తున్నాయి. ఆయా కోర్టు ఉత్తర్వులను ట్రంప్ ప్రభుత్వం పాటించడానికి బదులు బహిరంగంగా ధిక్కరిస్తున్నది. ఆ జడ్జీలను ప్రభుత్వంతో పాటు, ట్రంప్ అధికారులు, అధికారపక్షమైన రిపబ్లికన్ పార్టీ నాయకులు బాహాటంగా పదేపదే విమర్శిస్తున్నారు. వారిని ఇంపీచ్‌మెంట్‌తో పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకరినైతే, నమ్మశక్యం కాని రీతిలో, ఏదో సాకు చూపి అరెస్టు చేసే దాకా వెళ్లారు.ఒక ఘనమైన ప్రజాస్వామ్యంలో ఇట్లా జరుగుతుండగా, మరొక ఘనమైన ప్రజాస్వామ్యంలో ఏమి జరుగుతున్నది? గత చరిత్రను పక్కన ఉంచుదాం. తమిళనాడు బిల్లుల సంగతి చూద్దాం. అక్కడి అసెంబ్లీ ఒకటికి రెండుసార్లు రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆమోదించిన బిల్లులను కూడా అక్కడి గవర్నర్ రవీంద్ర నారాయణ్ రవి నెలలు, సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచుతారు. సుప్రీంకోర్టు ఆదేశాల తర్వాత సైతం నిబంధనలకు విరుద్ధంగా అప్పుడు రాష్ట్రపతి పరిశీలనకు పంపుతారు.బిల్లుల పట్ల ఆ విధమైన వైఖరి వల్ల రాష్ట్రంలో వేర్వేరు శాఖల పరిపాలన దెబ్బతింటుంది. అయినప్పటికీ ఆయన లెక్కచేయరు. ఇదే ఒక అప్రజాస్వామికమైన, రాజ్యాంగ విరుద్ధమైన దారుణ ప్రవర్తన కాగా, అంతకన్న దారుణమైనది మరొక స్థాయిలో జరుగుతుంటుంది. అది ఢిల్లీ స్థాయిలో. అక్కడి నుంచి అన్నీ గమనించే హోంశాఖ, హోంమంత్రి, ప్రధానమంత్రి, రాష్ట్రపతి ఎవరూ అది తగదని వారించరు. పరిస్థితిని సరిదిద్దరు. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తులు చేసినా పట్టించుకోరు. గవర్నర్ రవి ఇది చాలదన్నట్లు, తన అధికార పరిధులను బాహాటంగా అతిక్రమిస్తూ, అక్కడి అధికారపక్షమైన డీఎంకేకు వ్యతిరేకంగా రాజకీయ వ్యాఖ్యలు చేస్తుంటారు. అటువంటి కార్యకలాపాలలో పాల్గొంటారు.గవర్నర్ రవికి ఒక ప్రతిష్ఠాత్మకమైన నేపథ్యం ఉంది. ఐపీఎస్ అధికారి అయిన ఆయన అందుకు సంబంధించిన పలు హోదాలలో పనిచేసిన తర్వాత, కొన్ని చోట్ల గవర్నర్‌గా కూడా ఉండిన వెనుక, నాగాలాండ్‌కు గవర్నర్‌గా నియమితులయ్యారు. సమస్యాత్మక ఈశాన్య భారత రాష్ట్రాలలో ఐపీఎస్ నుంచి, సైన్యం నుంచి రిటైరైన వారిని గవర్నర్లుగా నియమించటం ఎప్పటినుంచో ఉంది. అంతవరకు సరే. కానీ, వాటన్నింటిలో అతి క్లిష్టమైన, అతి సున్నితమైన నాగాలాండ్‌లో జాగ్రత్తగా వ్యవహరించాలి. పైగా అప్పుడు నాగా సంస్థలకు, కేంద్రానికి మధ్య చర్చలు జరుగుతున్నాయి. అంతకుముందు అక్కడ పనిచేసిన వారిలో జనరల్ కె.వి.కృష్ణారావు ఉన్నారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శిగా పనిచేసిన కె.పద్మనాభయ్య నాగాలతో చాలాసార్లు చర్చలు జరిపారు. అప్పుడంతా వారు ఎంతో నేర్పుగా వ్యవహరించారు. కానీ, రవి తీరుతో విసుగెత్తిన నాగాలు ఆయనను తొలగిస్తే తప్ప చర్చలు జరుపబోమని ప్రకటించటంతో కేంద్రం తనను తమిళనాడుకు బదిలీ చేసింది. రాజకీయంగా ఆ రాష్ట్రం మరొక విధంగా సున్నితమైనది. కానీ, ఆయన తీరు మారలేదు.

విషయం చిలికిచిలికి ప్రస్తుతం మనం చూస్తున్నట్లు గాలివానగా మారింది.అసలు సమస్య కేంద్రం వద్ద ఉంది. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్నచోట వాటిని రకరకాల ఇబ్బందులకు గురిచేయటం, వీలైతే పడగొట్టడం, అందుకు గవర్నర్లను ఉపయోగించుకోవటం. వాస్తవానికి ఈ అప్రజాస్వామిక, రాజ్యాంగ విరుద్ధమైన ధోరణిని ఆరంభించింది కాంగ్రెస్ పార్టీ. ఆ దుష్ట సంప్రదాయాన్ని బీజేపీ కూడా కొనసాగిస్తున్నది. అప్పుడు కాంగ్రెస్‌కు నీతులు చెప్పి తానిప్పుడు అదే పనిచేస్తున్నది. తమిళనాడు పొరుగున గల కేరళలో ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, ఇటు తెలంగాణలో తమిళిసై, అటు పశ్చిమబెంగాల్‌లో ఆనందబోస్‌ల చర్యలు తెలిసినవే.ఇప్పుడు గవర్నర్ రవిని కేంద్రం ఇన్నిన్ని జరుగుతున్నా అదుపు చేయకపోగా, తమకు కొరకరాని కొయ్యగా మారిన డీఎంకేను ఆయన చికాకు పరచటాన్ని చూసి ఆనందిస్తున్నదనాలి. గవర్నర్ పదవి రాజ్యాంగపరమైనది అయినప్పుడు, రాజ్యాంగానికి అధినాయకత్వ స్థానంలో గల రాష్ట్రపతి ఏమి చేస్తున్నట్లు? పైకి కన్పించింది అయితే ఏమీలేదు. తను ఏమైనా చేసినా మనకు కన్పించలేదో లేక రబ్బర్ స్టాంప్ వలె వ్యవహరించారో తెలియదు.

# తొలి తరం సంఘ సంస్కర్త

## నేడు మాదరి భాగ్యరెడ్డి వర్మ


ఆశ శ్రీరాములు

పంచములం కాదు ఈ దేశ మూలవాసులం పాలకులం ఆది హిందువులం అంటూ గర్జించిన నాయకుడు నిజాం స్టేట్ దక్కన్ పీఠభూమి తో పాటు దక్షిణ భారతదేశంలో ఆది హిందూ ఉద్యమాన్ని నిర్మించిన ఉద్యమ శిఖరం మాదరి భాగ్యరెడ్డి వర్మ . సమ సమాజంలో అణగారిన వర్గాల చైతన్యం కోసం కృషి చేసిన నాయకుడు భాగ్యరెడ్డి వర్మ , హైదరాబాదు నడిబొడ్డులో బస్తీల వారిగా పంచ కమిటీలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేసిన నాయకుడు. నిజాం స్టేట్ లో ఉర్దూ మీడియం చదువులు కొనసాగుతున్న సమయంలో ఇస్సామీయా బజార్ కోఠి లో బాలికల కోసమే తెలుగు మీడియం పాఠశాల ఏర్పాటుచేసిన మహిళల పక్షపాతి భాగ్యరెడ్డి వర్మ , విశ్వరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తో పాటు స్వాతంత్ర ఉద్యమ నాయకుడు మహాత్మా గాంధీ తో మంచి సంబంధాలు కొనసాగించే నాయకుడు . నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను వ్యతిరేకిస్తూనే ఆదిశంకరాచార్యులతో మంచి సంబంధాలు కొనసాగించిన అందరివాడు భాగ్యరెడ్డి వర్మ , సమాజంలో అసమానతులైన జోగిని , దేవదాసి, బాల్యవివాహాల వ్యవస్థను, జంతు బలులను రూపుమాపాలని , అణగారిన ప్రజలు మాంసాన్ని మధ్యాన్ని వదిలేయాలని బోధించిన మహానుభావుడు భాగ్యరెడ్డి వర్మ , విద్యావంతులైన అణగారిన ప్రజలకు విద్య , ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో నిజాం ప్రభుత్వంలో అవకాశాలు కల్పించడానికి కృషి చేసిన సంఘసంస్కర్త ఆయన భాగ్యరెడ్డి వర్మ,



సమాజంలో అణగారిన ప్రజలు అంటరానితనం , వివక్షతను ఎదుర్కొంటున్న సమస్యలను బయటి ప్రపంచానికి తెలియడం కోసం తెలుగు హిందీ ఇంగ్లీష్ భాషల్లో వివిధ పత్రికల్లో వ్యాసాల ద్వారా బయట ప్రపంచానికి తెలియచేసిన బహుభాషా కోవిదుడు భాగ్యరెడ్డి వర్మ , ఆనాటి సంఘసంస్కర్తలతో కలిసి పనిచేసి అణగారిన వర్గాల ప్రజల చైతన్యం ఆత్మగౌరవం కోసం నిరంతరం తపించిన మానవతావాది భాగ్యరెడ్డి వర్మ .

దక్కన్ పీఠభూమి హైదరాబాద్ నడిబోడ్డులో ఇస్సామియా బజార్ బస్తీలో మాదరి వెంకయ్య మాదిరి రంగమ్మ లకు ఐదుగురు సంతానంలో రెండో సంతానంగా 22 మే 1888 న జన్మించారు . తల్లిదండ్రులు ఆయనకు బాగయ్యగా నామకరణం చేశారు . కొన్నాళ్ల తర్వాత వాళ్లకు ఇంటి గురువు బాగాయ్యలోని చురుకుదనం చూసి భాగ్యరెడ్డిగా పేరు మార్చారు .

తాను నివసిస్తున్న కోఠి ప్రాంతం కావడంతో అక్కడ అప్పటికీ స్థానికులతో పాటు సంఘసంస్కర్తలు బ్రిటిష్ పరిపాలకులు నివాసముండే ప్రాంతం . చిన్నతనంలోనే కుటుంబ భారం పైన పడటంతో ఆయన స్థానికంగా నారాయణగూడ వై ఎం సి ఏ లో పనిచేసేవారు . అక్కడే ఒక ఫ్రెంచ్ అధికారితో పరిచయం ఏర్పడి సన్నిహితం పెరిగింది. భాగ్యరెడ్డివర్మ చేస్తున్న ప్రతి పనికి అతడు ప్రోత్సహించేవారు. సుల్తాన్ బజార్ లోని ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించేవారు వాటిల్లో కూడా ఆయన చురుగ్గా పాల్గొనేవారు . ఇదే క్రమంలో చుట్టుపక్కల బస్తీలలో పరిచయాలు ఏర్పాటు చేసుకుని బస్తీల వారిగా సమస్యలు పరిష్కరించడం కోసం అంటరానితనం నిర్మూలించడం కోసం నిరక్షరాశులకు రాత్రిపూట చదువు నేర్పించడం కోసం సుమారు 100 బస్తీలో పంచ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలతో సామాజిక జీవనం ప్రారంభించారు . ఇదే క్రమంలో పంచ కమిటీలకు అనుబంధంగా జగన్ మిత్రమండలిని ఏర్పాటు చేశారు . 1906 లక్ష్మీదేవితో వివాహం జరిగింది . 1910 లో తొలిసారిగా సుల్తాన్ బజార్ లో బాలికల కోసం తెలుగు మీడియం పాఠశాలను ఆది హిందూ సోషల్ లీగ్, జగన్ మిత్రమండలి ఆధ్వర్యంలో ప్రారంభించారు . బ్రహ్మ సమాజంలో ఉత్తమమైన సేవలు అందించినందుకు గాను గౌరవంగా వర్మ అనే బిరుదును సంఘసంస్కర్త బాజీ కిషన్ రావు ఆధ్వర్యంలో అందజేశారు. నాటి నుండి మాదరి భాగ్య రెడ్డి వర్మ గా పేరు మారిపోయింది. జగన్ మిత్రమండలి పేరును మన్నే సంఘంలో మార్చారు . సమాజంలో అసమానతులను ఆచారాలు వ్యవహారాల పేరుతో సాగుతున్న మూఢనమ్మకాలను నిర్మూలించడం కోసం జీవ రక్ష జ్ఞాన ప్రచారమండలిలో పనిచేశారు . అప్పటికే హైదరాబాదులో జరుగుతున్న సభలు సమావేశాల్లో ఆయన చురుకుగా పాల్గొని తమ అభిప్రాయాలను వెలిబుచ్చేవారు .




పంచ కమిటీల ద్వారానే కుల నిర్మూలన జరగాలని దళితుల్లో మాల మాదిగ ఇతర ఉప కులాల సమస్య ఉండొద్దని అందరూ కూడా ఆది హిందువులుగా ప్రకటించుకోవాలని ఆది హిందూ ఉద్యమాన్ని ముందుకు తీసుకువచ్చారు . 1911 లో ఆది హిందూ ప్రథమ సభలను నిర్వహించారు

ఆది హిందూ సోషల్ లీగ్ సమావేశాలకు సికింద్రాబాద్ నివాసి అయిన ఎమ్. ఏల్ ఆదయ్యను రిసెప్షన్ కమిటీ చైర్మన్గా ఎన్నుకున్నారు . సభ్యులుగా రావు సాహెబ్ టీ జె పాపన్న అధ్యక్షులుగా , బీటీ కృష్ణయ్య వైస్ చైర్మన్‌గా , భాగ్యరెడ్డి వర్మ కార్యదర్శులు ఎన్నుకొని సభలను నిర్వహించారు. ప్రధానంగా సమావేశంలో నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో అణగారిన ప్రజల హక్కుల కోసం వారు చైతన్యం కోసం తీసుకోవాల్సిన అంశాలపై చర్చించి తీర్మానించారు.

**జంట నగరాల్లో 26 పాఠశాల ఏర్పాటు**

ఆది హిందూ సంస్థ ఆధ్వర్యంలో మొదటిసారి 1911బాలికల కోసం పాఠశాలలను నెలకొల్పారు దీని ద్వారా సమాజంలో చైతన్యం కోసం పాటుపడ్డాడు. తర్వాత కాలంలో హైదరాబాద్ సికింద్రాబాద్ జంట నగరాల్లో 26 పాఠశాలలను నెలకొల్పారు .

**ఆది హిందూ పాఠశాలలో చదివిన విద్యార్థికి వేద పట్టణంలో ప్రథమ బహుమతి**

బేగంపేటలో జంట నగరాలలో వేద పాఠశాలలో చదివే విద్యార్థులకు నిర్వహించిన వేద పఠనం పోటీల్లో

**మిగతా రేపటి సంచికలో..**

# పుస్తక పఠనం - పురోగతికి మూలం



నేటి రోజుల్లో పఠనాభిలాష క్రమంగా తగ్గుముఖం పడుతోంది. చాలామందికి పుస్తకం తెరిచి చదవాలి అనే ఆలోచన క్రమంగా హరించుకుపోతుంది. ఈ పోకడ ఆయా తరగతుల పాఠ్యపుస్తకాలకే పరిమితం కావడం లేదు. అన్ని రకాల పుస్తకాలకు ఇది వర్తిస్తుంది. పుస్తక పఠన సంగతి ఇలా ఉంటే, ఇక సెల్ ఫోన్లు పట్టుకొని గంటల కొద్ది సమయాన్ని కేటాయిస్తున్నారు. కొందరైతే రోడ్డుపై సైతం సెల్ ఫోన్ వీక్షణలో లీనమై నడవడం గమనిస్తున్నాం. మరి ఇంత జాడ్యం పనికిరాదు. సెల్ ఫోన్లు ఎంతవరకు అవసరమో అంతవరకే ఉపయోగించాలి. అందుకే అతి చేస్తే గతి చెడుతుందని పెద్దలు ఏనాడో చెప్పారు కదా!

నాకు బాగా గుర్తున్న మేరకు చిన్నప్రాయంలో పెద్దలు పుస్తకం పట్టుకొని చదవండి అంటూ గద్దించేవారు. చక్కగా బాసిన పీట వేసుకొని గంటలకొద్ది పుస్తకాలను చదివిన జ్ఞాపకాలు ఉన్నాయి. ఈ సాంకేతిక విప్లవంతో క్రమంగా పుస్తక పఠనం కనుమరుగవుతోంది.

పుస్తక పఠనం క్రమ పద్ధతిలో లేకపోవడంతో విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారనేది వాస్తవం. పుస్తక పఠన స్థానంలో స్మార్ట్ ఫోన్లు ఎంటరై పిల్లలను తమ చదువులకు దూరం చేస్తున్నాయనేది గమనించబడుతున్న అంశం. స్మార్ట్ ఫోన్లకు, ట్యాబ్లకు పిల్లలు బానిసలుగా మారుతూ చదువుల్లో వెనకబడుతున్నట్లు ఒక అధ్యయనంలో వెల్లడైంది.

ఈ మధ్య ఒక వార్తను ఎక్కడో గమనించాను. ఒక పిల్లోడు స్మార్ట్ ఫోన్ కు బానిసై దానితోనే గంటల కొద్దీ సమయం వెచ్చించడంతో తల్లిదండ్రులు గద్దించి స్మార్ట్ ఫోన్ను దూరం చేసినందుకు, మందలించినందుకు సదురు పిల్లోడికి కోపం వచ్చి ఇంట్లోని ఖరీదైన పరికరాలను నాశనం చేసినట్లు చదివాను. ఇది పైత్యమా? విపరీతమా? పిచ్చా? అందుకే వినాశకాలే విపరీత బుద్ధి అని పెద్దలు ఏనాడో చెప్పారు. ఈ హెచ్చరిక అన్నింటికీ వర్తిస్తుంది. దానినే అతి చేస్తే గతి చెడుతుందంటారు. దేనిలోనైనా లిమిట్స్ లో ఉంటేనే అన్నింటా శ్రేయస్కరం.

ఈ పోకడకు బదులుగా మంచి పుస్తక పఠనాసక్తి పెంపొందించుకోవాలి. ఎందుకనగా మంచి పుస్తక పఠన అలవాట్లు మనిషిని మానవుడిగా తీర్చిదిద్దుతుంది. పుస్తక పఠనం చదువుతోపాటు సదరు పుస్తకంపై సమీక్ష చర్చలుంటే సంసిద్ధ మానవుడిగా తీర్చిదిద్దుతుంది. చదవడం వలన కలుగు ప్రయోజనాలు కోకొల్లలు. పుస్తక పఠన ప్రేమికులు అనేక గొప్ప కార్యాలను సాధించి చరిత్రలో నిలిచిపోయారు. దాదాపు మహానుభావులందరూ పుస్తక ప్రియులే!

కొంత సమయం దొరికితే చాలు పుస్తక పఠనంలో విలీనం అయ్యే గొప్ప వ్యక్తుల గూర్చి చదివాను.

తన విమానయానంలో ప్రసిద్ధిగాంచిన పారిశ్రామికవేత్త రతన్ టాటా పుస్తక పఠనంకే అట్టి సమయాన్ని కేటాయించేవారట. పక్కన కూర్చునే వారి సంగతి సైతం పట్టించుకోకుండా కేవలం పుస్తక పఠనంలోనే విలీనం అయ్యేవారట. ఇదే ఆయన సక్సెస్ సూత్రాలలో ఒకటి. పుస్తకాలను పఠించడం ద్వారా జ్ఞాన పరిధి ఖచ్చితంగా, మరింతగా విస్తృతమవుతుంది. ఆలోచనా శక్తి పెంపొందుతుంది. మనిషి తలరాతను మార్చేది చదివే! ఇందులో సందేహాలకు తావేలేదు. పుస్తక పఠన గొప్పతనం గూర్చి మహానుభావులు ఎప్పుడో వివరించారు. చిరిగిన చొక్కా అయిన తొడుక్కో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో, పుస్తకం హస్తభూషణం ఇలా పుస్తకాల ప్రాముఖ్యత చక్కగా చెప్పబడింది. తరతరాల విజ్ఞాన సంపదను అందించేది పుస్తకాలే కదా!

**పుస్తక పఠనం వలన విశిష్ట ప్రయోజనాలు.**

పుస్తక పఠనం ద్వారా వ్యక్తిలో మార్పువస్తూ మహా మనిషిగా మారుతుంటారు. పుస్తక పఠనం గొప్ప మంచి అలవాటు, అభివృద్ధికి బాట వేస్తుంది.

మంచి పుస్తకాలు తండ్రివలె ఆదేశిస్తాయి. తల్లి వలె లాలిస్తాయి. మిత్రుని వలె ఆదరిస్తాయి. మరి ముఖ్యంగా గురువు వలె ప్రబోధిస్తూ సన్మార్గంలో ఉంచుతాయి. పనులతో, ఆయా చికాకులతో, సమస్యలతో ఉండే సమయాలలో మంచి పుస్తక పఠనం గొప్ప రిలీఫ్ నిస్తాయి.

మంచి పుస్తక పఠనం ద్వారా నైతికత, విచక్షణా జ్ఞానం పెరుగుతుంది.

పుస్తక పఠనం ద్వారా నూతన ఆలోచనలు, నూతన ఆవిష్కరణలు, నూతన అభిప్రాయాలు ఏర్పడుతుంటాయి. అవి అభివృద్ధికి బాట వేస్తుంటాయి.




ఆయా తరగతుల్లో, పరీక్షల్లో మంచి మార్కులు-ర్యాంకులు సాధించడానికి పుస్తక పఠనం ఖచ్చితంగా దోహదపడుతుంది.

పోటీ పరీక్షలకు-ఉద్యోగ ఎంపిక పరీక్షలకు మరియు చదువుల్లో రాణించడానికి పుస్తక పఠనం బ్రహ్మాండంగా తన మద్దతుని ఇస్తుంది. దివ్యమైన ఫలితాలనిస్తుంది.

మొదట ఓపికగా కూర్చుంటూ పుస్తక పఠనాన్ని ప్రారంభిస్తూ చివరి వరకు కొనసాగించాలి. చదివే క్రమంలో అందలి ముఖ్యాంశాలను, కీలక అంశాలను ప్రత్యేకంగా గుర్తించాలి.

ప్రతిరోజు కొంత సమయాన్ని నిర్దిష్టంగా పుస్తక పఠనకే వినియోగించాలి.

అన్ని పాఠశాలలో (వీలైతే గృహాలలో) మంచి పుస్తకాలతో లైబ్రరీలు ఏర్పాటు చేయాలి. వాటిని ఉపయోగించాలి.

పాఠశాలల్లో ప్రతి పీరియడ్లో విధిగా కొంత సమయాన్ని కంటెంట్ పఠనానికే కేటాయించాలి.

ప్రతి పాఠశాలలో కేవలం పుస్తక పఠనం కోసమే ఒక ప్రత్యేక పీరియడ్ నిర్వహించాలి.

ప్రతి పాఠశాలలో లైబ్రరీలు ఏర్పాటు చేస్తూ-పుస్తక పఠనం,పుస్తక సమీక్ష వంటివి క్రమంగా నిర్వహించాలి. విద్యార్థుల్లో పఠనాసక్తులను విరివిగా పెంపొందించాలి. సమయం దొరికితే చాలు చదువుకోవాలనే తృష్ణను పెంపొందించాలి.

పిల్లలు పెద్దలు పుస్తకాలు చదివే సమయంలో చక్కని ప్రశాంత వాతావరణమును వారికి కల్పించాలి.

పుస్తక పఠనం వలన కలిగే బహుళ ప్రయోజనాలను అందరికీ వివరిస్తూ పఠనాసక్తులను విరివిగ పెంపొందించాలి.

అందరిలో మరీ ముఖ్యంగా విద్యార్థుల్లో చదివే అలవాట్లను ప్రోత్సహించాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు, టీచర్లు పెద్దలు ప్రత్యేక శ్రద్ధసక్తులు ప్రదర్శించాలి. స్పష్టంగా చెబితే చదువే తలరాతను మారుస్తుంది. చదువులోని మాధుర్యం చదువుకు గల శక్తి గూర్చి చదివే వారికే తెలుస్తుంది. చదువు అన్నింటికి పరిష్కారం చూపుతుంది. అందుకే చక్కగా చదవాలి, మరింతగ ఎదగాలి.

**డాక్టర్ ఎం ప్రభుదయాల్**
**మాజీ సెనెట్ సభ్యుడు - కాకతీయ యూనివర్సిటీ,**
**జీవిత సభ్యుడు - ఐఏటిఈ**
**మండల విద్యాశాఖ అధికారి - కొత్తగూడెం.**

# తులసి మొక్కను పూజించేటప్పుడు ఈ తప్పులు అస్సలు చేయకండి..





హిందూ మతంలో ప్రకృతిని దైవంగా భావించి పూజిస్తారు. ముఖ్యంగా, హిందూ మతంలో తులసి మొక్కను పూజించే సంప్రదాయం ఉంది. అంతేకాకుండా, తులసి మొక్క విష్ణువుకు చాలా ప్రియమైనది. తులసి మొక్క లక్ష్మీ దేవి నివాసం కూడా. సనాతన ధర్మ విశ్వాసాల ప్రకారం, సాయంత్రం పూట తులసి మొక్క దగ్గర దీపం వెలిగించి పూజించడం వల్ల కుటుంబానికి ఆనందం, శాంతి, సంపద లభిస్తాయి.హిందువులు తులసి మొక్కను పూజించి ఉదయం, సాయంత్రం దానికి నీరు అర్పిస్తారు. అంతే కాదు, తులసిని లక్ష్మీ దేవి రూపంగా భావిస్తారు. తులసిని ప్రతిరోజూ పూజించి నైవేద్యాలు కూడా సమర్పిస్తారు. ఇంట్లో ప్రియమైన తులసి మొక్కను పెంచడం శుభప్రదమని, ఇంటికి సానుకూల శక్తిని తీసుకువస్తుందని నమ్ముతారు. అయితే, తులసి మొక్కను పూజించడానికి కొన్ని నియమాలు ఉన్నాయి. తులసి మొక్కలకు నీళ్లు పోయడం విషయంలో కొన్ని నిషేధాలు ఉన్నాయి. అవును, ప్రతిరోజూ తులసి మొక్కకు నీళ్లు పోయకూడదని మీకు తెలుసా?

చాలా మంది ప్రతిరోజూ తులసి మొక్కకు నీరు పోస్తారు. ఉదయం, సాయంత్రం తులసి మొక్కను పూజించడం ఆచారం అయినప్పటికీ, హిందూ మత విశ్వాసాల ప్రకారం, మంగళవారాలు, ఆదివారాలు, ఏకాదశి రోజులలో తులసి మొక్కకు నీరు అర్పించడం నిషేధం. ఈ మూడు రోజులు తులసి మొక్కకు నీళ్లు పోయకండి. దీని వెనుక ఒక పురాణ కథ ఉంది. హరి అనుగ్రహం వల్ల లక్ష్మీదేవి ఆదివారాలు, ఏకాదశి తిథిలలో నీళ్లు తాగకుండా ఉపవాసం ఉండేదని ప్రస్తావించబడింది. తులసి లక్ష్మీ దేవి రూపం కాబట్టి, ఆదివారాలు, ఏకాదశి నాడు తులసి మొక్కకు నీరు పోయడం వల్ల ఉపవాసం విరమించవచ్చని భావిస్తారు. అందుకే ఈ రోజుల్లో తులసి మొక్కకు నీళ్లు పోయకూడదు. ఇలా చేయడం వల్ల ఇంట్లో ప్రతికూల శక్తి పెరుగుతుంది. అదేవిధంగా, మంగళవారం తులసిపై నీరు పోయడం వల్ల శివుడు కోపగించుకుంటాడు.

తులసి ఎప్పుడు నాటాలి?

మత విశ్వాసాల ప్రకారం, ఇంట్లో తులసి మొక్కను నాటడానికి గురువారం, శుక్రవారం ఉత్తమ రోజులుగా భావిస్తారు. ఈ రోజున తులసి మొక్కను నాటడం వల్ల భక్తులకు శుభ ఫలితాలు లభిస్తాయి. లక్ష్మీ దేవి త్వరలోనే మిమ్మల్ని ఆశీర్వదిస్తుంది.

తులసి శక్తులను విచ్ఛిన్నం చేయవద్దు:

తులసి మొక్కలను ఏకాదశి, చంద్రగ్రహణం, సూర్యగ్రహణం, సూర్యాస్తమయం తర్వాత కూడా కోయకూడదు. ఎందుకంటే ఈ రోజుల్లో తులసి దేవి విష్ణువును పూజిస్తుంది. నీరు లేకుండా ఉపవాసం ఉంటుంది. కాబట్టి, ఈ రోజున మొక్క నుండి తులసి ఆకులను తీయకండి.

## వీటిని ఇలా తినాలి

కొన్ని పదార్థాల్లోని పోషకాలు ఇంకొక పదార్థంలోని ఇతర పోషకాలతో జత కలిసినప్పుడే ప్రభావవంతమైన ఫలితాన్నిస్తాయి. అవేంటో తెలుసుకుందాం! పుచ్చ ముక్కల మీద కొద్దిగా ఉప్పు చల్లుకుని తింటే, పుచ్చలోని పొటాషియం ఉప్పులోని సోడియంతో జతకట్టి మనలోని ఎలక్ట్రొలైట్స్ సంతులనానికి సహాయపడుతుందిబాదం పప్పును, చాక్లెట్‌తో కలిపి తింటే బాదంలోని విటమిన్ ఇ, ఆరోగ్యకరమైన కొవ్వులు డార్క్ చాక్లెట్‌లోని ఫ్లేవనాయిడ్స్‌తో కలిసి, యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ పెరిగి, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది



ఓట్స్‌ను పెరుగులో నానబెడితే, ఓట్స్‌లోని ప్రిబయాటిక్ బీటా గ్లూకాన్ పెరుగులోని ప్రొబయాటిక్స్‌తో కలిసి పేగుల్లోని మంచి బ్యాక్టీరియా వృద్ధి చెంది, పేగుల ఆరోగ్యం మెరుగుపడుతుందిబ్రొకొలిని ఆవాలతో కలిపి తీసుకుంటే, ఆవాలలోని ఎంజైమ్స్, బ్రొకొలిలోని సల్ఫొరఫైన్ అనే శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ శోషణకు తోడ్పడతాయిగ్రీన్ టీలో నిమ్మరసం కలుపుకుని తాగాలి. నిమ్మరసంలోని విటమిన్ సి, గ్రీన్‌టీలోని యాంటీఆక్సిడెంట్లను శరీరం మెరుగ్గా శోషించుకోడానికి తోడ్పడుతుంది


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 | హైదరాబాద్ గురువారం 22 । మే । 2025




# అమ్మ వేసిన గెలుపు బాట

జియా రాయ్... పదహారేళ్ల ఆటిజమ్ అమ్మాయి. గత ఏడాది... ఇంగ్లిష్ చానల్‌ను ఈదేసింది. ప్రపంచ రికార్డు నెలకొల్పింది. విజయం జియాదే..! కానీ... దాని వెనుకనున్న అసలు కష్టం... ఆమె తల్లి రచనా రాయ్‌ది. అందరిలా తన బిడ్డను సమున్నతంగా నిలబెట్టడం కోసం...వృత్తిని వదిలేసి... ఎన్నిటినో త్యాగం చేసి... స్విమ్మింగ్ నేర్చుకున్నారు 44 ఏళ్ల రచన.అమ్మగానే కాదు... ఒక స్నేహితురాలిగా... ఉపాధ్యాయురాలిగా... అన్నిటికీ మించి మంచి కోచ్‌గా కూతుర్ని ఉన్నతంగా తీర్చిదిద్దారు."ఉన్నది ఒకటే జీవితం. దాన్ని ఎంత హుందాగా, ఎంత అర్థవంతంగా జీవించామన్నదే ముఖ్యం. ఇన్నేళ్ల నా ప్రయాణంలో నాకు అర్థమైంది ఇది. దేశ ఆర్థిక రాజధాని ముంబయి మహానగరం మాది. ఓ పాఠశాలలో ఆర్గానిక్ కెమిస్ట్రీ బోధించేదాన్ని. మావారు మదన్ రాయ్ నేవీలో అధికారి. 2008లో మాకు పాప పుట్టింది. జియా అని పేరు పెట్టుకున్నాం. మా ఆకాంక్షలకు ప్రతిరూపం తను. కానీ రెండేళ్లు తిరిగే సరికి జియా ప్రవర్తనలో మార్పు కనిపించింది. తను బొమ్మలతో ఆడుకొనే తీరు మాకు వింతగా అనిపించేది. వైద్యులను సంప్రతిస్తే... జియాకు ఆటిజమ్ అని చెప్పారు. ఆటిజమ్ గురించి మాకు ఏమాత్రం అవగాహన లేదు. అప్పటికి వైద్యులు, సన్నిహితుల ద్వారా మాకు తెలిసింది ఏంటంటే... జియాకు నిరంతరం థెరపీలు చేయిస్తుండాలని, జీవితాంతం తను వేరొకరిపై ఆధారపడక తప్పదని.

**కెరీర్ అనేది లేదన్నారు...**

ఆటిజమ్ గురించి నేను, మావారు పరిశోధించాం. చాలా విషయాలు అవగాహనకు వచ్చాయి. మా అమ్మాయి పరిస్థితి కంటే నన్ను బాగా బాధించింది... ఇరుగుపొరుగు వారి వ్యాఖ్యలు. జియా ఎంతసేపూ మాపైనే ఆధారపడాలని, తనకు అసలు కెరీర్ అనేదే లేదని కొందరు అనేవారు. అవి నాలో పట్టుదల పెంచాయి. భగవంతుడు మనకు ఈ జీవితాన్ని ప్రసాదించాడు. అంటే ఆయన దృష్టిలో దానికి ఏదో ఒక కారణం ఉండే ఉంటుందనేది నా ప్రగాఢ విశ్వాసం.

**ఉద్యోగం వదిలేసి...**

నేను, మావారు కలిసి మా అమ్మాయికి మాటలు నేర్పించే ప్రయత్నం చేశాం. స్కూల్లో పని చేస్తూనే ఇంటి దగ్గర ట్యూషన్స్ చెప్పేదాన్ని. ఇంటి పనితో పాటు ఇవన్నీ చూసుకొంటూనే, జియాకు కావల్సినవి సమకూర్చేదాన్ని. క్షణం తీరిక లేకపోయినా ఏ రోజూ భారంగా భావించలేదు. అయితే జియాపై మరింత శ్రద్ధ పెట్టాలన్న ఉద్దేశంతో 2011లో ఉద్యోగం వదిలేశాను. ఇంటి దగ్గర ట్యూషన్లు కొనసాగించాను.

**పిల్లలను దూరంగా తీసుకువెళ్లేవారు...**

ఏడాది తరువాత మాకు అబ్బాయి పుట్టాడు. నాకు పని భారంతో పాటు బాధ్యతలు కూడా పెరిగాయి. దీంతో ట్యూషన్స్ కూడా మానేశాను. మరోవైపు జియా ప్రవర్తన చూసి చుట్టుపక్కల వారు 'మీ అమ్మాయి పిచ్చిదానిలా ఉంది' అంటూ తమ పిల్లలను జియాకు దూరంగా తీసుకువెళ్లేవారు. స్కూల్లో చేర్పిద్దామంటే... పాఠశాల యాజమాన్యాలు 'ప్రత్యేక పాఠశాలకు తీసుకువెళ్లండ'ని అనేవారు. చివరకు ఒక స్కూల్లో అడ్మిషన్ ఇచ్చారు.

**మలుపు తిప్పిన ఈత...**

బడికి అయితే వెళుతోంది కానీ... అందరూ జియాను జాలిగా చూడడం మొదలుపెట్టారు. అదే సమయంలో పాఠశాలలో ఈత పోటీలు జరిగాయి. అప్పటికే ఈతలో ప్రవేశం ఉండటంవల్ల జియా ఆ పోటీల్లో పాల్గొంది. విశేషమేమంటే... అందులో స్వర్ణ పతకం గెలిచింది. తోటి విద్యార్థులు చప్పట్లతో అభినందించారు. నా కళ్లు చెమర్చాయి. జియా జీవితాన్ని, తన పట్ల ఇతరుల ఆలోచనా విధానాన్ని సమూలంగా మార్చేసిన ఘట్టం అది. నాకు అర్థమైందేంటంటే... స్విమ్మింగ్ ద్వారా తనకు ఈ సమాజంలో తగిన గౌరవం లభిస్తుందని.

**సవాళ్లు లేని ప్రయాణం లేదు...**

జీవితంలో సవాళ్లు లేని ప్రయాణం అంటూ ఉండదు. జియా విషయంలో అడుగడుగునా ఎన్నో అడ్డంకులు, సమస్యలు. ఈత నేర్పిద్దామని ముంబయిలోని స్విమ్మింగ్ స్కూల్స్ చుట్టూ తిరిగాను. ఎవరూ తనను చేర్చుకోవడానికి ఇష్టపడలేదు. కొంతమంది శిక్షకులు ముందుకు వచ్చినా... తనకు అర్థమయ్యేలా చెప్పలేకపోయారు. ఇక లాభం లేదని నేనే ఈత నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాను. అప్పటివరకు నేను ఈత కొట్టిందిలేదు. కూతురు కోసం మొదటిసారి కొలనులోకి దిగాను.

**అద్భుత విజయాలు ఎన్నో...**

2019లో... తొలిసారి జియా జాతీయ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంది. స్వర్ణ పతకం గెలిచింది. అది మొదలు ఎన్నో పతకాలు సాధించింది. గత ఏడాది ఇంగ్లిష్ చానల్‌ను అతిపిన్న వయసులో, అతితక్కువ సమయంలో ఈదిన ఆటిజమ్ బాలికగా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. 2022లో 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్', మరుసటి ఏడాది 'నేషనల్ అవార్డ్ ఫర్ డిజేబిలిటీ' అందుకుంది. మొత్తంగా కెరీర్‌లో ఇప్పటివరకు 39 స్వర్ణ పతకాలు గెలుచుకుంది. తన విజయాలు చూసినప్పుడు నా గుండె ఆనందంతో ఉప్పొంగుతుంది. ఈ విజయాలు జియాకు మాత్రమే కాదు... ఒక తల్లిగా నాకూ ఎంతో గర్వకారణం. ఒకసారి గుడికి వెళ్లినప్పుడు... జియా చేతులు జోడించి నా ముందు నిలుచుంది. అది గమనించిన ఒకావిడ... 'తన మనసులో మీరు, ఆ భగవంతుడు ఒక్కటే అని మీ అమ్మాయి భావిస్తోంది' అన్నారు. ఆ మాటలకు నా నోట మాట రాలేదు. నా కూతుర్ని గట్టిగా హత్తుకుని ఏడ్చేశాను. ప్రతిభకు పదును పెడితే ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి వైకల్యం అడ్డు కాదని చెప్పడానికి జియా జీవితానికి మించిన రుజువు ఇంకేం కావాలి!"

# సీలింగ్ ఫ్యాన్ స్పీడ్‌గా తిరగట్లేదా

ఎండాకాలంలో ఒక్కోసారి... సీలింగ్ ఫ్యాన్‌కి ఎంత స్పీడ్ పెట్టినా గాలి ఆడదు. చెమటతో చికాకుగా అనిపిస్తూ ఉంటుంది. ఇలా ఇబ్బంది పడకుండా కొన్ని చిట్కాలు పాటించి ఫ్యాన్ వేగాన్ని పెంచుకోవచ్చు.

ఫ్యాన్ రెక్కల మీద దుమ్ము, ధూళి పేరుకుంటే ఫ్యాన్ వేగంగా తిరగలేదు. వారానికి ఒకసారి ఫ్యాన్ రెక్కలను రెండువైపులా తడి గుడ్డతో శుభ్రంగా తుడవాలి. అలాగే మోటార్ దగ్గర ఉండే బేరింగ్‌లను కూడా తుడవాలి. ఫ్యాన్ శుభ్రంగా ఉంటే గాలి వేగంగా గది అంతటా వ్యాపిస్తుంది.

ఫ్యాన్ వేగాన్ని కెపాసిటర్ నియంత్రిస్తుంది. మోటార్‌కు కావాల్సిన శక్తిని అందిస్తుంది. కెపాసిటర్ సరిగా పని చేయని పక్షంలో ఫ్యాన్ నెమ్మదిగా తిరుగుతుంది. ఒక్కోసారి ఆగిపోవచ్చు కూడా. అంతేకాదు ఫ్యాన్ నుంచి శబ్దాలు కూడా వస్తుంటాయి. కాబట్టి కెపాసిటర్‌ను తరచూ పరీక్షిస్తూ ఉండాలి.. అవసరమైతే సమాన ఓల్టేజ్ ఉన్న కొత్త కెపాసిటర్‌ను అమరిస్తే సమస్య తీరుతుంది.



మోటార్‌లోని బేరింగ్‌లు... ఫ్యాన్ సజావుగా తిరగడానికి తోడ్పడతాయి. వీటి మధ్య రాపిడీ పెరిగినప్పుడు ఫ్యాన్ వేగం తగ్గుతుంది. శబ్దం కూడా వస్తుంటుంది. బేరింగ్‌లకు ఎప్పటికప్పుడు లూబ్రికెంట్ ఆయిల్ వేస్తే ప్రయోజనం కనిపిస్తుంది. అవసరమైతే బేరింగ్‌లను వెంటనే మార్చుకోవాలి.

ఇంట్లో ఓల్టేజ్ తక్కువగా ఉన్నా కూడా ఫ్యాన్ నెమ్మదిగా తిరుగుతుంది. ఇంటి వైరింగ్‌ను పరీక్షించి అవసరమైతే ఓల్టేజ్ స్టెబిలైజర్‌ను వాడడం మంచిది. సరైన ఓల్టేజ్ అందితేనే ఫ్యాన్ వేగంగా తిరుగుతుంది.

ఫ్యాన్ రెక్కలు సమతుల స్థితిలో లేకపోయినా, అవి వంగిపోయినా, వాటిని సరిగా బిగించకపోయినా ఫ్యాన్ వేగం తగ్గుతుంది. అలాగే తిరిగేటప్పుడు ఫ్యాన్ ఎక్కువగా ఊగుతుంది. అలాంటప్పుడు వెంటనే బాగు చేయించండి.

ఫ గది విస్తీర్ణాన్ని అనుసరించి రెక్కల పరిమాణం, మోటార్ సామర్థ్యం ఉండే ఫ్యాన్‌ని ఎంచుకుంటే గాలి చక్కగా అన్ని వైపులా ప్రసరిస్తుంది.

# ఈ ఆహారంతో ఒత్తిడి చిత్తు



మనం అనేక ఒత్తిళ్లతో కూడిన ప్రపంచంలో జీవిస్తున్నాం. పనుల్లో డెడ్‌లైన్లు మొదలుకుని వివిధ ఆరోగ్య సమస్యల వరకు రోజువారీగా ఎన్నో అంశాలు మనిషి మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. ఆహారపు అలవాట్లను మార్చుకుంటే ఒత్తిడి, కుంగుబాటు సమస్యలకు చెక్ పెట్టొచ్చు అంటున్నారు నిపుణులు. ఒత్తిడిలో ఉన్నప్పుడు ఏదో ఒక చిరుతిండి తినేకంటే శరీరానికి మంచి పోషణనిచ్చే ఆహారం ఎంచుకోవాలి. ఈ క్రమంలో ఒత్తిడిని హుష్‌కాకి చేయడానికి ఆహారంలో చేర్చుకోవాల్సిన కొన్ని పదార్థాల గురించి తెలుసుకుందాం.

**గింజలు, విత్తనాలు**

బాదం, వాల్‌నట్స్, అవిసెలు, గుమ్మడి గింజల్లో మెగ్నీషియం, ఒమేగా- 3 ఫ్యాటీ ఆమ్లాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మెదడు ఆరోగ్యానికి అండగా నిలుస్తాయి. ఆందోళన లక్షణాల నుంచి ఉపశమనం ఇస్తాయి. చారెడన్ని గింజలు క్యాలరీల బాధ లేకుండానే మనకు ఎంతో శక్తిని, సంతృప్తిని అందిస్తాయి.

**డార్క్ చాక్లెట్**

డార్క్ చాక్లెట్ (70 శాతానికి పైగా)లో యాంటి ఆక్సిడెంట్లు, మెగ్నీషియం పుష్కలం. అలా ఇది శరీరంలో హ్యాపీ హార్మోన్ అయిన సెరటోనిన్ విడుదలను ప్రేరేపిస్తుంది. కాబట్టి, మీ మూడ్‌ను మెరుగుపర్చుకోవడానికి డార్క్ చాక్లెట్‌ను అప్పుడప్పుడు తినడం మంచిదే.

**గ్రీక్ యోగర్ట్, బెర్రీలు**

గ్రీక్ యోగర్ట్‌లో ప్రొటీన్లు, ప్రొబయోటిక్స్ ఉంటాయి. ఇవి పొట్టకు ఆరోగ్యం చేకూరుస్తాయి. మానసిక ఆరోగ్యానికి సహకరిస్తాయి. బెర్రీల్లో యాంటి ఆక్సిడెంట్లు ఎక్కువ. ఇవి ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసోల్ స్థాయులను క్రమబద్ధం చేస్తాయి. జీర్ణక్రియకు సహకరిస్తాయి.

**హెర్బల్ టీలు**

చమోమైల్ (ఒకరకం చేమంతి), లావెండర్, తులసి టీలు ఆందోళనను అమాంతం పోగొడతాయి. మంచి నిద్ర పట్టేలా చేస్తాయి.

తృణధాన్యాల క్రాకర్లు, హమ్మస్-నట్ బటర్

హోల్‌గ్రెయిన్స్‌లో ఉండే కార్బొహైడ్రేట్లు రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రిస్తాయి. తృణధాన్యాలతో చేసిన కరకరలాడే స్నాక్స్ తినడం ఒత్తిడిని పారగొడుతుంది. రుచికోసం వీటికి ప్రొటీన్లు ఎక్కువగా ఉండే హమ్మస్ (శనగలతో చేసిన చట్నీలాంటిది), పీనట్ బటర్ చేర్చుకోవాలి.

**అరటిపండు, దాల్చినచెక్క పొడి**

అరటిపండ్లలో విటమిన్ బి6, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి రెండూ కూడా నాడీ వ్యవస్థ సవ్యంగా పనిచేయడానికి దోహదపడతాయి. అరటిపండు ముక్కలకు కొంచెం దాల్చినచెక్క పొడి చేరిస్తే రుచి పెరుగుతుంది. దాల్చినచెక్క రక్తంలో చక్కెర స్థాయులను క్రమబద్ధం చేయడంలో సహాయకారిగా ఉంటుంది.

# వేడి వేడి అన్నంలో మామిడి కాయ పచ్చడి కలుపుకొని తింటే

## రెసిపీ చాలా సింపుల్

వేసవి కాలం అనగానే ఫుడ్ అంటే ఇష్టపడే వాళ్లెవరికైనా ఘుమఘుమలాడే వడియాలు, మామిడికాయ పచ్చడి, వేడన్నం, నెయ్యి గుర్తుకు వచ్చేస్తాయి. కాస్తంత ముద్ద పప్పు వేసుకుని, అందులో మామిడి కాయ పచ్చడి కలుపుకుని నెయ్యి వేసుకుని వడియాలు నంచుకుని తింటే అమృతంలా ఉంటుంది. ఈ టేస్ట్ ని కొట్టే రుచి ఇంకోటి ఉండదు. పైగా ఇందులో అన్ని రకాల పోషకాలు, విటమిన్స్ ఉంటాయి. అయితే..ఒకప్పుడంటే మామిడికాయ పచ్చడి జాడీల కొద్దీ పెట్టి నిల్వ చేసే వాళ్లు. ఏడాదంతా తినే వారు. కానీ..ఇప్పుడు అంత ఓపిక ఎవరికీ ఉండదం లేదు. అంత పచ్చడి కూడా ఎవరూ తినట్లేదు. పైగా పచ్చడి పెట్టడం



అంటే పెద్ద ప్రహసనం. టైమ్ లేక చాలా మంది బయట కొనుక్కుంటున్నారు. కానీ..ఇంట్లోనే నిముషాల్లోనే మామిడి కాయ పచ్చడి తయారు చేసుకోవచ్చు. అన్నం స్టవ్ పైన పెట్టి అది ఉడికేలోగానే ఈ పచ్చడి రెడీ అయిపోతుంది. మరి ఈ ఇన్ స్టంట్ మ్యాంగో పికిల్ ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు**

కొన్ని పదార్థాలు ఉంటే చాలు. కొద్ది నిముషాల్లోనే ఈ పచ్చడి తయారైపోతుంది. కావాల్సిన ఇన్ గ్రీడియెంట్స్ ఏంటంటే.. మామిడికాయలు, నూనె, ఆవాలు, పసుపు, కారం పొడి, మెంతులు, ఉప్పు, కొన్ని నీళ్లు. వీటిని ఇప్పుడు చెప్పబోయే మోతాదులో కనక తీసుకుంటే రుచికరమైన పచ్చడి తయారు చేసుకోవచ్చు. అయితే.. పచ్చడిలో రుచి కోసం ఇంగువ కూడా వేసుకోవాలి. కాకపోతే మరీ ఎక్కువగా వేసుకుంటే పచ్చడి చేదు వచ్చే అవకాశముంటుంది. నీళ్లు కూడా ఇప్పుడు చెప్పబోయే మోతాదులోనే తీసుకోవాలి. మరీ ఎక్కువగా పోస్తే పచ్చడి పాడైపోతుంది. అన్నంలో కలుపుకోడానికి అనువుగా ఉండదు.

**ఎలా తయారు చేసుకోవాలి**

ఈ పచ్చడి తయారు చేసుకోవాలంటే ముందుగా అరకిలో మామడికాయ ముక్కలు తీసుకోవాలి. దీంతో పాటు రెండు టేబుల్ స్పూన్స్ ఆయిల్, రెండు టేబుల్ స్పూన్స్ ఆవపొడి, అర టేబుల్ స్పూన్ ఇంగువ అవసరమవుతాయి. వీటితో పాటు ఓ టేబుల్ స్పూన్ పసుపు, రెండు టేబుల్ స్పూన్స్ కారం, ఓ టేబుల్ స్పూన్ మెంతులు, కాస్తంత ఉప్పు, అరలీటర్ నీళ్లు తీసుకోవాలి. మామిడి కాయ ముక్కల్ని సన్నగా తరగాలి. తరవాత కడాయి తీసుకుని అందులే నూనె వేసి బాగా వేడి చేయాలి. నూనె వేడెక్కిన తరవాత అందులో ఆవ పొడి, ఇంగువ, పసుపు, కారం, మెంతి పొడి వేయాలి. తరవాత కాస్తంత ఉప్పు వేసి బాగా కలపాలి.

తరవాత ఏం చేయాలంటే

ఈ మిశ్రమం బాగా పేస్ట్ గా మారిన తరవాత అందులే అర లీటర్ నీళ్లు పోయాలి. నీళ్లు బాగా వేడెక్కి ఆ మిశ్రమం అంతా కాస్తంత పేస్ట్ గా మారుతుంది. దీన్ని బాగా మిక్స్ చేయాలి. ఆ తరవాత అప్పటికే కట్ చేసి పెట్టుకున్న మామిడి కాయ ముక్కల్ని కలపాలి. మరోసారి మొత్తం మిక్స్ చేయాలి. అలా 5 నిముషాల పాటు ఉడికించాలి. కాసేపటికి ముక్కలు కాస్త మెత్తబడతాయి. ఆ మిశ్రమం అంతా ముక్కకు బాగా పడుతుంది. అప్పుడు ఓ సారి ముక్క సరిగ్గా ఉడికిందా లేదా అని చెక్ చేసుకుని ఓసారి అంతా కలుపుకుని స్టవ్ ఆఫ్ చేయాలి. అంతే. ఇలా కొద్ది నిముషాల్లోనే పచ్చడి తయారైపోతుంది.

**సరిగ్గా స్టోర్ చేయాలి**

ఇలా తయారైన పచ్చడిని గ్లాస్ జార్ లో నిల్వ చేయడం మంచిది. అయితే..ఈ పచ్చడి చేసేందుకు నీళ్లు వాడుతున్నాం. సాధారణంగా నీళ్లు పోయడం వల్ల పచ్చడి ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉండదు. అందుకే.. తక్కువ మోతాదులోనే చేసుకోవాలి. పైగా దీన్ని సరైన విధంగా మూత పెట్టి ఫ్రిజ్ లో స్టోర్ చేయాలి. బయటే ఉంచితే పాడయ్యే అవకాశముంటుంది. వారం లేదా పది రోజుల పాటు పచ్చడి ఫ్రెష్ గా ఉంటుంది. ఆవాలు, మెంతులు వేయడం వల్ల మంచి రుచి వస్తుంది. అజీర్తితో ఇబ్బంది పడే వాళ్లు రోజుకో సారి తింటే మంచిది. నూనె ఎక్కువగా వాడలేదు కాబట్టి బీపీ పేషెంట్స్ కూడా తినొచ్చు.

**ఇలా కూడా చేసుకోవచ్చు**

ఇందులో కాస్తంత రుచి కోసం మాత్రమే ఉప్పు వేయాలి. మరీ ఎక్కువగా వేయడం వల్ల రుచి మారడంతో పాటు బీపీ పేషెంట్స్ లో బ్లడ్ ప్రెజర్ పెరిగే ప్రమాదముంటుంది. సాల్ట్ కి బదులుగా నిమ్మకాయ రసం లేదా వెనిగర్ వాడొచ్చు. వీటి వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. పైగా ఇందులో ఎలాగో ఆవాలు, మెంతులు ఉన్నాయి కాబట్టి వీటి వల్ల సోడియం లెవెల్స్ పెరిగే అవకాశముండదు. తద్వారా బీపీ కంట్రోల్ లో ఉంటుంది.



# వడగాలులతో గుండె దడ!



పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా, వడగాలులతో గుండె, ఊపిరితిత్తులు దెబ్బతినే ప్రమాదం ఉన్నదని అంటున్నారు. అధిక వేడి వాతావరణంలో శరీర ఉష్ణోగ్రత తనను తాను నియంత్రించుకునే లక్షణం చెదిరిపోతుందని చెబుతున్నారు. వడదెబ్బతో రక్తపోటు తగ్గుతుంది. ఫలితంగా, ముఖ్యమైన అవయవాలకు తగినంతగా రక్తం సరఫరా కాదు. గుండెపై ఒత్తిడి పెరిగి.. గుండెదడ లాంటి సమస్యలూ వస్తాయి. కొన్ని సందర్భాల్లో రక్త ప్రసరణ తగ్గి.. గుండె కండరాలు దెబ్బతినే అవకాశం కూడా ఉంటుంది.

దీర్ఘకాలంలో హృదయ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. ఇక వడగాలులతో ఊపిరితిత్తులపై ఒత్తిడి పెరిగి.. శ్వాసకోస సమస్యలు చుట్టుముడతాయి. ముఖ్యంగా, ఆస్తమా లాంటి దీర్ఘకాలిక శ్వాస సంబంధ వ్యాధులతో బాధపడుతున్నవారిని మరింతగా ఇబ్బందిపెడతాయి. వీరిలో శ్వాస ఆడకపోవడం, గురక, దగ్గుకు కారణం అవుతుంది. ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే.. ఊపిరితిత్తుల వాపు, న్యుమోనియాకూ దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**సురక్షితంగా ఉండాలంటే..**

పగటి వేళలో ప్రతి 20 - 30 నిమిషాలకు ఓసారి గ్లాసెడు నీళ్లు తాగాలి.

వేడి ఎక్కువగా ఉండే సమయాల్లో శ్రమతో కూడిన పనులకు దూరంగా ఉండాలి.

హృదయ, శ్వాసకోశ సమస్యలు ఉన్నవాళ్లు తమ లక్షణాలను నిశితంగా గమనిస్తుండాలి. అవి తీవ్రమైతే వెంటనే వైద్యులను ఆశ్రయించాలి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
10 | హైదరాబాద్ | గురువారం | 22 । మే । 2025



## వరుస నష్టాలకు బ్రేక్ .. 400 పాయింట్లకు పైగా లాభపడిన సెన్సెక్స్

**న్యూఢిల్లీ-నవభూమి:**వరుసగా మూడు రోజులుగా నష్టపోతున్న స్టాక్ మార్కెట్ బుధవారం లాభాల బాటలో సాగింది. ఫార్మా, రియాల్టీ షేర్లు లాభాల బాటలో సాగడం దేశీయ సూచీలకు కలిసివచ్చింది. అలాగే ఆటో, బ్యాంక్, ఎఫ్ఎంసీజీ రంగాలు కూడా లాభపడ్డాయి. అయితే విదేశీ మదుపర్ల అమ్మకాలు తగ్గకపోవడం కాస్త ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఓ దశలో భారీగా లాభపడిన సూచీలు చివరకు ఓ మోస్తారు లాభాలతో రోజును ముగించాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాలతో ముగిశాయి.మంగళవారం ముగింపు (81, 186)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 150 పాయింట్ల




లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింతగా లాభాల్లోకి దూసుకెళ్లింది. ఒక దశలో 800 పాయింట్లకు పైగా లాభపడి 82, 021 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. అయితే మధ్యాహ్నం తర్వాత అమ్మకాలు మొదలయ్యాయి. దీంతో సెన్సెక్స్ కిందకు దిగి వచ్చింది. చివరకు 410 పాయింట్ల లాభంతో 81, 596 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. 129 పాయింట్ల లాభంతో 24, 813 వద్ద రోజును ముగించింది.సెన్సెక్స్‌లో భారత్ ఎలక్ట్రానిక్స్, సీమన్స్, సోలార్ ఇండస్ట్రీస్, పీబీ ఫిన్‌టెక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. డిక్సన్ టెక్నాలజీస్, ఆదిత్య బిర్లా ఫేషన్స్, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఇండస్ ఇండ్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 436 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. బ్యాంక్ నిఫ్టీ 197 పాయింట్లు ఎగబాకింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.64గా ఉంది.




## పెరిగిన ధరలకు బ్రేక్.. భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు



**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో బంగారం, వెండి ప్రియులకు గుడ్ న్యూస్ వచ్చేసింది. పెళ్లిళ్ల సీజన్ వేళ పసిడి కొనుగోలు చేయాలని చూస్తున్న వారికి ఇది మంచి అవకాశమని చెప్పవచ్చు. ఎందుకంటే గత 24 గంటల్లో భారీగా పెరిగిన ధరలు మళ్లీ తగ్గిపోయాయి. ఈ క్రమంలో ఎంతకు చేరుకున్నాయనే విషయాలను ఇక్కడ చూద్దాం.దేశంలో పసిడి ప్రియులకు మళ్లీ ఊరట లభించిందని చెప్పవచ్చు. ఎందుకంటే నేడు (మే 21, 2025) ఉదయం నాటికి వీటి ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 6.30 గంటల నాటికి హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 510 తగ్గిపోయి రూ.95,010 స్థాయికి చేరుకోగా, 22 క్యారెట్ గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 87,090కు చేరుకుంది.ఇదే సమయంలో ఢిల్లీలో 24 క్యారెట్ బంగారం ధర 10 గ్రాములకు రూ. 95,160గా ఉండగా, 22 క్యారెట్ పసిడి ధర రూ. 87,240గా ఉంది. ఇక చెన్నై, ముంబై, కోల్‌కతా, కేరళ, పూణేలో 24 క్యారెట్ పుత్తడి ధర 10 గ్రాములకు రూ.95,010గా ఉండగా, 22 క్యారెట్ గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 87,090 స్థాయికి చేరుకుంది.

ఈరోజు వెండి రేట్లు

ఇదే సమయంలో వెండి ధరలు కూడా భారీగా తగ్గిపోయాయి. ఈ క్రమంలో మే 21, 2025న ఉదయం ఢిల్లీలో కిలో వెండి ధర రూ.1200 తగ్గిపోయి రూ.96,900 స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, వరంగల్, విజయవాడ, తిరుపతిలో కేజీ వెండి ధర రూ.1100 తగ్గి రూ.1,07,900కు చేరుకుంది. మరోవైపు చెన్నై, కేరళ, భోపాల్ వంటి ప్రాంతాల్లో కూడా వెండి రేట్లు రూ.1,07,900 స్థాయికి చేరుకున్నాయి. దీంతోపాటు నోయిడా, నాసిక్, మైసూర్, సూరత్, నాగ్‌పూర్, పాట్నా, జైపూర్, ముంబై వంటి ప్రాంతాల్లో కేజీ వెండి ధర రూ. 96,900గా కలదు.

**బంగారం, వెండి ధరల తగ్గుదలకు గల కారణాలు**

అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం: అమెరికా డాలర్ బలపడడం, ఆసియా మార్కెట్లలో డిమాండ్ తగ్గడం వంటి అంశాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి భారతదేశంలో డిమాండ్ తగ్గడం: వివాహాలు, పండుగలు తగ్గడం వల్ల బంగారం డిమాండ్ తగ్గడం

ప్రభుత్వ విధానాలు: స్వర్ణ దిగుమతులపై విధించిన పన్నులు, టాక్స్‌లు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి. భవిష్యత్తులో ఎలా: గత 10 రోజులలో బంగారం ధరలు సుమారు రూ.5,600 తగ్గాయి. భవిష్యత్తులో, గ్లోబల్ మార్కెట్ పరిస్థితులు, డాలర్ మారకం, భారతదేశంలో డిమాండ్ వంటి అంశాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తాయి. ఈ ధరలు గ్లోబల్ మార్కెట్ ట్రెండ్స్, డాలర్ మారకం, అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు, భారతదేశంలో బంగారం డిమాండ్ వంటి అంశాల ఆధారంగా ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి.

## టైమ్ దాతల జాబితాలో ముకేశ్ అంబానీ అజీమ్ ప్రేమ్‌జీ



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచంలో దాతృత్వ కార్యకలాపాలు నిర్వహించే అగ్రశ్రేణి 100 మంది ప్రముఖుల జాబితాలో దేశీయ పారిశ్రామిక దిగ్గజం ముకేశ్ అంబానీ, ఆయన భార్య నీతా అంబానీతో పాటు విప్రో మాజీ చైర్మన్ అజీమ్ ప్రేమ్‌జీ, జీరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్‌కు చోటు దక్కింది. టైమ్ మ్యాగజైన్ ప్రపంచం లో దాతృత్వ కార్యకలాపాల్లో అత్యంత ప్రభావశీలురైన 100 మంది దాతల జాబితా-2025ని తొలిసారిగా విడుదల చేసింది. అత్యంత అవసరంలో ఉన్న సామాజిక వర్గాలకు విరాళాలందించే దాతలు, ఫౌండేషన్ల సారథులు, లాభాపేక్ష రహిత సంస్థల ఉదారతకు సంబంధించిన కథనాలను ఈ జాబితా వెల్లడిస్తుందని టైమ్ పత్రిక తెలిపింది. టైమ్ కథనం ప్రకారం ముకేశ్, నీతా అంబానీ దంపతులు 2024లో రూ.407 కోట్ల విరాళాలందించి దేశంలోనే అతిపెద్ద దాతలుగా నిలిచారు. దేశంలో అత్యంత సంపన్నులైన ఈ దంపతులు తమ దాతృత్వ కార్యకలాపాల ద్వారా కోట్లాది మందికి సాధికారత కల్పిస్తున్నారని ఆ నివేదికలో తెలిపారు. 11,000 కోట్ల డాలర్ల (రూ.9.35 లక్షల కోట్లు) సంపద కలిగిన తమ వ్యాపార సామ్రాజ్యం ఎన్ని రంగాలకు విస్తరించిందో వారి దాతృత్వ కార్యకలాపాలు కూడా అంతగా విభిన్న రంగాలకు విస్తరించాయని పేర్కొంది. రిలయన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, వ్యవస్థాపకురాలైన నీతా అంబానీ తమ ఫౌండేషన్ చేపట్టే వివిధ కార్యక్రమాలకు స్వయంగా సారథ్యం వహిస్తూ ఉంటారని టైమ్ మ్యాగజైన్ తెలిపింది.

సారథ్యంలోని వైఐపీపీ 300 పాఠశాలలకు కంప్యూటర్లు అందించేందుకు, కెరీర్ కౌన్సెలింగ్, ఇతర సేవల కోసం 80 కోట్ల డాలర్లు (రూ.6,800 కోట్లు) సమీకరించింది. కాగా ఫుట్ బాల్ లెజెండ్ డేవిడ్ బెక్‌హామ్, ప్రముఖ ఇన్వెస్టర్ వారెన్ బఫెట్, అమెరికన్ దాత మెలిండా ఫ్రెంచ్ గేట్స్, ప్రిన్స్ విలియం, వేల్స్ ప్రిన్సెస్ కాథరిన్ కూడా ఈ జాబితాలో ఉన్నారు.

గాంధేయవాది ప్రేమ్‌జీ:గాంధేయవాదిగా పేరొందిన టెక్నాలజీ దిగ్గజం అజీమ్ ప్రేమ్‌జీ ప్రపంచంలో అత్యంత ఉదారంగా దానధర్మాలు చేసే ప్రముఖుల్లో ఒకరుగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన ప్రభుత్వ యాజమాన్యంలోని విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఒక క్రమ పద్ధతిలో తన సంపదను వినియోగిస్తున్నారని టైమ్ పత్రిక తెలిపింది. గివింగ్ ప్లెడ్జ్‌పై సంతకం చేసిన తొలి భారతీయుడు ప్రేమ్‌జీ. 25 సంవత్సరాల క్రితం తాను ప్రారంభించిన ఫౌండేషన్‌కు 2013లో తన కంపెనీకి చెందిన 2,900 కోట్ల డాలర్ల (రూ.2.46 లక్షల కోట్లు) విలువ గల షేర్లను విరాళంగా అందించారు.అంతేకాకుండా విప్రో సంస్థ విద్య, ఆరోగ్యం, ఇతర రంగాల మెరుగుదలకు కృషి చేస్తున్న 940 సంస్థలకు 2023-24 సంవత్సరంలో 10.9 కోట్ల డాలర్లు (రూ.926.5 కోట్లు) సాంప్రదాయిక గ్రాంట్లుగా అందించింది. ప్రేమ్‌జీ ఫౌండేషన్ దేశవ్యాప్తంగా 59 క్షేత్ర స్థాయి కార్యాలయాలు, 263 ఉపాధ్యాయ అభ్యాస కేంద్రా ల ద్వారా ప్రత్యక్షంగా ఉపాధ్యాయులు, గ్రామీణ బాలల సంరక్షణ సిబ్బందితో సంబంధాలు కలిగి ఉంది. ఇప్పటి వరకు 80 లక్షల మంది బాలబాలికల కోసం విద్యా కార్యక్రమాలు చేపట్టింది.

## ఐటీ దిగ్గజం కీలక ప్రకటన.. ఏకంగా 50 వేల మంది ఉద్యోగులకు గుడ్‌న్యూస్..



**న్యూఢిల్లీ-నవభూమి:**ఆర్థిక మాంద్యం భయాలు, అనిశ్చితి మేఘాలు కమ్ముకున్న ఐటీ రంగంలో ఒక శుభపరిణామం చోటుచేసుకుంది. ప్రపంచ ఐటీ సేవల దిగ్గజం యాక్సెంచర్ తమ ఉద్యోగులకు పెద్ద ఎత్తున ప్రమోషన్లు ఇవ్వడానికి సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50,000 మంది ఉద్యోగులకు ప్రమోషన్ కల్పించనున్నట్లు ప్రకటించడం ఐటీ ఉద్యోగుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ ప్రమోషన్లలో సింహభాగం, అంటే 15,000 మంది భారతీయ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. జూన్ నెలలో ఈ ప్రక్రియను చేపట్టనున్నట్లు బ్లూమ్‌బెర్గ్ వార్తా సంస్థ వెల్లడించింది.

**ఆరు నెలల తర్వాత అందుతున్న ప్రమోషన్లు**

కన్సల్టింగ్ సేవలపై డిమాండ్ తగ్గడం, అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితుల ప్రభావం వల్ల గత ఆరు నెలలుగా యాక్సెంచర్‌లో ప్రమోషన్ల ప్రక్రియ వాయిదా పడింది. వాస్తవానికి, ఈ ప్రమోషన్లు 2024 డిసెంబర్‌లోనే జరగాల్సి ఉంది. అయితే, ఉద్యోగుల్లో నెలకొన్న నిరుత్సాహాన్ని దూరం చేసి, వారి మనోస్థైర్యాన్ని పెంపొందించడానికి కంపెనీ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం యాక్సెంచర్‌లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 8 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. జూన్‌లో జరగనున్న ఈ ప్రమోషన్లతో మొత్తం సిబ్బందిలో దాదాపు 6 శాతం మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ఇది ఐటీ పరిశ్రమలో తిరిగి సానుకూల వృద్ధి సంకేతంగా పరిగణిస్తారని చెప్పొచ్చు.

యాక్సెంచర్ తమ సిబ్బందికి పంపిన అంతర్గత మెమోలో, ఈ ప్రమోషన్ల వివరాలను ప్రాంతాల వారీగా స్పష్టం చేసింది.భారత్: 15,000 మంది ఉద్యోగులు

యూరప్, పశ్చిమాసియా, ఆఫ్రికా: 11,000 మంది ఉద్యోగులు

అమెరికాస్: 10,000 మంది ఉద్యోగులుజీతాల్లో పెరుగుదల, బోనస్‌పై తదుపరి నిర్ణయం

ప్రమోషన్లు పొందిన కీలక విభాగాల్లోని ఉద్యోగులకు బేస్ పే (ప్రాథమిక జీతం) పెరగనుంది. అయితే, బోనస్‌లు, పనితీరు ఆధారిత పెర్ఫామెన్స్ బేస్డ్ ఈక్విటీపై నిర్ణయం డిసెంబర్‌లో తీసుకోనున్నట్లు బ్లూమ్‌బెర్గ్ పేర్కొంది. ఆర్థిక అనిశ్చితి, తగ్గుతున్న ఆపరేటింగ్ మార్జిన్‌లను దృష్టిలో ఉంచుకొని, కంపెనీ ఈ వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.కోవిడ్ మహమ్మారి సమయంలో ఐటీ సేవలకు భారీ డిమాండ్ ఏర్పడటంతో, యాక్సెంచర్ కూడా ఇతర ఐటీ కంపెనీల మాదిరిగానే పెద్ద సంఖ్యలో ఉద్యోగులను నియమించుకుంది. అయితే, ఆ తర్వాత ఐటీ సేవలకు డిమాండ్ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, 2023లో ఏకంగా 19,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఈ తొలగింపుల తర్వాత, ఈ తాజా ప్రమోషన్ల ప్రక్రియ కంపెనీ తిరిగి స్థిరత్వం సాధిస్తుందన్న సంకేతాలను పంపుతోంది. ఇది కంపెనీ ఆర్థిక స్థితిస్థాపకతను, ఉద్యోగుల నైతికతను పెంపొందించడానికి కట్టుబడి ఉందని సూచిస్తుంది.

## 11 శాతం వడ్డీకి రూ. 5 లక్షల లోన్



**న్యూఢిల్లీ-నవభూమి:**ఆర్థిక అవసరాలు ఎప్పుడూ చెప్పి రావు. ఉన్నఫళంగా డబ్బు అవసరం పడినప్పుడు, ఆపద్బాంధవుడిలా ఆదుకునే వాటిల్లో వ్యక్తిగత రుణాలు ఒకటి. ఆస్పత్రి ఖర్చులు, అత్యవసర ఇంటి మరమ్మతులు, ఉన్నత విద్య లేదా మరేదైనా ఆర్థిక అవసరానికైనా పర్సనల్ లోన్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే, రుణం తీసుకోవడం ఎంత ముఖ్యమో, దాని నెలవారీ వాయిదాలు ఎంత ఉంటాయో తెలుసుకోవడం అంతే ముఖ్యం. ఇక్కడే పర్సనల్ లోన్ ఈఎంఐ కాలిక్యులేటర్ మీకు అద్భుతంగా సహాయపడుతుంది. ఈ కాలిక్యులేటర్ ఎలా పనిచేస్తుంది. ఈఎంఐ విషయంలో ఎలా తెలివిగా వ్యవహరించాలి అనే వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.పర్సనల్ లోన్ EMI కాలిక్యులేటర్ అనేది ఒక సులభమైన సాధనం. మీరు లోన్ మొత్తం, వడ్డీ రేటు, లోన్ వ్యవధి వంటి కొన్ని ప్రాథమిక వివరాల్ని నమోదు చేయగానే, అది మీ నెలవారీ వాయిదా ఎంత వస్తుందో తక్షణమే లెక్కిస్తుంది. దీని ద్వారా మీరు వివిధ లోన్ ప్రొవైడర్‌ల నుంచి వచ్చే ఆఫర్‌లను పోల్చి చూసుకోవచ్చు ఇంకా మీ బడ్జెట్‌కు ఏది సరిపోతుందో నిర్ణయించుకోవచ్చు. ముందుగా లోన్ మొత్తం. ఇది మీరు తీసుకునే రుణం అసలు మొత్తం. లోన్ ఈఎంఐ ఈ మొత్తంపైనే నేరుగా ఆధారపడి ఉంటుంది. లోన్ మొత్తం ఎక్కువగా ఉంటే అప్పుడు ఈఎంఐ కూడా ఎక్కువ పడుతుంది. ఇదే విధంగా లోన్ మొత్తం తక్కువగా ఉన్నప్పుడు ఈఎంఐ కూడా తక్కువ పడుతుంది. ఇక వడ్డీ రేట్ల విషయానికి వస్తే.. ఇది మీరు లోన్‌కు చెల్లించాల్సినటువంటి వడ్డీ అన్నమాట. ఈఎంఐ ఈ వడ్డీ రేటుకు విలోమానుపాతంలో ఉంటుంది.ఇక లోన్ వ్యవధి అంటే టెన్యూర్. ఇది మీరు లోన్ తిరిగి చెల్లించడానికి తీసుకునే కాల వ్యవధి (నెలలు లేదా సంవత్సరాలలో). %EMI% ఈ EMIలోన్ వ్యవధికి విలోమానుపాతంలో ఉంటుంది. ఎక్కువ లోన్ టెన్యూర్ ఉన్నప్పుడు ఈఎంఐ తక్కువ పడుతుంది. ఇదే విధంగా లోన్ వ్యవధి తక్కువగా ఉంటే అప్పుడు ఈఎంఐ ఎక్కువ పడుతుంది. దీనిని మనం ఇప్పుడు ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.మీరు రూ. 5 లక్షల లోన్‌ను 11 శాతం వడ్డీ రేటుతో తీసుకున్నారనుకుందాం. మంచి క్రెడిట్ స్కోరు ఉన్నప్పుడు.. స్థిర ఆదాయం ఉన్నప్పుడు చాలా ప్రముఖ బ్యాంకులు ఇలా తక్కువ వడ్డీ రేటుకే లోన్లు ఇస్తుంటాయి. ఇక ఇక్కడ టెన్యూర్ ఐదేళ్లుగా అనుకుందాం. ఇక్కడ ఈఎంఐ కాలిక్యులేటర్‌లో ఈ వివరాల్ని ఎంటర్ చేస్తే మీరు చెల్లించాల్సిన ఈఎంఐ రూ. 10,871 గా వస్తుంది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో చాలానే ఈఎంఐ కాలిక్యులేటర్లు అందుబాటులో ఉన్నాయి.

ఇక్కడ ఈఎంఐ తగ్గించుకోవాలంటే మీకు కొన్ని ఆప్షన్లు ఉంటాయి. ముందుగా లోన్ వ్యవధి ఇంకా పెంచుకుంటే.. దానికి అనుగుణంగానే అప్పుడు చెల్లించాల్సిన ఈఎంఐ తగ్గుతుంది. ఇంకా బ్యాంకులతో బేరమాడి కాస్త తక్కువ వడ్డీ రేటు తగ్గించుకోవడం ద్వారా కూడా అప్పుడు ఈఎంఐ తగ్గుతుంది. ఇక కాల వ్యవధి తగ్గించుకుంటే.. అప్పుడు ఈఎంఐ ఇంకా పెరుగుతుంది. ఇక్కడే నాలుగేళ్లకు టెన్యూర్ తగ్గిస్తే అప్పుడు ఈఎంఐ రూ. 12922 పడుతుంది. ఈ విషయాల్ని గుర్తుంచుకోవాలి.

EMI విషయంలో తెలివిగా ఎలా వ్యవహరించాలి?

పర్సనల్ లోన్ తీసుకునేటప్పుడు ఈఎంఐని తగ్గించుకునేందుకు లేదా మీ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా మార్చుకునేందుకు మనం ఇప్పుడు కొన్ని చిట్కాలు చూద్దాం.

లోన్ వ్యవధిని పెంచడం: ఈఎంఐ భారాన్ని తగ్గించుకోవాలనుకుంటే, లోన్ వ్యవధిని పెంచుకోవచ్చు. దీనివల్ల నెలవారీ చెల్లింపు తగ్గుతుంది, కానీ మొత్తం వడ్డీ భారం పెరుగుతుందని గుర్తుంచుకోండి.

అధిక వడ్డీ రేట్లను నివారించడం: వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు వేర్వేరు వడ్డీ రేట్లను అందిస్తాయి. తక్కువ వడ్డీ రేటుకు లోన్ పొందేలా చూసుకోండి. దీనివల్ల మీ ఈఎంఐ తగ్గుతుంది.

ముందుగానే ప్లాన్ చేసుకోవడం: రుణం తీసుకోవడానికి ముందుగానే ఈఎంఐ కాలిక్యులేటర్‌ను ఉపయోగించి వివిధ మొత్తాలు, వడ్డీ రేట్లు, కాల వ్యవధులను ప్రయత్నించండి. మీ నెలవారీ బడ్జెట్‌కు ఏ ఈఎంఐ సరిపోతుందో అంచనా వేసుకోండి.

క్రెడిట్ స్కోర్ మెరుగుపరచుకోవడం: మీ క్రెడిట్ స్కోర్ ఎంత బాగుంటే, అంత తక్కువ వడ్డీ రేట్లకు లోన్ లభించే అవకాశం ఉంటుంది. ఇది మీ ఈఎంఐని తగ్గించడంలో సహాయపడుతుంది.

పాక్షిక చెల్లింపులు: మీ దగ్గర అదనపు డబ్బు ఉన్నప్పుడు పాక్షిక చెల్లింపులు చేయడం ద్వారా అసలు మొత్తాన్ని తగ్గించుకోవచ్చు. దీనివల్ల వడ్డీ భారం తగ్గి, మొత్తం లోన్ త్వరగా తీరుతుంది. అయితే, దీనిపై బ్యాంకులు రుసుములు వసూలు చేయవచ్చేమో చూసుకోండి.

## పసిడి దిగుమతులకు కళ్లెం



**న్యూఢిల్లీ-నవభూమి:**యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి వచ్చి పడే పసిడి, వెండి దిగుమతులను ప్రభుత్వం మరింత కట్టడి చేసింది. ఆ దేశంతో మన దేశానికి ఉన్న సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) ముసుగులో కొన్ని సంస్థలు ప్లాటినం పేరుతో బంగారాన్ని దిగుమతి చేసుకుంటూ సుంకాలు ఎగవేస్తుండడంతో ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. ఇక నుంచి నామినేటెడ్ సంస్థలు, అర్హత పొందిన నగల వ్యాపారులు/సంస్థలు, చెల్లుబాటయ్యే టారిఫ్ రేటు కోటా (టీఆర్‌క్యూ) ఉన్న సంస్థలను మాత్రమే ఈ ఒప్పందం కింద యూఏఈ నుంచి బంగారం, వెండి దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తారు. శుద్ధి చేయని, పాక్షికంగా శుద్ధి చేసిన లేదా పౌడర్ రూపంలో ఉన్న బంగారం, వెండిలకు ఈ నిబంధనలు వర్తిస్తాయి.

**ఎందుకంటే?**

భారత్-యూఏఈ సీఈపీఏ ఒప్పందం ప్రకారం మన దేశ సంస్థలు యూఏఈ నుంచి ఏటా 200 టన్నుల వరకు పాక్షికంగా లేదా ఏ మాత్రం శుద్ధి చేయని ప్లాటినంను ఖనిజ రూపంలో లేదా పౌడర్ రూపంలో ఒక శాతం సుంకంతో దిగుమతి చేసుకోవచ్చు. అయితే చాలా సంస్థలు ఈ ఒప్పందం ముసుగులో స్వచ్ఛమైన బంగారాన్ని కూడా ప్లాటినం ముసుగులో దిగుమతి చేసుకుంటూ సుంకం ఎగవేస్తున్నాయి.

దీనికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. ఇందుకోసం బంగారం, వెండి, ప్లాటినంలకు వేరు వేరు కోడ్స్ కేటాయించింది. ప్లాటినం కూడా 99 శాతం స్వచ్ఛత ఉంటేనే ఒక శాతం డ్యూటీతో అనుమతిస్తామని ప్రకటించింది. దీంతో దుబాయ్ నుంచి వచ్చే అక్రమ బంగారం, వెండి దిగుమతులకు తెరపడుతుందని భావిస్తున్నారు.

## టీవీఎస్ నుంచి కొత్త ఎలక్ట్రిక్ ఆటో




**చెన్నై-నవభూమి:** టీవీఎస్ మోటార్.. కొత్త ఎలక్ట్రిక్ త్రీ వీలర్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చింది. టీవీఎస్ కింగ్ ఈవీ మ్యాక్స్ పేరుతో దీన్ని విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ. 2.95 లక్షలు (ఎక్స్-షోరూమ్). 51.2 వాట్స్ లిథియం అయాన్ బ్యాటరీతో కూడిన ఈ ఆటో ఒకసారి చార్జింగ్‌తో 179 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. కేవలం 2.15 గంటల్లోనే 80 శాతం బ్యాటరీ చార్జింగ్ కావటం దీని ప్రత్యేకత అని టీవీఎస్ తెలిపింది. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో ఈ ఆటో ప్రయాణిస్తుంది. 'టీవీఎస్ స్మార్ట్‌ఎక్స్‌కనెక్ట్' ఫీచర్లను ఈ ఆటోకు జోడించినట్లు కంపెనీ తెలిపింది.

## కేంద్రం కొత్త పెన్షన్ స్కీమ్..



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రభుత్వ ఉద్యోగుల కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవలే కొత్త పెన్షన్ పథకం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. పాత పెన్షన్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలనే డిమాండ్లు పెరిగిన క్రమంలో అదనపు బెనిఫిట్స్ కల్పిస్తూ ఈ కొత్త యూపీఎస్ పెన్షన్ స్కీమ్ తెచ్చింది. ఇందులో చేరిన ప్రభుత్వం ఉద్యోగులు తమ పదవీ విరమణ తర్వాత ఎంత పింఛన్ వస్తుంది అనేది ముందుగానే తెలుసుకోవచ్చు. అందుకు సంబంధించిన వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం కల్పించింది. కొత్తగా యూపీఎస్ పెన్షన్ కాలిక్యులేటర్ అందుబాటులోకి తీసుకొచ్చింది. యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ద్వారా నెల నెలా ఎంత పెన్షన్ వస్తుంది అనేది ఈ కాలిక్యులేటర్ ద్వారా తెలుసుకోవచ్చని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన చేసింది. ఈ కాలిక్యులేటర్ ద్వారా యూపీఎస్‌తో పాటు నేషనల్ పెన్షన్ సిస్టమ్ లోనూ ఎంత పెన్షన్ వస్తుంది అని తెలుసుకోవచ్చని పేర్కొంది. దేనిని ఎంచుకోవాలనే అయోమయంలో ఉన్న ఉద్యోగులకు ఇది ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంది. తమకు ఏ పథకం ద్వారా ఎక్కువ లబ్ధి చేకూరుతుందో ముందుగానే నిర్ణయించుకుని ఎంచుకోవచ్చని తెలిపింది. యూపీఎస్ కాలిక్యులేటర్ కోసం ఈ లింకుపై క్లిక్ చేయండి %https://npstrust.org.in/ups-calculator%కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఏకీకృత పింఛన్ పథకం తీసుకువచ్చారు. 2004 తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన వారికి ప్రస్తుతం నేషనల్ పెన్షన్ స్కీమ్ అమలులో ఉంది. అయితే, ఎన్‌పీఎస్‌లో చాలా తక్కువ పింఛన్ వస్తుందని, తమకు కూడా 2004కు ముందు ఉద్యోగులకు అమలవుతోన్న పాత పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే అదనపు బెనిఫిట్స్ జోడిస్తూ యూపీఎస్ తీసుకొచ్చింది కేంద్రం. పదవీ విరమణకు ముందు 12 నెలల్లో సగటు మూల వేతనం ఎంత ఉందో దానిలో 50 శాతాన్ని ఈ పథకం ద్వారా పింఛనుగా అందిస్తారు.ప్రస్తుతం జాతీయ పింఛన్ పథకంలో ఉన్న వారికి యూపీఎస్‌లోకి మారేందుకు అవకాశం ఇచ్చారు. ఇందుకు మూడు నెలల గడువు పెట్టారు. ఈ క్రమంలో తమకు ఏది మేలు, ఏది ఎంచుకోవాలనే దానిపై స్పష్టత తెచ్చుకునేందుకు ఉద్యోగులు యూపీఎస్ కాలిక్యులేటర్ ఉపయోగించుకోవచ్చని కేంద్రం తెలిపింది. ఉద్యోగులు ఈ క్యాలిక్యులేటర్ ఉపయోగించుకుని తమకు ఎందులో ఎంత పెన్షన్ వస్తుంది? ఎంత కంట్రిబ్యూట్ చేయాలి? ఏ పథకంలో కొనసాగడం ద్వారా మేలు జరుగుతుందనేది నిర్ణయించుకోవచ్చు.

## హైదరాబాద్‌లో ఐటీసీ వెల్‌కమ్ హొటల్

**హైదరాబాద్ -నవభూమి:**ఐటీసీ హొటల్స్ హైదరాబాద్‌లో తన వ్యాపారాన్ని మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా శంకర్‌పల్లిలో 155 రూమ్స్‌తో ఐటీసీ వెల్‌కమ్ హొటల్‌ను ప్రారంభిస్తోంది. ఇందుకోసం కేపీసీ పామ్ ఎగ్జోటికా హొటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. దాదాపు 11 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ హొటల్‌లో ఆల్ డే డైనింగ్, ప్రత్యేక రెస్టారెంట్, బార్, స్విమ్మింగ్ పూల్, లాంజ్, స్పా, కిడ్స్ క్లబ్ వంటి అత్యాధునిక సదుపాయాలు ఉంటాయని తెలిపింది. ఐటీసీ హొటల్స్‌కు ఇప్పటికే హైదరాబాద్‌లో ఐటీసీ కాకతీయ, ఐటీసీ కోహినూర్ పేరుతో రెండు సొంత హొటల్స్ ఉన్నాయి.

## ఆ క్రెడిట్ కార్డు యూజర్లకు షాక్.. బెనిఫిట్స్ తొలగింపు.. ఇక లాంజ్ యాక్సెస్ ఉండదు!




**న్యూఢిల్లీ-నవభూమి:**ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు వినియోగదారులకు షాక్ తగిలింది. కీలక బెనిఫిట్స్ తొలగించారు. ఇకపై ఈ కార్డుపై లాంజ్ యాక్సెస్ ప్రయోజనాలు లభించవు. వచ్చే నెల జూన్ 20 నుంచే ఈ సదుపాయాలను నిలిపివేస్తున్నట్లు యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం.

రివార్డ్స్, లాంజ్ యాక్సెస్ వంటి చాలా రకాల బెనిఫిట్స్ క్రెడిట్ కార్డు ద్వారా వస్తుంటాయి. దీంతో చాలా మంది క్రెడిట్ కార్డు తీసుకుంటుంటారు. అయితే, ఇటీవల చాలా బ్యాంకులు ప్రయోజనాలు తగ్గించేస్తున్నాయి. తాజాగా యాక్సిస్ బ్యాంక్ సైతం తమ క్రెడిట్ కార్డు యూజర్లకు సడెన్ షాకిచ్చింది. ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంక్ కార్డు యూజర్లకు ఊహించని షాక్ తగిలింది. ఈ కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డు ద్వారా అందిస్తోన్న లాంజ్ యాక్సెస్ సదుపాయాన్ని తొలగిస్తున్నట్లు యాక్సిస్ బ్యాంక్ తెలిపింది. ఈ కొత్త నిబంధనలు జూన్ 20, 2025 నుంచే అమలులోకి తీసుకొస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఈ కార్డు వినియోగదారులకు సమాచారం అందిస్తోంది.మరోవైపు.. మింత్రాపై ఇస్తున్న క్యాష్ బ్యాక్ పెంచి ఊరట కల్పించింది. గతంలో మింత్రాలో చేసే కొనుగోళ్లపై 1 శాతంగా ఉన్న క్యాష్ బ్యాక్‌ను 7.5 శాతానికి పెంచింది. స్టేట్‌మెంట్ త్రైమాసికంలో గరిష్ఠ పరిమితిని రూ. 4 వేలుగా నిర్ణయించింది. ఫ్లిప్‌కార్ట్, క్లియర్‌ట్రిప్‌పై కొనుగోళ్లకు 5 శాతం క్యాష్ బ్యాక్ లభిస్తుంది. ఒక త్రైమాసికంలో వీటిపైనా గరిష్ఠగా రూ. 4 వేల వరకు క్యాష్ బ్యాక్ లభిస్తుంది. వీటితో పాటు స్విగ్గీ, పీవీఆర్, కల్ట్ ఫిట్, ఉబర్ ట్రాన్సాక్షన్లపై 4 శాతం మేర క్యాష్ బ్యాక్ లభిస్తుంది. ఇతర కొనుగోళ్లపై 1 శాతం మేర క్యాష్ బ్యాక్ ఇస్తున్నారు. ఈజీడైనర్‌పై 15 శాతం వరకు (రూ. 100) క్యాష్ బ్యాక్ వస్తుంది. రూ. 400 పై బడి చేసే చమురు కొనుగోళ్లపై 1 శాతం ఫ్యూయల్ సర్ ఛార్జి రద్దు వర్తిస్తుంది.కో బ్రాండ్ క్రెడిట్ కార్డుల్లో అమెజాన్ ఐసీఐసీఐ, ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డులు చాలా పాపులప్ అని చెప్పవచ్చు. ఆయా ఇ-కామర్స్‌లో ఎక్కువగా షాపింగ్ చేసే వాళ్ల వీటిని ఎంచుకుంటూ ఉంటారు. అమెజాన్ ఐసీఐసీఐ కార్డుకు ఎలాంటి జాయినింగ్ ఫీజు ఉండదు. ఫ్లిప్‌కార్ట్ యాక్సిస్ కార్డుకు తీసుకునేందుకు రూ. 500 జాయినింగ్ ఫీ చెల్లించాల్సి ఉంటుంది. రెండో ఏడాది నుంచి రూ. 500 చొప్పున రెన్యువల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదిలో రూ. 3.50 లక్షల పైబడి కనుగోళ్లు జరిపినట్లయితే రెన్యువల్ ఫీజును రద్దు చేస్తారు.యాక్సిస్ బ్యాంక్ ఫ్లిప్‌కార్ట్ కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్ కొత్త రూల్స్ జూన్ 20 నుంచి అమలులోకి వస్తున్నాయి. ఈ కార్డు వినియోగిస్తున్న వారు పూర్తి వివరాలు తెలుసుకునేందుకు యాక్సిస్ బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్ సందర్శించవచ్చు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్ గురువారం 22 । మే । 2025

## అశోక వర్సిటీ ప్రొఫెసర్‌కు ఊరట.. బెయిల్ మంజూరు చేసిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ–నవభూమి:** అశోక విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్మూదాబాద్ కు స్వల్ప ఊరట లభించింది. ఆపరేషన్ సిందూర్ (కు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారన్న కారణంతో అరెస్టైన ఆయనకు సుప్రీంకోర్టు తాజాగా మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఈ కేసు దర్యాప్తును నిలిపివేయడానికి అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారన్న కారణంతో హరియాణాలోని అశోక యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్ మహ్మూదాబాద్‌ను పోలీసులు రెండు రోజుల క్రితం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆయన రాజనీతి శాస్త్రం విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అయితే, అలీ ఖాన్ సామాజిక మాధ్యమాల్లో ఇచ్చిన పోస్ట్‌లో, 'ఆపరేషన్ సిందూర్'పై కర్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమిక సింగ్ మీడియాకు వివరించడాన్ని మీడియా ఆర్భాటంగా వర్ణించారు. ఆయనపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. హర్యానా రాష్ట్ర మహిళా కమీషన్ కూడా ఆ ప్రొఫెసర్‌కు నోటీసులు ఇచ్చింది. రెండు రోజుల క్రితం అలీ ఖాన్‌ను పోలీసులు ఢిల్లీలో అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో అతను తన అరెస్టును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ పిటిషన్ విచారణ జరిపిన న్యాయస్థానం ఆయనకు ఊరట కల్పించింది.

## భారీగా పెరిగిన ఆసియా సింహాల సంతతి.. ప్రకటించిన గుజరాత్ సీఎం



**న్యూఢిల్లీ–నవభూమి:** గుజరాత్‌లో ఆసియా సింహాల సంతతి భారీగా పెరిగింది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ బుధవారం ప్రకటించారు. ఈ మేరకు సింహాల జనాభాపై నిర్వహించిన 2025 గణాంకాలను విడుదల చేశారు. ఐదేళ్ల క్రితం 674గా ఉన్న సింహాల సంఖ్య ఈ ఏడాది ఇప్పటి వరకూ 891కి పెరిగినట్లు చెప్పారు. మీడియాతో బుధవారం సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆసియా సింహాల సంఖ్య 891కి పెరిగింది అని ప్రకటించారు. జూన్ 2020లో ఆ సంఖ్య 674గా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 11 జిల్లాల్లో ఈ సింహాలు జీవిస్తున్నట్లు చెప్పారు. జునాగఢ్, గిర్ సోమనాథ్, భావ్‌నగర్, రాజ్‌కోట్, మోర్బి, సురేంద్రనగర్, దేవభూమి ద్వారక, జామ్‌నగర్, అమ్రేలి, పోర్ బందర్, బోటాడ్‌లో ఈ సింహాలు విస్తరించినట్లు సీఎం చెప్పారు. మే 10– 11 తేదీల్లో సింహాల ప్రాథమిక జనాభా గణన నిర్వహించగా, తుది జనాభా గణనను మే 12–13 తేదీల్లో ప్రాంతీయ, జోనల్, సబ్–జోనల్ అధికారులు, ఎన్యూమరేటర్లు, అసిస్టెంట్ ఎన్యూమరేటర్లు, ఇన్‌స్పెక్టర్లు సహా 3,000 మంది స్వచ్ఛంద సేవకుల సహాయంతో నిర్వహించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అటవీ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలతో గిర్ అడవుల్లోని సింహాల సంఖ్య పెరుగుతోందని ఆయన తెలిపారు.

## ఈ బాలిక స్ఫూర్తికి సలాం.. శ్రావ్యంగా శివ తాండవ స్త్రోత్రం



**న్యూఢిల్లీ–నవభూమి:** ప్రాణాలను పణంగా పొట్టి దేశ రక్షణ కోసం పోరాడిన భారత సైనికులకు మద్దతు తెలుపుతూ దేశవ్యాప్తంగా తిరంగా యాత్రలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. తాజాగా జోధ్‌పూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఓ చిన్నారి ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంటోంది ఆ వీడియోలో ఓ చిన్నారి స్కూల్ యూనిఫామ్ ధరించి శివ తాండవ స్తోత్రాన్ని భావోద్వేగపూరి తంగా చెప్పి అందరిలో స్ఫూర్తి నింపింది. పురాతన సంస్కృత శ్లోకం, శివ తాండవ స్తోత్రాన్ని పూర్తి స్పష్టతతో పఠించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ఆ బాలిక స్తోత్ర పఠనాన్ని చూసి అక్కడున్న వారందరూ చప్పట్లు, ఈలలతో అభినందించారు. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో జనాలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆ పాప తన ప్రతిభను ప్రదర్శించింది. ఆ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అది కాస్తా వైరల్‌గా మారింది. ఈ వైరల్ వీడియోను ఇప్పటివరకు దాదాపు 1.4 కోట్ల మంది వీక్షించారు. 22 లక్షల మంది ఆ వీడియోను లైక్ చేశారు. ఆ వీడియోపై నెటిజన్లు తమ స్పందనలను తెలియజేశారు. ఆమె నూతన భారతదేశ కుమార్తె, ఎలా సమాధానం చెప్పాలో ఆమెకు తెలుసని ఒకరు కామెంట్ చేశారు. ఆమె ఇస్తున్న సందేశం బిగ్గరగా, స్పష్టంగా ఉంది. ఆమె భవిష్యత్తు ఫ్లయింగ్ ఆఫీసర్ అని మరొకరు పేర్కొన్నారు.

## యుద్ధం అంటే యుద్ధమే.. చిన్నా పెద్దా ఏమిటి?.. ఖర్గేకు కూటమి నేత కౌంటర్



**ముంబై–నవభూమి:** పాకిస్థాన్‌పై ఇండియా మిలటరీ చర్యను 'చిన్న యుద్ధం' అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలపై 'ఇండియా' కూటమి భాగస్వామ్య పార్టీ ఎన్‌సీపీ (ఎస్‌పీ) నుంచి ప్రతిఘటన ఎదురైంది. ఉగ్రవాదంపై పోరు విషయానికి వచ్చేసరికి యుద్ధం పెద్దదా చిన్నాదా అనేది ఉండదని ఆ పార్టీ నేత, లోక్‌సభ ఎంపీ సుప్రియా సూలే (%ాబజూతీఱఖ్ఝ ాబశ్రీవ%) వ్యాఖ్యానించారు. "యుద్ధం అంటే యుద్ధమే, అతి పెద్దది కావచ్చు చిన్నది కావచ్చు. ఈ యుద్ధం ఉగ్రవాదంపై జరిపిన యుద్ధం. ఈ అంశాన్ని రాజకీయం చేయకూడదని, ఇలాంటి సున్నితమైన అంశంపై ఒకరినొకరు విమర్శించుకోరాదని అఖిల పక్ష సమావేశంలో మేము సమష్టిగా నిర్ణయం తీసుకున్నాం" అని ఆమె తెలిపారు.
పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులను కాల్చిచంపినందుకు ప్రతిగా భారత సాయుధ దళాలు ఆపరేషన్ సింధూర్‌ను చేపట్టడం ఒక భారతీయురాలిగా గర్వస్తున్నానని సుప్రియా సూలే ప్రశంసించారు. "ఆపరేషన్ సింధూర్‌కు కేవలం 100కి 100 మార్కులు ఇవ్వడం లేదు, 100కి 1000 మార్కులు ఇస్తున్నాను. మన సాయుధ బలగాలు ఈ ప్రశంసకు పరిపూర్ణంగా అర్హులు" అని అన్నారు.
**ఖర్గేపై మండిపడిన కర్ణాటక బీజేపీ:** దీనికి ముందు, ఖర్గే వ్యాఖ్యలను కర్ణాటక బీజేపీ తప్పుపట్టింది. బాధ్యతలులేని వ్యాఖ్యలు చేశారని, మన సాయిధ బలగాల ధైర్యసాహసాలను కించపరచారని విమర్శించింది. మన సైనికుల త్యాగాలను తక్కువ చేసి మాట్లాడటం తగదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర అన్నారు. ఇండియాను ఎప్పుడూ చిక్కుల్లో పెట్టాలని పాక్ అనుకుంటుందని, వాళ్లు బలహీనులు కావడంతో చైనా మద్దతుతో మనపై దాడి చేసే ప్రయత్నం చేశారని అన్నారు. ఇలాంటి చర్యలను మనదేశం సహించి ఊరుకోదని, ప్రజలంతా ఐక్యంగా ఉన్నారని చెప్పారు.

## రాష్ట్రంలో.. కరోనా వ్యాప్తి లేదు..

**చెన్నై–నవభూమి:** రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తి లేదని, ప్రజలు భయాందోళనలకు చెందొద్దని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుడు సెల్వ వినాయగం పేర్కొన్నారు. 2022 తర్వాత ప్రభుత్వ చర్యల ఫలితంగా రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టామన్నారు. ప్రస్తుతం కరోనా వైరస్ వ్యాప్తి చాలా తక్కువగా ఉందన్నారు. ఒక వేళ ఎవరైనా వైరస్ బారినపడితే వారిలో కూడా పెద్దగా ఈ లక్షణాలు కనిపించడం లేదన్నారు. పైగా దేశంలో ఈ యేడాది కరోనా వైరస్ బారినపడి ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోలేదన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన నివేదికలో కూడా దక్షిణాసియా దేశాలైన భారత్, నేపాల్, బంగ్లాదేశ్, ఇండోనేషియా, థాయిలాండ్ తదితర దేశాల్లో కరోనా వ్యాప్తి అతి తక్కువగా ఉన్నట్టు పేర్కొంది. వియత్నాం, సింగపూర్, ఫిలిప్పీన్స్ వంటి దేశాల్లో ఈ వైరస్ వ్యాప్తి తగ్గినట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపిందన్నారు.
ప్రపంచ వ్యాప్తంగా ఈ వైరస్ వ్యాప్తి చాలా తక్కువగానే ఉందన్నారు. అదేసమయంలో మన రాష్ట్రంలో కూడా ఈ వైరస్ వ్యాప్తి గణనీయంగా తక్కువగా ఉందని, అందువల్ల ప్రజలు భయాందోళనకు గురికావాల్సిన

# ఆపరేషన్ సిందూర్‌పై అఖిలపక్ష బృందం విదేశీ పర్యటనలు



**న్యూఢిల్లీ–నవభూమి:** ఆపరేషన్ సిందూర్ గురించి ప్రపంచ దేశాలకు తెలియజేసేందుకు భారత్ దౌత్య పరంగా కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. పాకిస్తాన్‌కు ఉగ్రవాదానికి ఉన్న సంబంధాలను అంతర్జాతీయంగా బహిర్గతం చేసేందుకు.. దేశంలోని పలు రాజకీయ పార్టీల నుంచి నేతలను తీసుకుని వారితో 7 అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. మొత్తంగా 7 భారతీయ దౌత్య బృందాల్లో రెండు టీమ్‌లు ఇవాళ విదేశాలకు పయనం అయ్యాయి. ఈ రెండు దౌత్య బృందాలు జపాన్, యూఏఈలో పర్యటించనున్నాయి. ఈ టీమ్‌లకు జేడీయూ ఎంపీ సంజయ్ ఝా, శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే నేతృత్వం వహించనున్నారు. జేడీయూ ఎంపీ సంజయ్ ఝా నేతృత్వంలోని బృందం ఇండోనేషియా, మలేషియా, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, జపాన్, సింగపూర్ దేశాల్లో పర్యటించనుంది. ఈ బృందంలో బీజేపీ ఎంపీలు అపరాజిత సారంగి, బ్రిజ్ లాల్, హేమాంగ్ జోషి, ప్రదాన్ బారువా.. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన అభిషేక్ బెనర్జీ.. సీపీఎంకు చెందిన జాన్ బ్రిట్టాస్, మాజీ విదేశాంగ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్.. మాజీ దౌత్యవేత్త మోహన్ కుమార్ ఉన్నారు. శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే నేతృత్వంలోని మరో బృందం యూఏఈ, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సియెర్రా లియోన్, లైబీరియా దేశాల్లో పర్యటించనుంది. ఈ బృందంలో బీజేపీ ఎంపీలు బన్సూరీ స్వరాజ్, అతుల్ గార్గ్, మన్నన్ కుమార్ మిశ్రా, మాజీ ఎంపీ ఎస్.ఎస్. అహ్లువాలియా, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎంపీ ఇ.టి. మహమ్మద్ బషీర్, బీజేడీ ఎంపీ సస్మిత్ పాత్ర, మాజీ దౌత్యవేత్త సుజన్ చినోయ్ ఉన్నారు. ఉగ్రవాదం పాకిస్తాన్ ప్రభుత్వ విధానమని జేడీయూ ఎంపీ సంజయ్ ఝా పేర్కొన్నారు. గత 40 ఏళ్లుగా పాక్ ఉగ్రవాద విధానాల వల్ల బాధపడుతున్నట్లు చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ఇప్పుడు పాకిస్తాన్ ఉగ్రకుట్రలను బయటపెడుతుందని తెలిపారు. ఈ దౌత్యపరమైన పర్యటన మరో లక్ష్యం పాకిస్తాన్ చేస్తున్న అణ్వస్త్ర బెదిరింపులను ఖండించడమేనని తేల్చి చెప్పారు. అలాగే సింధు జలాల ఒప్పందం రెండు దేశాల మధ్య స్నేహపూర్వక సహకారంపై ఆధారపడి ఉందని.. అయితే స్నేహం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ప్రపంచంలో ఎక్కడ ఉగ్రవాద చర్య జరిగినా దానికి పాకిస్తాన్‌తో సంబంధం ముడిపడి ఉంటుందని పేర్కొన్నారు. ఒసామా బిన్ లాడెన్ ఎక్కడా దొరకలేదని.. చివరికి పాకిస్తాన్‌లోనే అమెరికా దొరికబట్టిందని తెలిపారు. పాకిస్తాన్ ఉగ్రవాదంపై ఆధారపడి జీవిస్తోందని.. దీన్ని మనం బయటపెట్టాలని ఆయన స్పష్టం చేశారు. భారత పార్లమెంటుపై దాడి ఘటన దగ్గరి నుంచి 26/11 ముంబై దాడుల వరకు పాకిస్తాన్ 30 ఏళ్ల 'టెర్రర్ రికార్డు'ను అంతర్జాతీయ సమాజం ముందు బహిర్గతం చేయాలని దౌత్య బృందాలకు బాధ్యత అప్పగించినట్లు బీజేపీ ఎంపీ బ్రిజ్ లాల్ తెలిపారు. మొదట సర్జికల్ స్ట్రైక్స్ చేశామని.. అయితే అది వారికి అర్థం కాలేదని.. ఆ తర్వాత బాలాకోట్ చేశామని పేర్కొన్నారు. ఇప్పుడు పాకిస్తాన్ ద్రవ్యోల్బణం, ఆకలితో పోరాడుతోందని.. బలూచిస్తాన్ కూడా వారి నియంత్రణ నుంచి జారిపోతోందని వెల్లడించారు. వారి ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ దృష్టి మరల్చడానికి 26 మంది అమాయకులను వారి మతాన్ని అడిగి హత్య చేయమని ఆదేశించారని బ్రిజ్ లాల్ ఆరోపించారు. దేశంలోని పలు పార్టీలకు చెందిన ఎంపీలు, మాజీ ఎంపీలతో కూడిన ఈ 7 దౌత్య బృందాల్లో మూడింటికి విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ మంగళవారం పలు అంశాలు చెప్పారు. అదే సమయంలో ఆ 33 దేశాలను ఎందుకు ఎంచుకున్నారు అనేది కూడా వెల్లడించారు. ఈ విషయాన్ని బీజేపీ ఎంపీ అపరాజితా సారంగి తెలిపారు. భారత దౌత్య బృందాలు పర్యటించే ఆ 33 దేశాల్లో 15 దేశాలు ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో సభ్యదేశాలు (5 శాశ్వత, 10 తాత్కాలిక సభ్యదేశాలు) అని వెల్లడించారు. మిగిలినవి భవిష్యత్తులో భద్రతా మండలిలో చేరబోయే దేశాలని చెప్పారు. వీటితోపాటు అంతర్జాతీయ అంశాలపై

# పూజా ఖేడ్కర్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట



**న్యూఢిల్లీ–నవభూమి:** వివాదాస్పద మాజీ ఐఏఎస్ ట్రెయినీ అధికారిణి పూజా ఖేడ్కర్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆమెకు సర్వోన్నత న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. నకిలీ దివ్యాంగ సరిఫికెట్, కులధ్రువీకరణ పత్రాలతో యూపీఎస్సీ సివిల్స్‌లో పూజా ఖేడ్కర్ విజయం సాధించినట్టు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమెపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదుచేయడంతో పూజా.. ముందస్తు బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం.. దర్యాప్తులో భాగంగా ఆమెను అరెస్ట్ చేస్తే, రూ. 35,000 నగదు పూచీకత్తుతో బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించింది. అయితే, దర్యాప్తులో జోక్యం చేయరాదని, సాక్షులను ప్రభావితం చేయరాదని, ఆధారాలను తారుమారు చేయరాదని ఆమెకకు హెచ్చరికలు జారీ చేశాయి. నవంబరు 2024లో ఢిల్లీ హైకోర్టు ఆమెకు బెయిల్ నిరాకరించడంపై కూడా సుప్రీంకోర్టు పలు ప్రశ్నలు సంధించింది. హైకోర్టు అప్పట్లో పూజా ఖేడ్కర్ చర్యలు ప్రాథమికంగా మోసానికి తావివ్వడమేనని, అవి 'పెద్ద కుట్ర'లో భాగమని పేర్కొంది. అయితే, తాజాగా సుప్రీంకోర్టు, పూజా ఖేడ్కర్ దర్యాప్తు అధికారులకు సహకరించలేదన్న హైకోర్టు అభిప్రాయాన్ని తోసిపుచ్చింది. "సహకరించలేదంటే ఏమిటి?" అని న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న ప్రశ్నించారు. 'ఆమె హత్య చేయలేదుగా ఇది (నార్కోటిక్స్ చట్టానికి సంబంధించిన) కేసు కాదు. ఆమె సహకరిస్తుంది'" అని వ్యాఖ్యానించారు. హైకోర్టు తీర్పుపై గతంలోనూ సుప్రీంకోర్టు ప్రశ్నలు వేసింది 2025 జనవరిలో 'ఈ కేసు స్వభావాన్ని, పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే, ముందస్తు బెయిల్ మంజూరు చేయడానికి అన్ని అర్హతలు ఉన్నాయి' అని పేర్కొంది. ఇక,, పూజా తల్లి మనోరమపై కూడా రైతులను బెదిరించారనే ఆరోపణలతో అరెస్టైన సంగతి తెలిసిందే. జనవరిలో అమెకు అరెస్టు నుంచి సుప్రీంకోర్టు తాత్కాలిక రక్షణ కొనసాగుతూనే ఉంది. మార్చి 18న జరిగిన చివరి విచారణలో కూడా ఆదేశాలను పొడిగించారు. ఈ అంశంపై విచారణ చేపట్టిన జస్టిస్ బీవీనాగరత్న, జస్టిస్ ఎస్పీ శర్మల ధర్మాసనం.. విచారణకు సహకరిస్తానని పూజా ఖేడ్కర్ అఫిడవిట్ దాఖలు చేసిందని గుర్తు చేశారు. పూజా ఖేడ్కర్ వెనుకబడిన తరగతులు (%ాదీజ%), శారీరక వైకల్యంతో ఉన్న వారికి ప్రత్యేకంగా కల్పించిన రిజర్వేషన్ హక్కులను పొందేందుకు తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, పూజా ఖేడ్కర్ వ్యవహారం గతేడాది దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. యూపీఎస్సీ కూడా ఆమె పరీక్షలు రాయకుండా అనర్హత వేసింది. తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి ఐఏఎస్ ఉద్యోగం, ఎంబీబీఎస్ అడ్మిషన్ పొందినట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆమెపై కేంద్రం కఠిన చర్యలు తీసుకుంది. ఆమెకు శిక్షణను రద్దుచేసింది. మహారాష్ట్రలో ప్రొబేషనరీ పీరియడ్‌లోనే ఐఏఎస్‌కు కల్పించే హోదా, అధికారాలు, సౌకర్యాలు కల్పించాలని.. కిందిస్థాయి అధికారులపై ఒత్తిడి తెచ్చిన విషయం బయటికి రావడంతో ఆమె బాగోతాలు ఒక్కొక్కటిగా బయటకు వచ్చాయి

# బెంగళూరులో దారుణం



**న్యూఢిల్లీ–నవభూమి:** మెట్రో వచ్చాక నగరాల్లో ప్రయాణం చాలా సౌకర్యవంతం అయ్యిందని చెప్పవచ్చు. ట్రాఫిక్ బాధలు లేకుండా.. త్వరగా గమ్యస్థానాలకు చేరవచ్చు. పైగా భద్రత విషయంలో ఎలాంటి అనుమానం ఉండదు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని చాలా మంది మెట్రోకే ఓటేస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో మెట్రోలో ప్రయాణించే వారి సంఖ్య భారీగా ఉంటుంది. నగర శివారు ప్రాంతాల్లో ఉద్యోగం చేసే మహిళలకు మెట్రో ఒక వరం అని చెప్పవచ్చు. ఎలాంటి భయం లేకుండా.. సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవచ్చు అనే ధైర్యం. కానీ ఇప్పుడు చెప్పబోయే సంఘటన వింటే.. వామ్మో మెట్రో కూడా సేఫ్ కాదు అనిపిస్తుంది. ఇంతకు ఏం జరిగిందంటే.. ఓ ప్రబుద్ధుడు మెట్రోలో ప్రయాణించే మహిళలకు తెలియకుండానే వారి ఫొటోలు తీసి.. వాటిని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తున్నాడు. విషయం కాస్త వెలుగులోకి రావడంతో ఇది సంచలనంగా మారింది. ఆ వివరాలు.. ఈ సంఘటన బెంగళూరులో చోటు చేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తి ఒకరు.. మెట్రోలో ప్రయాణం చేసే మహిళల అనుమతి లేకుండానే వారిని ఫొటోలు తీయడమే కాక.. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ విషయం కాస్త వెలుగులోకి రావడంతో.. అతడిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఒక ఇన్‌స్టా అకౌంట్ నుంచి మెట్రోలో ప్రయాణం చేస్తున్న కొందరు మహిళల ఫొటోలను పోస్ట్ చేశాడు. దీనిపై పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం అయ్యింది. ఆ ఇన్‌స్టా పేజ్ పేరు బెంగళూరు మెట్రో చీక్స్ అని ఉండగా సుమారు 5 వేల మంది ఈపేజ్‌ని ఫాలో అవుతున్నారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో.. వెంటనే స్పందించిన పోలీసులు సదరు వ్యక్తి మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయడమే కాక.. ఆ వ్యక్తి ఇన్‌స్టా పేజ్‌లో ఉన్న ఫొటోలను డిలీట్ చేశారు. ఎక్స్ యూజర్ ఒకరు ఈ ఇన్‌స్టా పేజ్‌ను గుర్తించాడు. వెంటనే దీనిపై స్పందించి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ.. బెంగళూరు పోలీసులను ట్యాగ్ చేయడంతో.. ఇది వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేసిన ఫొటోల గురించి సదరు మహిళలు, యువతులకు ఏం తెలియదు. వారికి తెలియకుండానే ఈ ఫొటోలు తీశారు. వారి అనుమతి లేకుండానే వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. దీని గురించి వారికి ఏమాత్రం అవగాహన లేదన్నారు. అంతేకాక మెట్రో రైల్లో ఎవరైనా మొబైల్ చేతిలో పట్టకుని అనుమానాస్పదంగా కనిపిస్తే.. వెంటనే వారిని ప్రశ్నించాలని.. తప్పు చేశారని గుర్తిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నగరాలతో పని లేకుండా మెట్రోలో ప్రయాణించే మహిళలు, యువతులంతా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## ఇంగ్లీష్‌లోనే మాట్లాడతానన్న ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్.. కస్టమర్లతో ఇలాగేనా అంటూ నెటిజన్లు ఫైర్



**బెంగళూరు–నవభూమి:** కర్ణాటకలోని బెంగళూరు శివార్లలో ఉన్న సూర్యనగర ఎస్‌బీఐ శాఖలో చోటుచేసుకున్న భాషా వివాదం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా ఓ కస్టమర్ ఆ బ్రాంచ్ మేనేజర్‌ను కన్నడలో మాట్లాడాలని కోరగా.. ఆమె అందుకు అంగీకరించలేదు. తాను కన్నడలో కానీ హిందీలో కానీ అస్సలే మాట్లాడనని చెబుతూ.. కేవలం ఇంగ్లీషులోనే సమాధానం ఇచ్చారు. ఇలా ఈ ఇద్దరి మధ్య గొడవ జరగ్గా ఈ వీడియో కాస్తా నెట్టింట వైరల్ అయింది. దీంతో అనేక మంది మేనేజర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎస్‌బీఐ.. సదరు మేనేజర్‌ను బదిలీ చేసింది. అయితే తాజాగా ఈ ఘటనపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. స్థానిక భాషలను గౌరవించాలని చెబుతూనే.. బ్యాంకు ఉద్యోగులు ఆయా భాషల్లో మాట్లాడేందుకు ప్రయత్నించాలని పేర్కొన్నారు. బెంగళూరులోని సూర్యనగరలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ కస్టమర్‌తో గొడవ పడ్డారు. ముఖ్యంగా కన్నడ భాషలో మాట్లాడాలని కస్టమర్ కోరగా.. ఆమె అందుకు అంగీకరించలేదు. తాను ఇంగ్లీషులోనే మాట్లాడతానని హిందీ, కన్నడలో చర్చించనని తేల్చి చెప్పింది. ఏం చేసుకుంటావో చేసుకోపో అంటూ వ్యాఖ్యానించింది. ఇది కర్ణాటక కాబట్టి కన్నడనే మాట్లాడాలని కస్టమర్ చెప్పగా.. ఇది ఇండియా నాకు నచ్చిన భాషలో మాట్లాడతానంటూ మేనేజర్ దురుసుగా సమాధానం చెప్పారు. ఇలా వీరిద్దరి మధ్య తీవ్ర వివాదం సాగగా.. అక్కడే ఉన్న కొందరు దీన్ని వీడియోగా తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతుండగా.. అంతా సదరు మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగులు అన్ని ప్రాంతాల్లో కస్టమర్లతో ఇలాగే వ్యవహరిస్తారంటూ పేర్కొనగా.. స్పందించిన ఎస్‌బీఐ అధికారినిని బదిలీ చేసింది. కానీ ఆమె చేసిన వ్యాఖ్యలు, కస్టమర్‌తో మాట్లాడిన విధానం చూసి.. కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో భాషా సంఘాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కన్నడ భాషపై బ్యాంక్ మేనేజర్ తీరును వ్యతిరేకిస్తూ.. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నట్లు కర్ణాటక రక్షణ వేదికే సంఘం ప్రకటించింది. ఎస్‌బీఐ ఉద్యోగులు కస్టమర్లను పదే పేద అవమానిస్తున్నారని.. స్థానిక భాషలోనే ప్రాథమిక సేవలను అందించడంలో విఫలం అవుతున్నారని ఆరోపించింది. అయితే తాజాగా ఈ వివాదంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. బ్యాంక్ మేనేజర్ పౌరులతో ప్రవర్తించిన తీరు సైరనది కాదని చెప్పారు. అలాగే స్థానిక భాషను బ్యాంకు ఉద్యోగులు అందరూ గౌరవించాలని.. కస్టమర్లను గౌరవిస్తూ స్థానిక భాషలోనే మాట్లాడే ప్రయత్నం చేయాలన్నారు. అలాగే సూర్య నగరలో కన్నడ మాట్లాడడానికి నిరాకరించిన ఎస్‌బీఐ మేనేజర్‌ను ఆ సంస్థ బదిలీ చేసిందని తెలిపారు.

## వేలూరులో టీవీకే రెండో బూత్ కమిటీ మహానాడు



**చెన్నై–నవభూమి:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా హీరో విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగం అడుగులు వేస్తోంది. వివిధ రకాలైన కార్యక్రమాలను చేపడుతోంది. ఇటీవల ఆ పార్టీ బూత్ కమిటీ మహానాడును నిర్వహించింది. ఇప్పుడు రెండో మహానాడును వేలూరులో నిర్వహించాలని భావిస్తోంది. ఇందులో వేలూరు, రాణిపేట, తిరుణ్ణామలై, తిరుపత్తూరు, కడలూరు, కృష్ణగిరితో పాటు మొత్తం 20 జిల్లాల బూత్ కమిటీ సభ్యులు పాల్గొనేలా సన్నాహాలు చేస్తున్నారు. రెండు రోజుల పాటు సాగే ఈ మహానాడులో ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే, వేలూరు పట్టణంలో రోడ్ షో కూడా నిర్వహించనున్నట్టు సమాచారం. అయితే, మహానాడు జరిగే తేదీలను త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. ఆ తర్వాత పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, ఇతర నిర్వాహకులు ఈ మహానాడు ఏర్పాట్లు పనులు ప్రారంభించనున్నారు.

## నేరస్తులను పట్టుకునేందుకు కొత్త టెక్నాలజీ

### కోనసీమలో శాంతి భద్రతలు బాగానే ఉన్నాయిలి . ఐ జి అశోక్ కుమార్



**అమలాపురం. మే20.( నవభూమి ప్రతినిధి)** అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం పోలీస్ స్టేషను బుధవారం సందర్శించిన ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్ అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ మలికిపురం స్టేషన్లో శాంతి భద్రత పరిస్థితులు బాగానే ఉంది ఇక్కడ దొంగతనాలు అడపా తడప జరుగుతున్నాయి కోనసీమ జిల్లాలో నేరస్థులు పట్టుకునేందుకు కొత్త టెక్నాలజీని ఉపయోగిస్తున్నాం ఈ టెక్నాలజీకి ప్రాధాన్యత ఇస్తున్నాం ఈ జిల్లాలో సీసీ కెమెరా ఇన్సులేషన్ రిమైనింగ్ మూడువేల కెమెరాలు ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేశాం ఈ సీసీ కెమెరాల ద్వారా చాలా కేసులు అదుపు చేసాము మేను మిస్సింగ్ రోడ్డు ప్రమాదాలు కేసులు కూడా అరికట్టాం శ్రీకాకుళంలో దేవాలయాల్లో దో పిడి చేసిన పెద్ద గ్యాంగ్ ను సీసీ కెమెరా ఫుటేజ్ టెక్నాలజీతో పట్టుకొని ప్రాపర్టీ రికవర్ చేసాం పెద్ద ఎత్తున ఈ టెక్నాలజీని ప్రోత్సహిస్తున్నాం దీని వలన మంచి ఫలితాలు వస్తున్నాయి లా అండ్ ఆర్డర్ అంతా బాగానే ఉంది గంజాయి కేసులు ఈ జిల్లాలో పెద్దగా లేవు పాత నేరస్తులు పై నిఘా ఉంచాం లీగల్ టీం రాజమండ్రి లో ఫామ్ చేసాం నిరంతరము సంప్రదింపులు జరిపి ఎక్కడైనా గంజాయి అమ్మితే సరఫరా చేసే వ్యక్తులు గాని ఉంటే వారిపై చర్యలు తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాం శక్తి యాప్ కొత్తగా గవర్నమెంట్ తీసుకొచ్చింది శక్తి టీం మహిళా కానిస్టేబుల్ తో ఫామ్ చేసాము ఈ శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకుని చాలామంది మహిళలు విద్యార్థులు అవసరమైతే ఎమర్జెన్సీలో కాంటాక్ట్ చేయవచ్చు ఈ శక్తి టీం ఎ ఎక్కడెక్కడ ఈవ్ టీజింగ్ జరుగుతున్నాయో కాలేజీల దగ్గర బస్టాండ్ దగ్గర కానీ టీము వారు మఫ్టీ లో వెళ్లి వారిని వాష్ చేసి ఎప్పటికప్పుడు వారు తెలియజేస్తున్నారు ముఖ్యంగా చంసేషనల్ మహిళలపై దాడులు వాటిపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు చేసి చార్జి సీట్లు వేసి వాళ్లపై శిక్షలు పడేటట్లు ఫాలో అప్ చేస్తున్నామని ఈ జిల్లాలో ఇతర ఏలూరు రేంజ్ లో ఆరు జిల్లాలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించి లా అండ్ ఆర్డర్ ప్రాబ్లం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్పీ కృష్ణారావు పాల్గొన్నారు.

## నీటిని వృథా చేస్తే కొళాయి కనెక్షన కట్: కమిషనర్

**కర్నూలు మే20.( నవభూమి ప్రతినిధి)** నగరంలో ఎవ్వరైనా తాగునీటిని వృథా చేస్తే సంబంధిత గృహ, వాణిజ్య సముదాయాలకు కొళాయి కనెక్షన కట్‌చేయాలని కార్పొరేషన కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన బాపూజీ నగర్, పాతబస్టాండ్, సి.క్యాంపు రైతుబజార్ ప్రాంతాల్లో పర్యటించారు. బాపూజీ నగర్‌లో డ్రైనేజీ కాలువలో మురుగునీరు ప్రవాహం అధికా రంగా ఉండటంతో సిల్ట్ తొలగింపునకు అవసరమైన చర్యలు తీసుకో వాలని అధికారులను ఆదేశించారు. అదే ప్రాంతంలో కొందరు తాగు నీటిని వృథా చేస్తుండటాన్ని గమనించిన కమిషనర్ స్థానిక ప్రజలకు నీటిని సక్ర మంగా వాడుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రి, కొండారెడ్డి బురుజు సమీ పంలోని అన్న క్యాంటీనలను కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట ఆరోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన సూపర్‌వైజర్ నాగ రాజు, శానిటరీ ఇన్సపెక్టర్లు వలి, అనిల్ ఉన్నారు.



## మోహన్ లాల్ బర్త్ డే స్పెషల్.. కన్నప్పపై హైప్ పెంచేస్తోన్న కిరాట

టాలీవుడ్ యాక్టర్ మంచు విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న ప్రాజెక్ట్ కన్నప్ప ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన టీజర్‌తోపాటు కీ రోల్స్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్లు విడుదల చేయగా నెట్టింట వైరల్ అవుతున్నాయి.ఈ చిత్రంలో మాలీవుడ్ స్టార్ యాక్టర్ మోహన్ లాల్ కిరాట పాత్రలో నటిస్తున్నాడు. ఇవాళ పుట్టినరోజు జరుపుకుంటున్న సందర్భంగా మోహన్ లాల్‌కు మేకర్స్ శుభాకాంక్షలు తెలియజేస్తూ స్పెషల్ వీడియో విడుదల చేశారు. మోహన్ లాల్ కిరాట అవతారంలో విల్లు చేతబట్టి తన సైన్యంతో కొండల్లో నుంచి నడుచుకుంటూ వస్తోన్న విజువల్స్ సినిమాపై క్యూరియాసిటీ అమాంతం పెంచేస్తున్నాయి. కిరాట పాత్ర సినిమాలో చాలా కీలకంగా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్.కన్నప్ప చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ మూవీని 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. కన్నప్ప మూవీకి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. ఈ చిత్రంలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, గ్లోబల్ స్టార్ ప్రభాస్, నయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్, ఐశ్వర్య ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

నవచిత్ర



## కేన్స్ 2025: 'ముత్యమల్లే' మెరిసిన జాన్వీ



వేకువ ఝామును మంచు పూలు మిలమిల మెరిసాయి. కానీ ఈ దృశ్యంలో జాన్వీ కపూర్ మంచి ముత్యమల్లే మెరుస్తోంది. మెరుపు లాంటి జాన్వీ కుర్రకారు గుండెల్లో భడభాగ్నిని రాజేస్తోంది. ఈ సుందరమైన దృశ్యం కేన్స్ 2025 ఉత్సవాల్లో కనిపించింది. మొట్టమొదటి సారి జాన్వీ కపూర్ కేన్స్ లో ఆరంగేట్రం చేసింది. కేన్స్‌లో తాను నటించిన 'హోమ్ బౌండ్' స్క్రీనింగ్ లో ఈ అద్భుతమైన లుక్‌తో కనిపించింది. జాన్వీ ఈ కొత్త రూపంతో మతులు చెడగొడుతోంది. చూడటానికి కొంచెం సింపుల్ గా ఉన్నా కానీ, ముత్యాలు బీడ్స్‌తో ఈ పొడవాటి లెహంగాను సర్వాంగ సుందరంగా డిజైనర్ మలిచారు.ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ తరుణ్ తహిలియాని దీనిని డిజైన్ చేసారు. ఈ లుక్‌లో గ్రేస్ ఉంది. గ్లామర్ ని సాంప్రదాయ బద్ధంగా ఎలివేట్ చేసే నైపుణ్యం కనిపించింది. ధడక్‌తో ఆరంగేట్రం చేసిన జాన్వీ సహనటుడు ఇషాన్ ఖట్టర్ కూడా కేన్స్ 2025లో సందడి చేస్తుండడం విశేషం. అతడు విశాల్ జెత్వా కూడా జాన్వీతో పాటు కేన్స్‌లో సందడి చేస్తూ కనిపించారు. ఈ ముగ్గురూ కేన్స్ 2025లో 'హోమ్ బౌండ్' ప్రపంచ ప్రీమియర్ కోసం ఆత్రుతగా కనిపిం చారు. ఈ ఉత్సవాల్లో జాన్వీ కపూర్ గురూజీ, ప్రముఖ దర్శక నిర్మాత కరణ్ జోహార్ కూడా ఉన్నారు. కరణ్ ధర్మ ప్రొడక్షన్స్ భాగస్వామి అయిన బిలియనీర్ అదర్ పూనవాలా భార్య నటాషా కూడా సందడి చేసారు. జాన్వీతో సోదరి ఖుషీ కపూర్, ఆమె ప్రియుడు శిఖర్ పహారియా కూడా బృందంలో చేరారు. వారి స్నేహి తుడు ఓర్హాన్ అవత్రమణి అలియాస్ ఓర్రీ కూడా సందడి చేయడం హాట్ టాపిగ్గా మారింది. నీరజ్ ఘయ్యాన్ దర్శకత్వం వహించిన హోమ్ బౌండ్ ప్రచారానికి ఏకమవ్వడం విశేషం.

## బచ్చన్ బ్యూటీ కవ్వింపులకు ఫిదా



పూణేకి చెందిన ముద్దుగుమ్మ భాగ్యశ్రీ బోర్సే టాలీవుడ్‌లో సెటిల్ కావడానికి ప్రయత్నాలు చేస్తోంది. నటిగా, మోడల్‌గా కెరీర్‌లో ముందుకు సాగుతున్న ఈ అమ్మడు తెలుగు ప్రేక్షకులకు రవితేజ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన మిస్టర్ బచ్చన్ సినిమాతో పరిచయం అయింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద అతి పెద్ద డిజాస్టర్‌గా నిలిచింది. పైగా సినిమాలో భాగ్యశ్రీ బోర్సే పాత్రను ప్రాముఖ్యత లేకుండా దర్శకుడు డిజైన్ చేశాడు. అయినా కూడా తన అందంతో భాగ్యం అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ అందంతో టాలీవుడ్‌లో మరో అవకాశం దక్కించుకుంది. ఏకంగా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండతో కలిసి నటించిన భాగ్యశ్రీ త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. విజయ్ దేవరకొండ, గౌతమ్ తిన్ననూరి కాంబోలో రూపొందిన కింగ్‌డమ్ సినిమా విడుదలకు సిద్ధం అయింది. ఆ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. ఆ సినిమాతో పాటు మరో తెలుగు సినిమాలోనూ భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపిక అయిందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు ఆ విషయమై క్లారిటీ రాలేదు. ఇంకా చర్చల దశలోనే ఆ సినిమా ఉందని తెలుస్తోంది. నటిగా తనను తాను నిరూపించుకునేందుకు గాను ఈ అమ్మడు తెగ ప్రయత్నాలు చేస్తోంది. కింగ్‌డమ్ సినిమా హిట్ అయి, అందులో ఈమె పాత్రకు గుర్తింపు లభిస్తే తప్పకుండా టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా ఈ అమ్మడు మారడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇక ఈ అమ్మడు ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరో సారి ఇన్‌స్టాలో భాగ్యశ్రీ బోర్సే తన కవ్వించే

## దిల్‌రాజు గుడ్‌న్యూస్

దిల్ రాజు డ్రీమ్స్'.. టాలెంట్ ఉన్నవారికి చెప్పిన నిర్మాత టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్ రాజు సినీ పరిశ్రమలోకి కొత్త టాలెంట్‌ను తీసుకురావడంలో ముందుంటారు. తాజాగా ఆయన 'దిల్ రాజు డ్రీమ్స్' పేరుతో ఓ కొత్త ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించారు. జూన్ నుండి యాక్టివ్ కానున్న ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా నటులు, దర్శకులు, టెక్నీషియన్లు తమ వివరాలు నమోదు చేయవచ్చు. వారిని దిల్ రాజు టీమ్ స్వయంగా సంప్రదించనుంది. డిస్ట్రిబ్యూటర్‌గా ప్రస్థానం మొదలుపెట్టిన ఆయన తొలి సినిమాగా 'దిల్' తీసి దాన్నే ఇంటిపేరుగా మార్చేసుకున్నారు. పెద్ద హీరోలు, స్టార్ డైరెక్టర్లతో కాకుండా కొత్త టాలెంట్‌ని ఎంకరేజ్ చేయడంలోనూ ఆయన అందరికంటే ముందుంటారు. ఇప్పుడు ఇండస్ట్రీని ఏలుతోన్న ఎంతోమంది హీరోలు, హీరోయిన్లు, డైరెక్టర్లు, టెక్నీషియన్లుదిల్ రాజు కంపెనీ నుంచి వచ్చినవారే. తెలుగు సినీ పరిశ్రమకి ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరానికి కృషి చేస్తుంటారు. తాజాగా మరో ముందడుగు వేసిన ఆయన సినీ పరిశ్రమకు కొత్త టాలెంట్‌ని పరిచయం చేసేందుకు ముందుకొచ్చారు.టాలీవుడ్‌కి కొత్త టాలెంట్‌ని పరిచయం చేసేందుకు దిల్ రాజు తాజాగా "దిల్ రాజు డ్రీమ్స్" అనే ప్లాట్‌ఫామ్ ప్రారంభించారు. ఎప్పుడూ ఫ్రెష్ టాలెంట్‌ని ఎంకరేజ్ చేసే ఆయన ఇప్పుడు తాజా ప్లాట్‌ఫామ్ ద్వారా యంగ్ టాలెంట్‌ని ఇండస్ట్రీకి అందించనున్నారు. జూన్ నుంచి యాక్టివ్ అయ్యే ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో భాగస్వామ్యం కావాలనుకునేవారు https://dilrajudreams.com లింక్‌పై క్లిక్ చేసి తమ వివరాలను నమోదు చేస్తే దిల్ రాజు డ్రీమ్స్ బృందం స్వయంగా వారిని సంప్రదిస్తుంది.

## త్రివిక్రంను వదలని పూనంకౌర్



నా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి.. త్రివిక్రమ్‌ని ఎవరో పొలిటికల్ లీడర్ కాపాడుతున్నారు..ఒకప్పటి పాపులర్ నటి పూనమ్ కౌర్ ఇటీవల వివాదాలతో వార్తలలో నిలుస్తుండడం మనం చూస్తూ ఉన్నాం. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, త్రివిక్రమ్‌లని టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో ఆసక్తికర కామెంట్స్ చేస్తూ ఉంటుంది. గతంలో త్రివిక్రమ్‌పై పూనమ్ కౌర్ సంచలన కామెంట్స్ చేయగా, ఇప్పుడు దానిపై మరోసారి స్పందించి వార్తలలో నిలిచింది .నేను గతంలో చెప్పాను, ఇప్పుడు కూడా చెబుతున్నాను. మెయిల్ ద్వారా కంప్లైంట్ చేశాను. ఝాన్సీ గారితో మాట్లాడాను, కాని తర్వాత ఆమెని కలవలేకపోయిను. ఆమె బిజీగా ఉన్నారని, డిస్టర్బ్ చేయొద్దని చెప్పారు. అందుకే కలవలేకపోయాను.నేను త్రివిక్రమ్ శ్రీనివాస్ మీద కంప్లైంట్ చేశాను. రాజకీయ అండదండలతో ఎవరైతే తప్పించుకుంటున్నారో అతడి మీద ఫిర్యాదు చేశాను.. మెయిల్ చేసినట్టుగానే ఉమెన్ టీంతో నేను మాట్లాడతాను.. థాంక్యూ అని పూనమ్ పోస్ట్ వేసింది. తన వద్ద ఆధారాలు ఉన్నాయంటూ ఝాన్సీతో చాట్ చేసిన స్క్రీన్ షాట్లను కూడా ఆమె బయటపెట్టారు. ఈ క్రమంలో మరోసారి వీరి వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబుని పూనమ్ కలవగా, అందుకు సంబంధించిన ఫొటో నెట్టింట వైరల్ అయింది. ఆ ఫొటో చూసి త్రివిక్రమ్‌తో సమస్య సమసిపోయిందని , అందుకే కూటమి ప్రభుత్వంలో పవన్ ఉన్నా కూడా చంద్రబాబుని కలిసింది అని అంతా అనుకున్నారు. కాని ఇప్పుడు ఆమె పోస్ట్‌లు చర్చనీయాంశంగా మారాయి.మలయాళ ఇండస్ట్రీ, మీటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్న టైంలోనే పూనమ్ కౌర్ మాటల మాంత్రికుడు త్రివిక్రమ్‌పై సంచలన ఆరోపణలు చేశారు. సినిమా అవకాశాల పేరుతో తనను ఛీట్ చేశారని.. ఇండస్ట్రీలో ఎదగకుండా తొక్కేశారని పూనమ్ పెద్ద ఎత్తునే విమర్శలు చేసింది. మాలో కూడా ఈ విషయంపై ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. అయితే దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాజకీయంగా తనని ఇబ్బందికి గురి చేశారని, అందుకే అప్పట్లో వదిలేశానని చెప్పింది.

## బన్నీ సుక్కు లేకుండా మరో ఆర్య.. సాధ్యమేనా?



'ఆర్య' సిని మా అప్పట్లో ఒక సెన్సేషన్. దిల్ రాజు, సుకుమార్, అల్లు అర్జున్ కెరీర్‌కు సాలిడ్ బూస్ట్ ఇచ్చిన సినిమా. లవ్ స్టోరీల్లో అదో ట్రెండ్ సెట్ చేసింది. పాటలు, క్యారెక్టరైజేషన్, స్టైల్.. ఏ కోణంలో చూసుకున్నా ఇప్పటికీ కొత్తగా అనిపిస్తుంది. ఆ మధ్య ఈ సినిమా విడుదలై ఇరవై ఏళ్లు పూర్తి కాగా, టీమ్ అంతా కలిసి సంబరాలు కూడా చేసుకున్నారు. ఈ సినిమా ద్వారా అల్లు అర్జున్ స్టార్ హీరోగా ఎదిగాడు, సుకుమార్ దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు.ఆర్య వచ్చిన ఐదేళ్ల అనంతరం మరో నిర్మాతతో 'ఆర్య 2' సినిమా చేశారు. కానీ అది వర్కౌట్ కాలేదు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సఫలం కాలేదు. అయినప్పటికీ, 'ఆర్య' సినిమా యొక్క విజయం అభిమానుల్లో గుర్తింపును కొనసాగించింది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు 'ఆర్య 3' టైటిల్‌ను రిజిస్ట్రేషన్ చేయడం మరో హైలెట్. దిల్ రాజు ఈ సినిమాకు మరోసారి జీవం పోసేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ టైటిల్ రిజిస్ట్రేషన్ అభిమానుల్లో భారీ అంచనాలను క్రియేట్ చేసింది.దిల్ రాజు ఈ సినిమాపై ఆసక్తి గట్టిగానే ఉంది. కానీ, అల్లు అర్జున్–సుకుమార్ కాంబినేషన్‌లో ఈ సినిమా ఇప్పట్లో చేసే అవకాశం లేదు. వారి ముందున్న కమిట్మెంట్స్ కు మరో నాలుగు ఏళ్ల సమయం పట్టవచ్చు. 'పుష్ప 3' సినిమా పూర్తి కావాల్సి ఉంది. దేశం మొత్తం ఇప్పుడు 'పుష్ప 3' మూడ్‌లో ఉంది. ఈ సినిమా ఎప్పుడొస్తుందా అని అభిమానులు ఎదురు చూస్తున్నారు. మరోవైపు బన్నీ లైనప్ లో అట్లీ – త్రివిక్రమ్ – వంగా లాంటి దర్శకులు ఉన్నారు. ఈ నేపథ్యంలో, 'ఆర్య 3' కోసం సమయం పడుతుంది.

కానీ దిల్ రాజు 'ఆర్య 3'పై ఆసక్తి గట్టిగానే ఉంది. దీంతో సుకు సహాయంతో దిల్ రాజు వేరే వారితో ప్లాన్ చేయాలనే ఆలోచనలో ఉన్నాడు. సుకుమార్ దగ్గర కథ మాత్రమే తీసుకొని, మరో హీరో, మరో దర్శకుడు కలిసి ఈ సినిమాని పూర్తి చేయాలని ఆలోచిస్తున్నాడు. కానీ, అభిమానులు అల్లు అర్జున్–సుకుమార్ కాంబినేషన్ లోనే 'ఆర్య 3'ను చూడాలని కోరుకుంటున్నారు.ఈ కాంబినేషన్ మ్యాజిక్ మరోసారి స్క్రీన్‌పై కనపడాలని అభిమానులు ఆశిస్తున్నారు. మరి ఈ విషయంపై రాజుగారి నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి. వేరే వాళ్ళతో చేస్తే చాలా జాగ్రత్తలు తీసుకొని చేయాలి. కంటెంట్ ఎంతో ఫ్రెష్‌గా ఉంటే గాని ఆడియెన్స్ యాక్సెప్ట్ చేసే అవకాశం ఉండదు. మరి సుకుమార్ దిల్ రాజు కోరిక మేరకు కథను అందిస్తారో లేదో

## ఢిల్లీ - ముంబై మ్యాచ్‌కు వర్షం ముప్పు..



**న్యూఢిల్లీ–నవభూమి:** ఐపీఎల్ 2025లో భాగంగా నేడు రాత్రి 7.30 గంటలకు వాంఖడే స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్ ముంబై ఇండియన్స్ మధ్య కీలక మ్యాచ్ జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌కు వాతావరణం ప్రధాన అడ్డంకిగా మారింది. భారీ వర్షం, ఉరుములు, తుఫాను వంటి పరిస్థితులు మ్యాచ్‌ను అడ్డుకునేలా ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ క్రమంలో నేడు సాయంత్రం ముంబైలో 2 నుంచి 4 గంటల మధ్య వర్షం పడే అవకాశం 80%-%90% ఉందని వెదర్ రిపోర్ట్ అంచనా వేసింది. ఈ పరిస్థితులు మ్యాచ్‌కు అడ్డంకిగా మారనున్నాయి. వర్షం అలాగే రాత్రి వరకు కొనసాగితే మ్యాచ్ రద్దయ్యే ఛాన్సుంది.మ్యాచ్ రద్దు అయితే పరిస్థితి ఎలా ఉంటుంది..ఒకవేళ మ్యాచ్ రద్దు అయితే, రెండు జట్లు ఒక్కో పాయింట్‌ను పంచుకుంటాయి. ప్రస్తుతం ముంబై ఇండియన్స్ 14 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది, ఢిల్లీ క్యాపిటల్స్ 13 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. ఈ పాయింట్ల పంచుకోవడం ద్వారా %MI%కి ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే వారి నెట్ రన్ రేట్ %DC% కంటే మెరుగ్గా ఉంది. అయితే, %DC%కు ప్లేఆఫ్ అవకాశాలు క్షీణిస్తాయి . ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేఆఫ్ బెర్తును నిర్ధారించుకోవాలంటే, వారు ముంబైని ఓడించి, తమ చివరి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌ను కూడా ఓడించాలి.

## అహ్మదాబాద్‌లో ఫైనల్



**న్యూఢిల్లీ–నవభూమి:** ఐపీఎల్ ప్లేఆఫ్స్ వేదికలను మంగళవారం బీసీసీఐ ప్రకటించింది. దీంట్లో భాగంగా జూన్3న జరిగే ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్‌లో జరుగుతుంది. దీనికి ముందు జూన్ ఒకటిన జరిగే క్వాలిఫయర్ 2 కూడా ఇక్కడే నిర్వహించనున్నారు. అలాగే క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ మ్యాచ్‌లు న్యూ చండీగఢ్‌కు సమీపంలోని ముల్లన్‌పూర్ నూతన స్టేడియంలో జరుగనున్నాయి. టాప్–2 జట్లు ఆడే క్వాలిఫయర్1లో విజేత నేరుగా ఫైనల్‌కు చేరే విషయం తెలిసిందే. అయితే ప్లేఆఫ్స్‌లో ఈ నాలుగు మ్యాచ్‌లు కూడా గత షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్, కోల్‌కతాలో జరగాల్సింది. కానీ ప్రయాణ సమస్యలు, వాతావరణ పరిస్థితుల వల్ల వేదికలను మార్చారు. కాగా ఐపీఎల్ ఫైనల్‌కు అత్యధికంగా మూడోసారి ఆతిథ్యమివ్వనున్న అహ్మదాబాద్ సరికొత్త చరిత్ర సృష్టించింది.ఆర్‌సీబీ మ్యాచ్ లఖ్‌నవూలో..: బెంగళూరులో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆర్‌సీబీ తమ సొంత వేదికను మార్చింది. చిన్నస్వామి స్టేడియంలో ఈనెల 23న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ ఆడాల్సి ఉంది. అయితే అదే రోజున లఖ్‌నవూ వేదికగా ఈ రెండు జట్లు తలపడనున్నాయి. 2 గంటల ఎక్స్‌ట్రా టైమ్..ఈ సీజన్ ఐపీఎల్‌లో జరగబోయే మిగిలిన అన్ని లీగ్ మ్యాచ్‌లకు మరో గంట అదనపు సమయం కేటాయించారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని బీసీసీఐ ప్రకటించింది. ఏవైనా అవాంతరాలు ఏర్పడితే మ్యాచ్ నిర్వహణ కోసం మామూలుగానైతే లీగ్ మ్యాచ్‌లకు గంట, ప్లే ఆఫ్స్‌కు 2 గంటల ఎక్స్‌ట్రా టైమ్ ఉంటుంది.

నవక్రీడ

## ధోనీ కాళ్లు మొక్కిన వైభవ్ సూర్యవంశీ..



**న్యూఢిల్లీ–నవభూమి:** రాజస్థాన్ రాయల్స్ ప్లేయర్ వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం ఓ సెన్సేషన్. 14 ఏళ్ల ఆ యువ క్రికెటర్ తన ఆటతీరులో అందర్నీ స్టన్ చేశాడు. భారీ షాట్లతో అలరిస్తున్న ఆ కుర్రాడు.. చెన్నైతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లోనూ దుమ్మురేపాడు. కేవలం 33 బంతుల్లోనే 57 రన్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అయితే మ్యాచ్ ముగిశాక.. క్రికెటర్లు గ్రీటింగ్స్ చెప్పుకుంటున్న సమయంలో.. టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ కాళ్లు మొక్కాడు వైభవ్. సీనియర్ల పట్ల ఉన్న తన గౌరవాన్ని చాటుకున్నాడు ఆ కుర్రాడు. వరుసగా ఆటగాళ్లు షేక్ హ్యాండ్ ఇచ్చుకుంటున్న సమయంలో.. ఒక చేయితో షేక్ హ్యాండ్ ఇస్తూనే.. మరో చేయితో ధోనీ పాదాన్ని తాకే ప్రయత్నం చేశాడు వైభవ్. ఆ సమయంలో లైట్ స్మైల్ ఇస్తూ వైభవ్‌ను మెచ్చుకున్నాడు ధోనీ. ఈ ఘటన కెమెరాకు చిక్కింది. ప్రస్తుతం ఆ వీడియో వైరల్ అవుతున్నది.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**